Pubilshed from Vijayawada

PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




విజయవాడ VIJAYAWADA | సంపుటి : 15 Vol.No : 15 | సంచిక : 108 Issue No : 108 | గురువారం Thursday | జూలై 30, 2026 30 JULY 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

## ఏపీలో ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీకి తైవాన్ కంపెనీల ఆసక్తి

**సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ లతో తైవాన్ ప్రతినిధి బృందం భేటీ**



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి: ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు సహా అధునాత తయారీ, సాంకేతిక రంగాల్లో ఏపీతో భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునే దిశగా తైవాన్ పారిశ్రామిక ప్రతినిధుల బృందం సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యింది. తైవాన్ కంపెనీలు, పరిశ్రమలకు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో వివిధ అంశాలపై చర్చలు జరిపింది. తైవాన్ కు చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్ క్యూ, సీబీటీసీ బ్యాంక్, డైమెర్కో మాస్టర్ హిల్, నాన్ పావోరెసిన్స్, ఎవర్ క్లియర్ ఎన్విరానమెంటల్ ఇంజనీరింగ్, షెంగ్ హుయ్ టెక్, టెక్ టాప్ ఇంజనీరింగ్, కేఎస్ టెర్మినల్స్, శాండ్ సన్, జీలీ కన్స్ట్రక్షన్స్ అండ్ ఇంజనీరింగ్, కపెల్లా స్టోర్స్ వంటి అంతర్జాతీయ స్థాయి దిగ్గజ సంస్థల కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైలు, రోడ్డు మార్గాల వంటి పటిష్టమైన లాజిస్టిక్స్ నెట్వర్క్ సహా ఏపీలోని తయారీ రంగ ఎకోసిస్టమ్ గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు తైవాన్ ప్రతినిధుల బృందానికి వివరించారు. ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్లు, ఐటీ, అడ్వాన్స్ మాన్యుఫాక్చరింగ్ సహా ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు విధానపరమైన స్థిరత్వం, వేగంగా అనుమతులు జారీ

2 పేజీలో..

## ఆగస్టు 17 నుంచి భోగాపురం నుంచే విమాన సర్వీసులు



**కేంద్రం**

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆగస్టు 17 అర్ధరాత్రి 12:01 గంటల నుంచి షెడ్యూల్ కమర్షియల్ విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి.ఈ నేపథ్యంలో ప్రస్తుతం కార్యకలాపాలు సాగిస్తున్న విశాఖపట్నం విమానాశ్రయం (ఐఎన్ఎస్ డేగ) సివిల్ ఎన్క్లేవ్ నుంచి షెడ్యూల్ వాణిజ్య విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది.

- మిగతా 2లో..

## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..

**లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం**

- పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం
- పరీక్షల అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పునకు నిబంధన
- నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థుల నిరసనలు, మంత్రి రాజీనామా నేపథ్యంలో ఈ పరిణామం
- పరీక్షల వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడి

వివరాలు 2లో..



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. రెండు రోజుల పాటు వాడివేడిగా సాగిన చర్చల అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ కీలక బిల్లును సభ ఆమోదించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను పెంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది.



### రెండవ దశ ఓటింగ్‌లో లూలాకు ఆధిక్యం

» పోల్ సర్వే

బ్రసీలియా : అక్టోబర్‌లో జరగనున్న బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన తాజా అట్లాస్ ఇంటెల్/బ్లూమ్‌బర్గ్ సర్వేలో, రెండో దశ (రన్‌ఆఫ్) ఓటింగ్‌లో అధ్యక్షుడు లూలా డా సిల్వా ఆధిక్యంలో ఉన్నట్లు వెల్లడైంది.

2 లో



### బొగ్గు గనుల కుంభకోణం

**మాజీ ప్రధానిపై కేసును కొట్టివేసిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ : బొగ్గు గనుల కేటాయింపుల కేసుకు సంబంధించి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై నమోదైన క్రిమినల్ కేసును సుప్రీంకోర్టు బుధవారం మూసివేసింది.

2 లో

## ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ విడుదల పకడ్బందీగా ఉండాలి



- జాబ్ కేలండర్-2026 భాగంగా రెండో దశలో 3,168 ఉద్యోగాల భర్తీ
- సెప్టెంబర్ 15న నోటిఫికేషన్ విడుదల
- జాబ్ కేలండర్-2026పై సమీక్షలో మంత్రుల బృందం దిశానిర్దేశం

2 లో

ప్రజాభూమి ప్రతినిధి,ఉండవల్లి: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. జాబ్ కేలండర్-2026పై మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఉద్యోగాల కల్పనకు ఏర్పాటైన మంత్రుల బృందం ఉండవల్లి నివాసంలో సమీక్ష నిర్వహించింది. ఈ సమావేశానికి మంత్రులు ఆన్ లైన్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో భర్తీ చేయాల్సిన పోస్టుల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

జాబ్ కేలండర్-26లో విడుదల చేసిన 10,060 ఉద్యోగాలను నాలుగు దశల్లో భర్తీ చేయనున్నారు. ఇప్పటికే మొదటి దశ కింద వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ ఏడాది మే 15న నోటిఫికేషన్ విడుదల చేశారు. రెండో దశ కింద 3,168 పోస్టుల భర్తీకి ఆగష్టు 15 నోటిఫికేషన్ విడుదల చేయాలని మొదట నిర్ణయించినప్పటికీ.. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో వివిధ సాంకేతిక కారణాలు, ఉద్యోగ సంఘాల వినతి మేరకు జాప్యం జరిగింది. దీంతో సెప్టెంబర్ 15న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

**అక్టోబర్ 15న 3,4 దశల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్**

జాబ్ కేలండర్ లో భాగంగా ఒకేసారి మూడు, నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీకి అక్టోబర్ 15న నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలని

## అరుదైన వృక్ష జాతి మొక్కకు నామకరణం

- "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్" అని పేరు పెట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- తూర్పు కనుమల్లోని ఉబ్బలమడుగు జలపాతం ప్రాంతంలో గుర్తించిన కొత్త వృక్ష జాతి

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : తిరుపతి జిల్లా పరిధిలోని తూర్పు కనుమల్లో కొత్తగా గుర్తించిన అరుదైన వృక్ష జాతికి చెందిన మొక్కకు ఉప ముఖ్యమంత్రి అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నామకరణం చేశారు. యూఫోర్బియేసీ (జుబజూప్తృశీతీఎఖుఎమ్మువ) కుటుంబానికి చెందిన ఈ కొత్త జాతికి "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్" (జతీశీశీఅ ఖఎఖ్ఖశ్రీఖుఎఖుసబస్త్రవఅంఅం) అని పేరు పెట్టారు. ఉబ్బలమడుగు జలపాతానికి సమీపంలోని కంబకం కొండల ప్రాంతం ఈ మొక్కకు సహజ ఆవాసంగా ఉండటంతో, ఆ ప్రాంత పర్యావరణ ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఈ పేరును ఖరారు చేశారు.

2 పేజీలో..



## ఐటీ, మెటల్ షేర్ల జోరుతో మార్కెట్ ర్యాలీ..!

**సెన్సెక్స్ 889 పాయింట్లు, నిఫ్టీ 265 పాయింట్లు లాభం**



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ఉత్సాహంగా ముగిశాయి. ఐటి, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో బెంచ్‌మార్క్ సూచీలు దాదాపు ఒక శాతం మేర లాభపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 888.68 పాయింట్లు (1.16 శాతం) ఎగసి 76,654.60 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 264.85 పాయింట్లు (1.10 శాతం) పెరిగి 24,250.20 వద్ద స్థిరపడింది. రోజంతా ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 77,765.49 పాయింట్ల గరిష్ట స్థాయిని, 77,333.24 పాయింట్ల కనిష్ట స్థాయిని నమోదు చేసింది. విస్తృత మార్కెట్‌లోనూ సానుకూల ధోరణి కొనసాగింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 50.16 పాయింట్లు, స్మాల్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 102.92 పాయింట్లు పెరిగాయి.

- మిగతా 2లో..

## డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్‌సీపీ పోరాటం ఉధృతం



ప్రజాభూమి ప్రతినిధి, తాడేపల్లి: డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్‌సీపీ పోరాటం ఉధృతం చేసింది. మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. డీఎస్సీ అక్రమాలపై సీబీఐతో విచారణ కోరుతూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు దిగిన సంగతి తెలిసిందే. ఈ నెల 31న అన్ని జిల్లాల కలెక్టర్లకు వైఎస్సార్‌సీపీ నేతలు వినతి పత్రాలు సమర్పించనున్నారు. వచ్చే నెల ఆగస్టు 3, 4 తేదీలలో అన్ని నియోజకవర్గాలోనూ టౌన్ హాలు సమావేశాలు నిర్వహించడంతో పాటు 6 నుండి 9 వరకు నియోజకవర్గాల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. 10న పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని తెలిపారు.

వివరాలు 2లో..

## అమిత్‌షా ఆదేశాల మేరకే విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం



**లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ**

న్యూఢిల్లీ : హోంమంత్రి అమిత్‌షా ఆదేశాల మేరకే పోలీసులు విద్యార్థులపై దౌర్జన్యానికి దిగారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నిజమైన శత్రువు ఆర్ఎస్ఎస్ అని, దేశ విద్యావ్యవస్థను ఆర్ఎస్ఎస్ తన గుప్పిట్లోకి తీసుకుందని అన్నారు. వాస్తవానికి విద్యాశాఖను ధర్మేంద్ర ప్రధాన్ నిర్వహించడం లేదని, దీంతో ఆయన రాజీనామా పైపై చర్య మాత్రమేనని అన్నారు. విద్యావ్యవస్థను ఆర్ఎస్ఎస్ తన గుప్పిట్లోకి తీసుకుందని, విద్యార్థులను స్వతంత్రంగా, స్వేచ్ఛగా ఆలోచించడాన్ని తిరస్కరిస్తుందని అన్నారు.

2 పేజీలో..

# అమిత్‌షా ఆదేశాల మేరకే విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం

వ్యవస్థ పూర్తిగా ఆర్ఎస్ఎస్ చేతుల్లోకి వెళ్లిందని, విద్యాశాఖను నడిపే వ్యక్తి మంత్రి కార్యాలయంలో కూర్చున్న ఒక ఓఎస్‌డి (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) మాత్రమేనని ఎద్దేవా చేశారు. విద్యార్థులు తమ ఆసక్తులను అనుసరించకుండా మరియు వ్యవస్థను ప్రశ్నించకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. విద్యార్థులను విద్యార్థులుగా ఉండనివ్వరని, వారి అభిరుచులను అనుసరించనివ్వరని, వారికి అనిపించినది చెప్పనివ్వరని, వారు అడగాలనుకున్న ప్రశ్నలను అడగనివ్వరని అన్నారు. ఇది విద్యార్థుల్లో తీవ్ర అసహనాన్ని కలిగిస్తోందని అన్నారు. ఆర్ఎస్ఎస్ రచించిన అర్థరహిత చరిత్రను విద్యార్థులు తప్పక నమ్మాల్సి ఉంటుందని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ కేవలం ఒక ప్రతీక మాత్రమేనని, అసలైన శత్రువు ఆర్ఎస్ఎస్ అని మండిపడ్డారు. విద్యార్థులను 'అంధభక్తులు'గా మార్చాలని కోరుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పేపర్ లీక్ వ్యతిరేక బిల్లును ఆమోదించిన లోక్‌సభ :** పేపర్ లీక్ వ్యతిరేక బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది. మూజువాణి ఓటుతో ఈ బిల్లును సభ ఆమోదించింది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష? నేత రాహుల్ గాంధీ కేంద్రంపై విరుచుకుపడ్డారు.



## సంపాదకీయం

### పరీక్షల బిల్లుతో సమస్య సమిసిపోయేనా?

పిల్లికి చెలగాటం...ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా మన పరీక్షల విధానం మారింది. ఇటీవల నీట్ ప్రవేశ పరీక్షల లీక్‌తో మన పరీక్షల విధానం ఎంత డొల్లగా ఉందో తేలిపోయింది. డబ్బులకు కక్కుర్తి పడే లెక్చరర్లు ఉండడం దౌర్భాగ్యం. విద్యార్థులు ఏమైతేనేమి మనకు కాసులు రాలుతున్నాయని పేపర్లను లీక్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలి నీట్ పేపర్ లీక్‌తో కాక్రోచ్ పార్టీ ఉద్యమించడం, అంతే స్పీడ్‌గా ఇప్పుడు పార్లమెంటులో పేపర్ లీక్ నిరోధక బిల్లుపై చర్చ సాగుతోంది. ఈ చర్చలో గమనించిన విషయమేమిటంటే విపక్షాలకు కూడా పకడ్బందీ విధానం ఎలా అమలు చేయాలన్న దానిపై అవగాహన లేదని తేలిపోయింది. చర్చలో పాల్గొన్న ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, గగోయ్, అఖిలేశ్ యాదవ్‌లు విమర్శలు చేశారే తప్ప
పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అసవరమైన సూచనలు చేయలేక పోయారు. కాక్రచ్ ఉద్యమాన్ని ముందుకేసుకుని ప్రభుత్వాన్ని తూర్పారాబట్టడం మాత్రమే చేస్తున్నారు. పరీక్షలను ఎలా పకడ్బందీగా ఎలా నిర్వహించాలో నిర్మాణాత్మక సూచనలు చేయలేదు. ప్రభుత్వం కూడా ఎంతసేపు శిక్షలపైనే దృష్టి పెట్టింది తప్ప, పరీక్షలను పక్కాగా నిర్వహించడం ఎలా అన్నదానిపై దృష్టి సారించడం లేదు. నిజంగానే ఆదరాబాదరాగా తెచ్చిన ఈ బిల్లులో కఠిన శిక్షలతో పాటు, పరీక్షలను సంస్కరించే విధంగా నిబంధనలు పొందుపర్చాలి. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే మంత్రి రాజీనామాతోనే భ్రష్టుపట్టిన మన దేశ విద్యా వ్యవస్థ మారిపోదు. పరీక్ష పేపర్ లీకేజీలు, అవకతవకలు, అవినీతి వంటి సమస్యలు తొలగిపోవాటంలే పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ఎందుకంటే పేపర్ లీకేజీలకు మూలం డబ్బుల మాయగా ఉంది. ఈజీగా డబ్బు సంపాదించే క్రమంలో ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నారు. మెడికల్ కాలేజీల ప్రవేశానికి లక్షల మంది రాసే పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చట్టబద్ధతను సమీక్షించాలి. వాస్తవానికి ఎన్టీఏ అనేది ఒక అకడమిక్ బాడీ కూడా కాదని ఎంతమందికి తెలుసు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటైన సంస్థ అంతకన్నా కాదు. కేవలం కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ మాత్రమే అని ఇక్కడ గుర్తించాలి. దానికంటూ స్వతంత్రత, స్వయంప్రతిపత్తి ఏమీ లేవు. అలాంటి సంస్థకు దేశంలోని నీట్‌తో సహా అనేక ప్రవేశ పరీక్షలను, పోటీ పరీక్షలను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. ఈ కారణంగా దేశ విద్యారంగాన్నంతా కేంద్ర ప్రభుత్వం అధీనంలోకి తెచ్చుకునే అధికారాల కేంద్రీకరణ విధానం. అందువల్లనే పరీక్షలలో అక్రమాలు, అవకతవకలు, అవినీతి వ్యవహారాలు సాగుతున్నాయి. నీట్ కోచింగ్ సెంటర్స్‌ను నిర్వహిస్తున్న వారే నీట్ పేపర్ సెట్టర్స్‌గా అవతారమెత్తారంటే ఎన్టీఏ కేంద్రంగా కోచింగ్ మాఫియా ఏ స్థాయిలో బలంగా వేళ్లూనుకుందో చెప్పవచ్చు. ఈ విధమైన వేల కోట్ల రూపాయల అవినీతి వ్యాపారం సాగుతుఓంది. అధికారుల అండదండలు లేకుండా ఇది జరు9గుతందని అనుకోవడానికి లేదు. అందువల్ల ఈ ఎన్టీఏ స్థానంలో ప్రస్తుతం బిల్లు ఏ ర కంగా ఉంటుందో తెలియదు. పార్లమెంటులో చర్చ సాగుతున్నా సీరియస్‌నెస్ కానరావడం లేదు. బిల్లులో కేంద్రాన్ని విమర్శించడం తప్ప నిర్మాణాత్మక సూచనలు చేయడంలో విపక్ష పార్టీలు విఫలం అయ్యాయి. కావున ఎన్టీఏ ఉనికిని, దాని చుట్టూ బలంగా అల్లుకొని ఉన్న అవినీతి చట్రాన్ని బ్రద్దలు కొట్టాలి. లేదంటే కంటితుడుపు చర్యగా పేపర్ లీకేజీలో దళారి పాత్ర పోషించిన కొద్దిమంది నేరస్తులను బలి ఇవ్వడం, ఎన్టీఏలోని కొద్దిమంది అధికారులను తొలగించడం వంటి కసరత్తుగా మిగిలి పోతుంది. ఇంత ఆగ్రహం, ఆందోళన చెలరేగిన నేపథ్యంలో అసమర్థ ఎన్టీఏను రద్దుచేసి, తిరిగి రాష్ట్రాల స్థాయిలోనే మెడికల్ అడ్మిషన్స్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహించాలనే డిమాండ్ ను కూడా
పునఃపరిశీలించడం అవసరం. ఉమ్మడి జాబితాలోని విద్యపై రాష్ట్రాల హక్కులను హరిస్తున్న, రాజ్యాంగ ఫెడరల్ సూత్రాలను కాలరాస్తున్న విద్యా కేంద్రీకరణ విధానానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. పేపర్ లీకేజి సమస్య అనేది నేడు కొత్తగా తలెత్తినది కాదు. గతంలో కూడా మెడికల్, ఇంజినీరింగ్, వంటి కోర్సులకు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలలోనూ అక్రమాలు, అవకతవకలు, లీకేజీలు చోటుచేసుకున్నాయి. చదువులంటే మెడికల్, ఇంజినీరింగ్, కంప్యూటర్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సరికొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ కోర్సులు అన్న భావన బలపడి పోయింది. జేఈఈ, నీట్ పరీక్షలలో మంచి ర్యాంకులు పొందడమే మహా యజ్ఞమైంది. మిగతావన్నీ కొరగానివిగా, అర్థకుల చదువులుగా భావించే అపోహ బలపడ్డాయి. ఇదే అదనుగా కోచింగ్ సెంటర్లు పుట్టుకు వచ్చాయి. కోటళ్లో వ్యాపారాలు సాగుతున్నాయి. ప్రభుత్వాలు విద్యను ఒక వ్యాపార సరుకుగా మార్చేశాయి. ప్రైవేట్ రంగం విజృంభించడానికి ఇలాంటి నీట్ పరీక్షల విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. దీనికితోడు సమాజంలో నిరుద్యోగం, ఉపాధి లేమి అంతకంతకూ పెరుగుతుండడంతో పిల్లల భవిష్యత్తు యెడల అంతులేని అభద్రతాభావం తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఈ పరిస్థితులే కార్పొరేట్ విద్యకు, కోట్ల వ్యాపారానికి, కోచింగ్ సెంటర్ల మాఫియా ముఠాలకు కేంద్రాలుగా మారాయి. పిల్లల చదువులు, వారి భవిష్యత్తు పట్ల సమాజంలో ఎంతో ఆసక్తి, ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఒక బలమైన ప్రజా ఉద్యమం ద్వారానే మన దేశ విద్యా వ్యవస్థను మార్చడం సాధ్యమవుతుంది. కొత్తగా తీసుకుని వస్తున్న బిల్లు వల్ల మంచి ఫలితాలు వస్తాయని చెప్పడానికి లేదు. లీకులకు అలవాటు పడ్డవారు ఎలాంటి శిక్షలకైనా తెగిస్తారు. కోర్టుల్లో బెయిల్ పొందడం వంటి వెసలుబాట్లను ఉపయోగించుకుంటారు. అందువల్ల సమగ్ర విద్యావిధానంపై చర్చించి, విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలకు నడుంబిగించాలి. కనీసం విపక్షాలయినా ఈ బిల్లు సందర్భంలో ప్రమాణాలపై చర్చివుంటే బాగుంటుంది.

## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..



2024 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రూపొందించిన ఈ కొత్త బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలను చేర్చారు. దీని ప్రకారం పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే దోషులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేగాక దోషుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టులు మూడు నెలల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది.ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు.నీట్ అక్రమాలు, ఇతర పరీక్షల్లో అవకతవకాలపైన జులై 20న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో 'సంసద్ చలో' పేరిట వందలాది మంది విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజకీయ ఒత్తిడి, దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చట్టాన్ని తీసుకురావడం గమనార్హం.

## ఐటీ, మెటల్ షేర్ల జోరుతో మార్కెట్ ర్యాలీ ..!

రంగాల వారీగా నిఫ్టీ ఐటీ సూచీ 2.32 శాతం, నిఫ్టీ రియాల్టీ సూచీ 2.31 శాతం చొప్పున లాభపడగా, నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీలు కూడా బలమైన ప్రదర్శన కనబరిచాయి. సెన్సెక్స్‌లోని హిందుస్తాన్ యునిలీవర్, ఇన్ఫోసిస్, టాటా స్టీల్, ట్రెంట్, లార్సెన్ అండ్ టర్బో షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. వీటిలో హిందుస్తాన్ యునిలీవర్ షేరు అత్యధికంగా 4.70 శాతం ఎగిసింది. మరోవైపు అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఎంఅండ్ఎం, పవర్ గ్రిడ్, ఎన్టీపీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్ షేరు అత్యధికంగా 3.19 శాతం పడిపోయింది.సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 25 షేర్లు లాభాల్లో ముగియగా, ఐదు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ-50లో 38 షేర్లు లాభపడగా, 12 షేర్లు నష్టాలను నమోదు చేశాయి. విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 0.11 శాతం బలపడి 95.62 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 87.65 డాలర్లు, బంగారం ఔన్స్ ధర 4,031.84 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.




## బొగ్గు గనుల కుంభకోణం

ఆయనకు ట్రయల్ కోర్టు జారీ చేసిన సమన్లను రద్దు చేసింది. మాజీ ప్రధాని సహా ఇతరులకు క్లీన్ చిట్ ఇస్తూ సిబిఐ ఇచ్చిన ముగింపు నివేదికను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఆమోదించింది. సిబిఐ ముగింపు నివేదికను ట్రయల్ కోరుట తిరస్కరించేందుకు ఎటువంటి కారణం లేదని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది.బొగ్గు కుంభకోణానికి సంబంధించి 2005లో ఒడిశాలోని తలబిర -2 బొగ్గు బ్లాక్‌ను కేటాయించడంపై మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, వ్యాపారవేత్త కుమారమంగళమ్ బిర్లా, మాజీ బొగ్గు కార్యదర్శి పి.సి.పరాఖ్ సహా మరో ముగ్గురికి ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. తన వంటి ప్రభుత్వ అధికారులపై విచారణ జరపడానికి తప్పనిసరిగా ఉండాల్సిన అనుమతి లేకపోవడాన్ని సింగ్ ప్రశ్నించారు, అలాగే బొగ్గు గనుల కేటాయింపునకు సంబంధించి తాను తీసుకున్న నిర్ణయంలో ఎటువంటి నేరపూరిత చర్య లేదని స్పష్టం చేశారు. 2024 డిసెంబర్‌లో మన్మోహన్ సింగ్ మరణించారు. కానీ ఆ కేసు కొనసాగుతూ వస్తోంది. తాజాగా సుప్రీంకోర్టు ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ.. కేసును మూసివేస్తున్నట్లు ప్రకటించింది.

## డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్‌సీపీ పోరాటం ఉధృతం

కాగా, మెగా డీఎస్సీ--2025 నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని, నైతిక బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా యువత, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నిన్న (మంగళవారం) పార్టీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో భారీ ర్యాలీలు, ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేపట్టారు.ఈ కార్యక్రమానికి యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలి వచ్చి కదంతొక్కారు. డీఎస్సీలో అక్రమాలపై కళ్ల ముందే ఎన్నో సాక్ష్యాలు కనిపిస్తున్నా చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. డీఎస్సీ అభ్యర్థులను దగాకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని ధ్వజమెత్తారు.



## ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ విడుదల పకడ్బందీగా ఉండాలి

అధికారులను మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. మూడో దశలో 2,388, నాలుగో దశలో 2,981 పోస్టులను భర్తీ చేయనున్నారు.
వివిధ విభాగాల్లోని ఖాళీలను డిపార్ట్ మెంట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భర్తీ చేయాలని సీఎం గారు నిర్దేశించారని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. రెండో దశలోని 2,388 ఉద్యోగాల్లో 2,225 పోస్టులు హోంశాఖలో భర్తీ చేయనున్నారు. గ్రూప్-1లో ఇప్పటికే సూచించిన ఉద్యోగాల కంటే మరికొన్ని ఉద్యోగాలు పెంచాల్సిన ఆవశ్యకత ఉందని మంత్రుల బృందం అభిప్రాయపడింది. మొత్తంగా 10,060 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా సకాలంలో పోస్టులు భర్తీ చేసి ప్రతి ఏడాది జాబ్ కేలండర్ విడుదల చేయాలని ఆదేశించారు. జాబ్ కేలండర్-2026 పూర్తి ఖాళీల వివరాలను ఆరో తేదీన జరిగే కేబినెట్ ముందు ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, పి.నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, సాధారణ పరిపాలనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా, ఆర్థికశాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్, ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రవి సుభాష్, ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి గౌతమ్ అల్లాడ పాల్గొన్నారు.



## ఆగస్టు 17 నుంచి భోగాపురం నుంచే విమాన సర్వీసులు

కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం .... విశాఖపట్నం విమానాశ్రయం సివిల్ ఎన్‌క్లేవ్ నుంచి షెడ్యూల్ కమర్షియల్ విమానాల కార్యకలాపాలు 30 సంవత్సరాల పాటు నిలిపివేయబడతాయి. అయితే, జాతీయ అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు ఈ నిబంధన వర్తించదని స్పష్టం చేసింది.

**నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య విమాన సేవలకు కూడా అనుమతి..:** అదేవిధంగా భారతీయ వాయుసేన, ఇతర సాయుధ దళాలు, పోలీసు శాఖకు చెందిన విమానాలు, ప్రభుత్వ అతిథుల రాకపోకల కోసం వినియోగించే ప్రత్యేక విమానాలు, లీజ్ విమానాలు, వీఐపీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి యథావిధిగా కార్యకలాపాలు కొనసాగించనున్నాయి. అలాగే నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య విమాన సేవలకు కూడా అనుమతి కొనసాగుతుందని కేంద్రం తెలిపింది. ఇప్పటి వరకు విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉపయోగిస్తున్న వీటీజెడ్ అంతర్జాతీయ ట్రావెల్ కోడ్‌ను ఆగస్టు 17 అర్ధరాత్రి 12:01 గంటల నుంచి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

**అల్లూరి సీతారామరాజు పేరుతో అధికారిక నామకరణం :** జీఎంఆర్ సంస్థ పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో నిర్మించిన భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంగా అధికారికంగా నామకరణం చేస్తూ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని 2024 సెప్టెంబర్ 18న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు అధికారికంగా ఆమోదం తెలుపుతూ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.



## రెండవ దశ ఓటింగ్‌లో లూలాకు ఆధిక్యం

మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సెనారో కుమారుడు, ప్రతిపక్ష సెనేటర్ ఫ్లావియో బోల్సెనారోకు 42.9 శాతం మద్దతు ఉండగా, లూలాకు 49.2 శాతం మద్దతు లభించినట్లు సర్వే తెలిపింది. జూన్‌లో నిర్వహించిన సర్వేతో పోలిస్తే లూలా మద్దతు 48.8 శాతం నుంచి 49.2 శాతానికి, ఫ్లావియో బోల్సెనారో మద్దతు 42.3 శాతం నుంచి 42.9 శాతానికి పెరిగింది. ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకోని లేదా చెల్లని/ఖాళీ ఓట్లు వేస్తామని తెలిపిన వారి శాతం జూన్‌లో 8.9 శాతం ఉండగా, తాజా సర్వేలో అది 7.9 శాతానికి తగ్గింది. మొదటి దశ ఓటింగ్‌కు సంబంధించిన సర్వేలో లూలాకు 44.9 శాతం, ఫ్లావియో బోల్సెనారోకు 35.8 శాతం, రెనన్ శాంటోస్‌కు 7.8 శాతం, రొనాల్డో కైయాడోకు 3.1 శాతం, రొమెయు జెమాకు 2.8 శాతం మద్దతు లభించినట్లు సర్వే వెల్లడించింది.

## అరుదైన వృక్ష జాతి మొక్కకు నామకరణం

అద్భుతమైన సుగంధ పరిమళాలను వెదజల్లే ఆకులు కలిగిన ఈ మొక్క ప్రత్యేకతలు పవన్ కళ్యాణ్ ని ఆకట్టుకున్నాయి.
ప్రధాన అటవీ సంరక్షణాధికారి (గ్రాజఖీ) పి.వి. చలపతిరావు తన పరిశోధనా సహచరులతో కలిసి తూర్పు కనుమల్లో నిర్వహించిన విస్తృత వృక్షశాస్త్ర పరిశోధనల సందర్భంగా ఈ కొత్త జాతి మొక్కను గుర్తించారు. శాస్త్రీయ పరిశీలనల్లో, సమీప సంబంధిత జాతి అయిన క్రోటన్ అరోమాటికస్ (జతీశీశిఅ ఖతీశీఝఅఏబం) తో పోలిస్తే ఈ మొక్క ప్రత్యేకమైన నిర్మాణం, పునరుత్పత్తి లక్షణాలను కలిగి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఆవిష్కరణ తూర్పు కనుమల అపార జీవ వైవిధ్య సంపదను ప్రతిబింబించడమే కాకుండా, ఆ ప్రాంతంలో మరింత లోతైన శాస్త్రీయ పరిశోధనల ఆవశ్యకతను చాటింది. అత్యంత పరిమిత ప్రాంతంలో మాత్రమే కనిపించడం, సహజ ఆవాసాలపై పెరుగుతున్న ముప్పు క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్ జాతిని అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జాతిగా పరిశోధకులు గుర్తించారు. ఈ శాస్త్రీయ ఆవిష్కరణలు జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, రాష్ట్ర సహజ వారసత్వ సంపద సంరక్షణ పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది.

## ఏపీలో ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీకి తైవాన్ కంపెనీల ఆసక్తి

చేయటంతో పాటు పూర్తి స్థాయి ప్రోత్సాహాన్ని అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. భారత్ లో తమ దేశానికి చెందిన సంస్థలు ఇప్పటికే తయారీ రంగంలో కీలకంగా ఉన్నాయని తైవాన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. తయారీ రంగం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధిలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని చర్చల సందర్భంగా ఏకగ్రీవంగా అంగీకారం కుదిరింది.

**ఐటీ మంత్రితో తైవాన్ బృందం చర్చలు**




అనంతరం ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ తో తైవాన్ ప్రతినిధుల బృందం ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఏపీలో మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల కల్పన విద్యాపరమైన సహకారంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. తైవాన్‌కు చెందిన మాన్యుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ రంగాలలోని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీకి చెందిన యువతకు తగిన నైపుణ్యం, టెక్నికల్ ట్రైనింగ్ సహా ఉన్నత విద్య భాగస్వామ్యాలపై తైవాన్ ప్రతినిధుల బృందంతో చర్చలు జరిగాయి. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, హెల్త్‌కేర్, ఇతర హై-స్కిల్ రంగాలలో పరస్పర సహకారం అందించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రపంచ స్థాయి నైపుణ్య గ్రిడ్‌ను నిర్మించడంతో పాటు మాండరిన్ భాషలో శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సర్టిఫికేషన్, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థి-ఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, ఉద్యోగ-సన్నద్ధత కార్యక్రమాలపై కూడా చర్చలు జరిగాయి. తైవాన్- ఏపీ మధ్య ఈ సమావేశం కీలక మైలు రాయిగా నిలవనుంది.

# ఢిల్లీలో 'బందరు' సమగ్ర అభివృద్ధికి డిమాండ్ ..కేంద్ర మంత్రులతో వరుస భేటీలు

**మచిలీపట్నం - బంటుమిల్లి 20 కి.మీ రోడ్డు విస్తరణకు వినతి**
**రూ.120 కోట్లతో స్వదేశ్ దర్శన్ 2.0 కింద పర్యాటక అభివృద్ధి**

**ఖేలో ఇండియా ద్వారా ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం**
**కోస్టల్ హైవే ప్రాజెక్ట్, మత్స్యకారుల తాగునీటి సమస్యలపై కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు**



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం (బందరు) ప్రాంత సమగ్రాభివృద్ధి, పర్యాటకం, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో కీలక సమావేశాలు నిర్వహించడం జరిగింది. ప్రాంతీయ ప్రయోజనాలు, మత్స్యకారుల సమస్యలు మరియు క్రీడా రంగానికి చేయూత అందించాలని కోరుతూ కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు.1. రహదారుల అనుసంధానం & పారిశ్రామిక ప్రగతికేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ:20 కి.మీ రోడ్డు నిర్మాణం: మచిలీపట్నం-బంటుమిల్లి మధ్య 20 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.పోర్టు & బీచ్ కనెక్టివిటీ: ఈ రోడ్డు వల్ల మచిలీపట్నం పోర్టు, మంగినపూడి బీచ్‌లకు రవాణా సౌకర్యం పెరిగి, టూరిజం వేగవంతం అవుతుంది.పారిశ్రామిక లబ్ధి: పోర్టు ఆధారిత ఇండస్ట్రియల్ కారిడార్లు, లాజిస్టిక్స్ పార్కులు, MSME క్లస్టర్ల ఏర్పాటుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని వివరించారు.2. 'ఖేలో ఇండియా' కింద క్రీడా సదుపాయాలుకేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సేతో భేటీ: రూ. 26 కోట్లతో క్రీడా ప్రాజెక్టులు: బందరును క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 17 కోట్లతో ఇండోర్ స్టేడియం, రూ. 9 కోట్లతో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి ఖేలో ఇండియా ద్వారా నిధులు కేటాయించాలని కోరారు.దీనివల్ల జిల్లా, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ల నిర్వహణకు మార్గం సుగమమవుతుంది.3. రూ. 120 కోట్లతో స్వదేశ్ దర్శన్ 2.0 పర్యాటకంకేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో భేటీ: స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద మచిలీపట్నానికి రూ. 120 కోట్ల ఆర్థిక సాయం అందించాలని వినతిపత్రం ఇచ్చారు. మచిలీపట్నాన్ని మోడల్ కోస్టల్ టూరిజం హబ్‌గా మార్చడం ద్వారా స్థానిక వారసత్వ పరిరక్షణతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపామన్నారు.4. కోస్టల్ హైవే & తీర ప్రాంత సమస్యలుబాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌తో చర్చ: 'కోస్టల్ హైవే ప్రాజెక్ట్'ను మచిలీపట్నం వరకు విస్తరించడం వల్ల సముద్ర తీర ప్రాంత రూపురేఖలు మారతాయని, మత్స్య పరిశ్రమకు ప్రాధాన్యం లభిస్తుందని చర్చించారు.కేంద్ర జల్ శక్తి సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరితో భేటీ: కృష్ణా నది సముద్రంలో కలిసే తీరప్రాంతంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడి సమస్యను వివరించారు. నిరంతర మంచినీటి సరఫరా అందించాలని, మత్స్యకారుల జీవనోపాధిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.కేంద్ర విదేశాంగ సహాయ మంత్రి పబిత్రా మార్గరీటాతో భేటీ: రాష్ట్రంలో శరవేగంగా జరుగుతున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కూలంకషంగా చర్చించడం జరిగింది.మచిలీపట్నం ప్రజా ఆకాంక్షలను నెరవేర్చడమే ధ్యేయం:కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖల మద్దతుతో బందరును పారిశ్రామిక, పర్యాటక, క్రీడా రంగాల్లో రికార్డు స్థాయిలో ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.



# మెగా డీఎస్సీపై వైసీపీ విష ప్రచారం దురుద్దేశపూరితమే

**ఆధారాలు లేకుండా యువతను తప్పుదోవ పట్టించడం మానుకోవాలి**
**పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్పష్టం**
**కూటమి ప్రభుత్వ పారదర్శక నియామకాలపై బురదజల్లే యత్నం: టీడీపీ నాయకులు**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే నిరుద్యోగ యువత మనోభావాలతో చెలగాటమాడుతోందని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ విమర్శించారు. బుధవారం మచిలీపట్నంలోని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత్రికేయుల సమావేశంలో ముఖ్యాంశాలు: 148 రోజుల్లోనే రికార్డు నియామకాలు: ఐదేళ్ల పాలనలో ఒక్క మెగా డీఎస్సీ కూడా ఇవ్వకుండా 'జాబ్ క్యాలెండర్' పేరుతో మోసం చేసిన జగన్‌మోహన్ రెడ్డికి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. కేవలం 148 రోజుల్లోనే రికార్డు స్థాయిలో 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.కోర్టు కేసుల నాటకం: డీఎస్సీ నోటిఫికేషన్ నాటి నుంచే అభ్యర్థులను మానసికంగా దెబ్బతీసేందుకు వైసీపీ నేతలు వరుస కేసులు వేశారని, చివరకు కోర్టులో ఆధారాలు చూపలేక వారి న్యాయ వాదులే క్షమాపణలు చెప్పి కేసులు ఉపసంహరించుకున్న విషయాన్ని గుర్తుచేశారు.బహిరంగ చర్చకు సిద్ధమా?: అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు రాకుండా, ఎలాంటి ఆధారాలు చూపలేక అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో గ్రూప్-1 పరీక్షల్లో వివాదాలు, కడప జెడ్పీ కారుణ్య నియామకాల అక్రమాలు, 2006 డీఎస్సీ అవకతవకలపై ముందు వైసీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.పారదర్శక పాలనే కూటమి లక్ష్యం:ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పారదర్శకతకు కట్టుబడి ఉందని, నిరుద్యోగులకు న్యాయమైన అవకాశాలు కల్పిస్తూ ప్రతి హామీని నెరవేరుస్తోందని కృష్ణప్రసాద్ ఉద్ఘాటించారు. సమావేశంలో పాల్గొన్న నేతలు:గోపు సత్యనారాయణ (టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి): ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ యువతను భయాందోళనలకు గురిచేస్తున్నందుకు వైసీపీ నాయకులు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోటమర్రి బాబా ప్రసాద్ (జిల్లా ఉపాధ్యక్షులు): ఐదేళ్లు ఉద్యోగాలివ్వని వారు ఇప్పుడు మెగా డీఎస్సీపై మాట్లాడటం విడ్డూరమని, ఈ చౌకబారు రాజకీయాలను ప్రజలు తిప్పికొడతారని పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొస్తా మురళీకృష్ణ, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, జిల్లా కార్యదర్శి వసంత కుమారి, మాజీ కౌన్సిలర్ కాసాని భాగ్యరావు తదితరులు పాల్గొన్నారు.






## మచిలీపట్నం APMSIDC గోదాంలో పొగలు.. క్షణాల్లో స్పందించి ప్రమాదాన్ని తప్పించిన అధికారులు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణాజిల్లామచిలీపట్నంలోని ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (APMSIDC) గోదాంలో బుధవారం ఆకస్మికంగా పొగలు వ్యాపించడంతో స్థానికంగా కలకలం రేగింది. అయితే, అక్కడే ఉన్న అధికారులు వెంటనే అప్రమత్తమై చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది.ఘటన వివరాలు:ప్రాథమిక సమాచారం ప్రకారం.. గోదాంలో ఉన్న బయోమెడికల్ వేస్ట్‌ను తగిన అనుమతులతో వేరే ప్రాంతానికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో గోదాంలోని ఓ మూలన ఉన్న గది నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు రావడం గమనించారు.అధికారుల తక్షణ చర్యలు:పొగలను గుర్తించిన వెంటనే అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆ వెంటనే గోదాంలో అందుబాటులో ఉన్న ఫైర్ సిలిండర్లతో మంటలు వ్యాపించకుండా ప్రాథమికంగా అదుపు చేశారు.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, శ్రమించి పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తెచ్చారు.ఆస్తి నష్టం అంచనా:ఈ ప్రమాదంలో గోదాంలో నిల్వ ఉంచిన బయోమెడికల్ వేస్ట్ (వైద్య వ్యర్థాలు) మాత్రమే దగ్ధమైనట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు, జరిగిన ఆస్తి నష్టంపై పూర్తిస్థాయి వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

## టీడీపీ క్యాలెండర్ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు సమన్వయంతో పనిచేయాలి



జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో నాయకుల పిలుపు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ క్యాలెండర్ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి నెల నాల్గవ బుధవారం నిర్వహించే జిల్లా స్థాయి సమీక్ష సమావేశం బుధవారం మచిలీపట్నంలోని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ అధ్యక్షతన ఘనంగా జరిగింది.ఈ సమావేశంలో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరేలా డోర్ టు డోర్ ప్రచారాన్ని మరింత విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడంతో పాటు గ్రామ, వార్డు, బూత్ కమిటీలను మరింత బలోపేతం చేసి సంస్థాగతంగా పార్టీని పటిష్ఠపరిచే దిశగా కార్యాచరణ రూపొందించారు. అదేవిధంగా పార్టీ క్యాలెండర్‌లో పొందుపరిచిన అన్ని కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడం, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించడం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, పార్టీ–ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ బలోపేతమే ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఉండాలని, ప్రతి నాయకుడు సమన్వయంతో పనిచేస్తూ గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత పటిష్ఠం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు:జిల్లా ఉపాధ్యక్షులు మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, జిల్లా నాయకులు వంగవీటి శ్రీనివాస ప్రసాద్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.డి. రిజ్వానా బేగం, జిల్లా కార్యదర్శులు వసంత కుమారి, రాజులపాటి సురేఖ, మచిలీపట్నం టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లోగిశెట్టి స్వామి, జిల్లా నాయకులు చిన్నం శేఖర్, జిల్లా రైతు విభాగం సోషల్ మీడియా కోఆర్డినేటర్ పామర్తి లక్ష్మణ్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ ఉప్పలపాటి ప్రవీణ్, జిల్లా నాయకురాలు గుమ్మడి అశ్విని, జిల్లా అధికార ప్రతినిధి కోస్తా మురళీకృష్ణ తదితర జిల్లా నాయకత్వం పాల్గొన్నారు.

# మూడో రోజుకు చేరుకున్న టిడిపి డోర్ టు డోర్ కార్యక్రమం..

### 14వ వార్డులో ఎమ్మెల్యే రాము పర్యటన

**పంచవటి కాలనీలో ఇంటింటికి వెళ్లి...**
**కూటమి కరపత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**
**ప్రజల సమస్యలు తెలుసుకుని రెండు రోజుల్లో పరిష్కరిస్తాం:ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**
**సమస్య ఉన్న చోటికే వెళ్లి పరిష్కారం చూపించడమే మా విధానం: ఎమ్మెల్యే రాము**



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తున్నామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గ్రామాలు, వార్డుల్లో ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని ఆయన చెప్పారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు తెలుగుదేశం పార్టీ చేపట్టిన డోర్ టు డోర్ కార్యక్రమం బుధవారం మూడో రోజుకు చేరుకుంది. గుడివాడ 14వ వార్డు పంచవటి కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు కూటమి శ్రేణులతో కలిసి పర్యటించారు. వార్డులో ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఎమ్మెల్యే రాము ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే రాముకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. వార్డు ప్రజలు స్థానికంగా ఉన్న సమస్యలను ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా వాటర్ పైప్ లైన్, డ్రైనేజీ సమస్యలు అధికంగా వినిపించాయి. ఫ్లైఓవర్ నిర్మాణ పనుల వల్లనే స్థానికంగా నీటి సమస్య ఏర్పడిందని, రెండు రోజుల్లో పైప్ లైన్ కనెక్షన్లు ఇచ్చి నీటి సమస్యను పరిష్కరిస్తామని స్థానికులకు భరోసా ఇచ్చారు.

వార్డుల్లో ప్రజల సమస్యల పరిష్కారంలో సచివాలయ ఉద్యోగులతో పాటు కూటమి నాయకత్వం కూడా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే రాము సూచించారు.అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మీడియాతో మాట్లాడు తూ...గుడివాడలో సమస్యలు అధికంగా ఉండే ప్రాంతాల్లోనే ముందుగా డోర్ టు డోర్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ROB ఫ్లైఓవర్ నిర్మాణ పనుల వల్ల 14వ వార్డులో సమస్యలు అధికంగా ఉన్నాయనీ, అయినా పర్యటించి ప్రజలకు భరోసా కల్పించామని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.రైల్వే గేట్ల వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు మందకొడిగా జరుగుతున్నాయనీ,అయినా సరే అక్టోబర్ కల్లా బైపాస్ రోడ్డు వైపు ఫ్లైఓవర్ ప్రారంభిస్తామని తెలియజేశారు.ఫ్లైఓవర్ పనుల అనంతరం స్థానిక డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.గతంలో ఇదే ప్రాంతంలో వర్షం వస్తే రోజుల తరబడి నీళ్లు నిలిచిపోయేవనీ ,కానీ గత రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎక్కడా నీళ్లు నిలవకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.గ్రామ, వార్డు పర్యటనల్లో గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని,సమస్య అనేది ప్రతి చోట ఉంటుందనీ వాటిని పరిష్కరించడమే మా ధ్యేయమని ఎమ్మెల్యే రాము ఉద్ఘాటించారు.డోర్ టు డోర్ కార్యక్రమంలో గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య,టిడిపి నాయకులు లింగం ప్రసాద్, ముల్లపూడి రమేష్ చౌదరి,బొంబాయి శ్రీను,షేక్ ఇబ్రహీం,మాదాల సురేష్ ,జోన్స్ దయానంద్, మజ్జాడ నాగరాజు, నిరంజన్, వేశపోగు ఇమ్మానుయేలు, రెడ్డి షణ్ముఖ ,కోడూరు ప్రభు, అర్నేపల్లి పాండు, వసంతవాడ దుర్గారావు ,వేమూరి సుజాత, వంగపండు ఆదినారాయణ, రమాదేవి, నేరుసు కాశి , గోవాడ శివ, లోయ విజయ్, యార్లగడ్డ సుధారాణి గొర్ల శ్రీలక్ష్మి, అల్లాడ శ్రీనివాస్, గోకవరపు సునీల్, వద్దాది నాగ రాజు, దేవరపల్లి కోటి, సయ్యద్ మున్వర్, జనసేన నాయకులు వేమూరి త్రినాథ్, గుండు వెంకటరావు పడాల పూర్ణ బెల్లివాడ పవన్, ఇమ్మిడి శెట్టి భాను,14వ వార్డు టిడిపి నాయకులు మానూరి శ్రీనివాసరావు, చేని వెంకటస్వామి, జానీ, సత్యనారాయణ, జమలయ్య, దుర్గారావు, పట్టణంలోని పలు వార్డులు చెందిన కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# డీపీఆర్‌లకే పరిమితం కాకుండా టూరిజం ప్రాజెక్టులను గ్రౌండింగ్ చేయాలి

**రూ.75 కోట్ల ఏఎంసీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రాజెక్టు జూలై-2027 నాటికి పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ:

జిల్లాలో ప్రతిపాదించిన పర్యాటక ప్రాజెక్టులు డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టుల (డీపీఆర్) దశలోనే నిలిచిపోకుండా వేగవంతంగా గ్రౌండింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా జిల్లాకు ఆర్థికంగా, ఉపాధి పరంగా మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.జిల్లా కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పర్యాటక ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. భవానీ ఐలాండ్‌లో రూ.75 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఏఎంసీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను త్వరితగతిన పూర్తి చేసి, జూలై-2027 నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

డెస్టినేషన్ వెడ్డింగ్, వాటర్ స్పోర్ట్స్, బోటింగ్, 500 మంది సామర్థ్యంతో కన్వెన్షన్ హాల్ వంటి ఆధునిక సౌకర్యాలతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.భవానీ ఐలాండ్‌లోని అమరావతి బోటింగ్ క్లబ్‌ను భద్రతా ప్రమాణాలతో మరింత ఆకర్షణీయంగా నిర్వహించాలని, స్వరాజ్ మైదానంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో మినీ థియేటర్‌ను విద్యార్థుల విద్యా, వైజ్ఞానిక అవగాహన కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు.ఇబ్రహీంపట్నం పవిత్ర సంఘం వద్ద నదీహారతి కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వైదిక కమిటీ సూచనల మేరకు 30 డిగ్రీల డైమెన్షన్‌తో ప్రత్యేక ప్లాట్‌ఫాం నిర్మించాలని ఆదేశించారు. భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, రోడ్డు అభివృద్ధి, విద్యుత్ సౌకర్యాల ఏర్పాటుపై సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని సూచించారు.నవరాత్రుల సందర్భంగా పున్నమి ఘాట్, ఫెర్రీ ఘాట్, బసవ పున్నయ్య స్టేడియంలో నిర్వహించే 'విజయవాడ ఉత్సవ్' కోసం అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యాటకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు.సిబార్ డిస్నీల్యాండ్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' పథకం కింద జిల్లాలోని ప్రధాన దేవాలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే కొండపల్లి ఖిల్లాను అడ్వెంచర్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసి ట్రెక్కింగ్, ర్యాపెల్లింగ్ వంటి సాహస క్రీడలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాజెక్టులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, విజయవాడను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ పిలుపునిచ్చారు.

# ఆగస్టు 3 వరకు ఐటీఐ రెండో విడత అడ్మిషన్ల నమోదు

**ఆగస్టు 6న విజయవాడలో కౌన్సిలింగ్: జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు**

Industrial Training Institute

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ:

ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు)లో 2026–27/28 విద్యా సంవత్సరానికి రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు తెలిపారు.అడ్మిషన్లకు అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 3వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 6న విజయవాడ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో అడ్మిషన్ల కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ ఆధారంగా నిర్ణీత తేదీన అసలు ధ్రువపత్రాలతో కౌన్సి లింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశం పొందే అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీల ను మినహాయించి మిగిలిన కేటగిరీల వారు రూ.60 కాషన్ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రైవేట్ ఐటీఐల్లో చేరే అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయించిన ఫీజును చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ వివరాల కోసం విజయవాడ ప్రభుత్వ ఐటీఐలోని జిల్లా కన్వీనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 0866-2475575, 94906 39639, 77804 29468 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు తెలిపారు.

## రాష్ట్ర వైద్య విద్యా శాఖ డైరెక్టర్ విష్ణువర్ధన్‌తో జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన

- **నవ జాత శిశువు మృతిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.**
- **కుటుంబ సభ్యులకు కలెక్టర్ భరోసా.**

ప్రజాభూమి ప్రతినిధి ఏలూరు జిల్లా.

ఈనెల 23వ తేదీన ఏలూరు సర్వజన ఆసుపత్రిలో నవజాత శిశువు మృతిపై విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి బాధిత కుటుంబ సభ్యులకు చెప్పారు. స్థానిక ఏలూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో బుధవారం ఉదయం రాష్ట్ర వైద్య విద్యా శాఖ డైరెక్టర్ డా. విష్ణువర్ధన్ తో కలిసి ఇటీవల మృతిచెందిన నవజాత శిశువు కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్ కలిసి వివరాలను అడిగి తెలుసుకుని, వారిని ఓదార్చారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ శిశువు మరణించిందని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, రాష్ట్ర వైద్య విద్యా శాఖ డైరెక్టర్ డా. విష్ణువర్ధన్ లకు బాధితులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ కేసు షీట్లు, రికార్డులు పరిశీలించి, శిశువు మరణంపై సమగ్ర విచారణ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పేషంట్లకు అందుతున్న సేవలు, సౌకర్యాలను కలెక్టర్ వెట్రిసెల్వి, డైరెక్టర్ డా. విష్ణువర్ధన్ లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోస్ట్ ఆపరేటివ్ వార్డ్ లో సౌకర్యాలను పరిశీలించారు. అక్కడి రోగులను కలిసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఆసుపత్రిలో సిసి కెమెరాలు పనిచేయకపోవడం, బెడ్ షీట్లు మురికిగా, చిరిగి ఉండడంతో సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపి, ఐపి కౌంటర్ల వద్ద రోగులు ఎక్కువ సేపు వేచి ఉండకుండా త్వరితగతిన నమోదు చేసేలా చూడాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, వివిధ వైద్య విభాగాలకు చెందిన హెచ్ఓడి లు ఓపి సమయంలో రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. పోస్ట్ ఆపరేటివ్ వార్డ్ లో వైద్య చికిత్స యంత్రాలను సిఎస్ ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు ద్వారా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నిరుపేదలకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలందించడం ద్వారా



ప్రజల సంతృప్తి స్థాయి ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ డా. విష్ణువర్ధన్ కు కలెక్టర్ సూచించారు.

రాష్ట్ర వైద్య విద్యా శాఖ డైరెక్టర్ డా. విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఇటీవల మృతిచెందిన నవజాత శిశువు మృతిపై విచారణ చేపడుతున్నామని, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి డా. అనిల్ ను విచారణ అధికారిగా నియమించి, నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏలూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఓపి , ఐపి నమోదు రెండింతలు అయిందన్నారు. అదేవిధంగా శస్త్రచికిత్సలు కూడా మూడు నుండి నాలుగు రెట్లు పెరిగాయని, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలపై ప్రజలకు పెరుగుతున్న ఆదరణకు ఇది నిదర్శనమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. శిశువు మృతి ఒక దురదృష్ట సంఘటన అని, విచారణలో వైద్యుల నిర్లక్ష్యం అని తేలితే తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలలో లోపాలు, వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వంటి వాటిని తన ఫోన్ 9849902961 నెంబర్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్యామల, డా శశిధర్, డా. రామయ్య, వివిధ విభాగాల డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీటీసీల గౌరవ వేతనం చెల్లించాలి

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ఎంపీటీసీలు గౌరవ వేతనం మూడేళ్లుగా చెల్లించడం లేదని, తక్షణమే గౌరవ వేతనం చెల్లించాలని ఆ దిశగా మంత్రి నిమ్మల రామానాయుడు కృషి చేయాలని పాలకొల్లు మండల పరిషత్ అధ్యక్షురాలు చిట్టూరి కనక లక్ష్మి కోరారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో ఎన్ ఎన్ ఉమామహేశ్వరరావు అధ్యక్షతన పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయం భవనంలో బుధవారం జరిగింది. ఈ సభలో ఎంపీపీ కనక లక్ష్మీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలందరూ కరోనా వ్యాధి వచ్చే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు

మండల పరిషత్ అధ్యక్షురాలు కనుక లక్ష్మి



సేవలనుంచాలని కోరారు. జడ్పిటిసి నడపన గోవిందరాజులు నాయుడు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను మండల పరిషత్ కార్యాలయం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. ఫ్లోర్ లీడర్ శాగా సత్యనారాయణ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. పదవీకాలం పూర్తవుతున్నందున పాలకవర్గం బోర్డులను మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని కోరారు.

ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో కుక్క, పాముకాటుకు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 15- 45 సంవత్సరాలు మధ్య వయస్కులు అయిన మహిళలు హెచ్ పి వి వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. చిన్న పిల్లలకు సెల్ఫోన్ ఇవ్వడం వల్ల మానసిక వ్యాధి గ్రస్తులుగా మారుతున్నారని జాగ్రత్త పడాలని తెలిపారు.

శివదేవుని చిక్కాల సొసైటీ అధ్యక్షులు వద్దే కోట సోమశేఖర్ మాట్లాడుతూ సొసైటీలో ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎకరానికి రూ.10 లక్షలు చొప్పున రెండు ఎకరాలకు 20 లక్షలు రూపాయలు రుణం, పది సంవత్సరాలలో తీర్చే విధంగా రుణ సౌకర్యం రైతులకు సొసైటీలో లభిస్తుందని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో టీఎం బాబు, ఉపాధ్యక్షుడు పడవ సునీల్ బాబు, మండల పరిషత్ ఏవో రామదాసు నాయుడు, ఏవో రాజశేఖర్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు, వివిధ డిపార్ట్మెంట్ల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి రోటరీ క్లబ్ ఆర్థిక సహాయం

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ప్రస్తుతం చికిత్స పొందుతున్న ఫోటోగ్రాఫర్ కావలి అయ్యప్ప కుటుంబానికి పాలకొల్లు రోటరీ క్లబ్ మానవతా దృక్పథంతో అండగా నిలిచింది. రోటరీ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశమైన "స్వార్థ రహిత సేవ" స్ఫూర్తితో, బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం రోటరీ క్లబ్ సభ్యులందరి సహకారంతో సేకరించిన రూ. 40,000/- (నలభై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని ఈరోజు వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. కష్టకాలంలో ఉన్న ఒక సాటి మనిషిని ఆదుకోవడానికి





రోటరీ క్లబ్ సభ్యులు చూపిన చొరవ మరియు సేవా భావం అభినందనీయం. ప్రమాదానికి గురైన అయ్యప్ప త్వరగా కోలుకోవాలని క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు గుడాల హరిబాబు. కార్యదర్శిశిరిగినీడి శ్రీరామ నాగార్జున. కోశాధికారి ఆరు మిల్లి సురేష్. అసిస్టెంట్ గవర్నర్ మైగాపుల రాంబాబు. పాస్ట్ ప్రెసిడెంట్లు డీజీఎన్ .ముచ్చర్ల సంజయ్ ,మద్దాల రాంప్రసాద్,ఇమ్మిడి రాజేష్,కావాలి నగేష్ , రావాడ సతీష్ మరియు క్లబ్ సభ్యులు ఓడూరి సురేష్ పాల్గొన్నారు .

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపల్‌కు ఆత్మీయ వీడ్కోలు



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీపై వెళ్లిన మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబుకు కళాశాల స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. శ్రీనివాసరావు అధ్యక్షత వహించి, డాక్టర్ గిరిబాబు కళాశాల అభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. సీపీడీసీ కార్యదర్శి ఎల్. వెంకటేశ్వరరావు, సభ్యులు బడేటి వెంకట్రామయ్య మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతి కోసం ఆయన చేసిన కృషిని ప్రశంసించారు. డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ స్థానిక దాతలు, ప్రజాప్రతినిధులు, సీపీడీసీ, అధ్యాపకుల సహకారంతో కళాశాల మౌలిక వసతుల అభివృద్ధి సాధ్యమైందన్నారు. కళాశాల నూతన భవన నిర్మాణానికి రూ.12.6 కోట్ల నిధులు మంజూరు కావడం తన పదవీ కాలంలో అత్యంత ముఖ్యమైన విజయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం, సీపీడీసీ సభ్యులు,అధ్యాపకులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను ప్రారంభించి అర్హత సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సారథ్యంలో జీలుగుమిల్లి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ ప్రముఖ సంస్థలు నిర్వహించిన ఇంటర్వ్యూలలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నియామక పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రత్యేక దృష్టి సారిస్తోందని, మెగా జాబ్ మేళాల ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. యువత తమ విద్యార్హతలకు



అనుగుణంగా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు,కూటమి నాయకులు సుంకవల్లి సాయి,గుడ్ల రాంబాబు, బందారు అనిల్, పిన్నమనేని మధు,రూపా సత్యనారాయణ, శేఖముడి సాయి,పద్దం వెంకటకృష్ణ,మేచినేని సంజయ్, బోరగం వెంకటలక్ష్మి,తోట బాలు,కోలా ధర్మరాజు, సూరిశెట్టి మహేష్,మోహన్,తొమ్మిదేళ్ల దుర్గా ప్రసాద్, కొత్తూరి రాజేష్, సిరిబత్తుల స్వామి, మందపాటి సూర్య,దేవుడు శ్రీను, మద్దాల రమేష్,గారపాటి శ్రీను, కక్కిరాల మురళి, కక్కిరాల ఉపేంద్ర,గద్దే సుబ్రహ్మణ్యం ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, ఉద్యోగార్థులు మరియు పలువురు పాల్గొన్నారు.

## వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో గురు పౌర్ణమి కార్యక్రమం

ప్రజాభూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

గురు పౌర్ణిమ అనేది గురువులను, ఆధ్యాత్మిక మార్గదర్శకులను అన్వేషించేదే అని వాల్మీకి విజ్ఞాన కేంద్ర పరిపాలన అధికారి తనికెళ్ళ సత్య కుమార్ అన్నారు. విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య నందిస్తూ, స్ఫూర్తినిస్తున్న గురువులను గౌరవించడానికి అంకితం చేయబడిన పండుగే " గురు పౌర్ణమి "యొక్క విశిష్టత అని ప్రపంచానికి జ్ఞానానందించిన వ్యాధి వ్యాస మహాముని యొక్క జయంతోత్సవాన్ని పురస్కరించుకొని హిందూ సాంప్రదాయంలోని ఆషాడ పౌర్ణమి రోజుని గురు శిష్యుల మధ్య ఉండే శాశ్వతమైన బంధాన్ని, మరియు అందంగా అంధకారంపై జ్ఞానానికి



ఉన్న శక్తిని చాటుతుందని, అదేవిధంగా వేదాలను మహాభారతానందించిన వేద వ్యాస్ మహర్షి ప్రాతఃస్మరణీయులని వాల్మీకి విజ్ఞాన కేంద్రం పరిపాలనాధికారి తనికెళ్ల సత్య రవికుమార్ అన్నారు. నేడు వంకా వారి గూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రం పాఠశాల నందు "గురుపౌర్ణిమ" ఉత్సవం ఉపాధ్యాయులు ఉర్రి కల శివశంకర్ అధ్యక్షతన జరుగుగా, ఉపాధ్యాయుడు వేదుల జనార్ధన రావు...వేద వ్యాస్ మహర్షి... చిత్రపటానికి పుష్ప మాలను వేసి, వ్యాసు మహర్షి యొక్క విశిష్టతను, వేదాలు, మహాభారతం యొక్క ఆవశ్యకతను వివరించారు.

ఈ కార్యక్రమంలో తనికెళ్ల సత్య రవికుమార్ ప్రధాన వక్తగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్రింకల శివశంకర్, కూరా కుల వెంకటేశ్వరరావు, కె గౌరీ వి.కామేశ్వరి, ఏ. అమల మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి మడి ఈశ్వర్ రెడ్డి... బ్లాక్ బోర్డ్ పై వేద వ్యాస్ మహర్షి యొక్క చిత్రాన్ని వేసి అలరించాడు.

## ఆగస్టు 6 నుంచి సీపీఐ పాదయాత్రలు విజయవంతం చేయాలి: మన్నవ కృష్ణ చైతన్య



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 15 వరకు నిర్వహించే పాదయాత్రలు, ప్రచార ఆందోళనలు, సెప్టెంబర్ 1న జరిగే "చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం పాదయాత్రల గోడపత్రికలను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ,బీజేపీ ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని,దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల,ఆర్థిక అసమానతలు పెరిగాయని విమర్శించారు. అలాగే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని, పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన టీడీపీ ప్రజాప్రతినిధులు



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

ఆగస్టు 1వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి సభా వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి అనగానీ సత్య ప్రసాద్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు,ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,ఏలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి,మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు,పోలవరం నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు కూడా పాల్గొని, సభా ప్రాంగణంలో చేపట్టిన ఏర్పాట్లు,ప్రజల రాకపోకలు,భద్రతా చర్యలు,వేదిక నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమన్వయంతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చల్లా వెంకట సత్య వరప్రసాదరావు (కంప్యూటర్ ప్రసాద్)తో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛత గ్రామంలో మీ చిరునామా ఎక్కడ.?

-స్వచ్ఛ పథం అమలు జరగడంలో అధికారుల నిర్లక్ష్యం.





ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు

ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ పథం గ్రామాల్లో అమలు కావటంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెలలు ప్రతి బుధవారం నాడు నిర్వహించే స్వచ్ఛ పథం కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితం అవుతున్నాయి. ఏదో ఒక చోట హడావుడి పనులు ముగించి ఫోటోలను ఉన్నతాధికారులకు పంపించి గ్రామంలో మేము నిర్వహించామని చెప్పుకోవడానికి తప్ప గ్రామంలో స్వచ్ఛత అనేదానికి అర్థం లేకుండా నేడు కానవస్తుంది. రోడ్ల వెంట ఎటు చూసినా మురుగునీరు, కొన్ని ప్రాంతాల్లో రోడ్ల మీదే దర్శమిస్తున్నాయి. అవి పోవడానికి అధికారులు తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం అనే చెప్పవచ్చు. రోడ్లమీద పోయే మురుగునీరు తొలగించడం స్వచ్ఛపథం లోకి రాదా అనేది ప్రశ్నగానే మిగిలిపోయింది. ఇటీవల కాలంలో కురిసిన కొద్దిపాటి వానలకు రోడ్లమీద మురుగునీరు గ్రామాలలో అనేక చోట దర్శనమిస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది అటువంటి చోట స్వచ్ఛ పథం అమలు చేయడంలో నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు అమలు పరచడంలో నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ సిబ్బంది పై ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారు వేచి చూడాల్సిందే. రానున్న రోజుల్లో అంటూ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో ఉన్న డ్రైనేజీలలో మురుగునీరు నిలవకుండా చూడాల్సిన బాధ్యత గ్రామపంచాయతీ అధికారులపై ఎంతైనా ఉంది.

## పంపు నీరు పోతుంటే రోడ్డుకి అడ్డుగా గొయ్యి తవ్వారు



ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు

పూర్వకాలంలో పల్లెటూర్లలో ఒక సామెత ప్రతిరోజు ఏదో ఒక చోట పెద్దల నోట్లో చక్కర్లు కొడుతూనే ఉండేది. దున్నపోతు ఈనింది రా అంటే దూడను కట్టావే అన్న చందంగా నేడు గ్రామ పంచాయతీ అధికారులు చేసిన పని అదే రీతిలో ఉండటంతో చాలా హాస్యాస్పదంగా ఉంది. పెదపాడు మండలం వసంతవాడ గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఒక ఇంటికి సంబంధించిన పంచాయితీ కుళాయి నీరు రోడ్డు మీద గత కొన్ని సంవత్సరాలుగా వృధాగా పోతుంది. అది గమనించిన పంచాయతీ సిబ్బంది సంబంధిత ఇంటి యజమానులకు తెలియజేసి తగిన చర్యలు తీసుకోకపోగా, రోడ్డు కట్టంగా జెసిపి తో గుయ్యతోవి నీళ్లు పోవడానికి దారి ఏర్పాటు చేసిన ఘనత వసంతవాడ గ్రామపంచాయతీ అధికారులు చెందింది. అనేక ప్రాంతాల్లో గుక్కెడు తాగు నీళ్లు దొరకని ఇటువంటి రోజుల్లో వృధాగా పోతున్న నీళ్లు అరికట్టాల్సిన అధికారులు రోడ్డు ఘట్టంగా ప్రయాణికులకు అసౌకర్యం కలిగించడంలో ప్రత్యేక స్థానం పొందారు. ఇటువంటి అధికారులు ఉన్నంతకాలం అభివృద్ధి ఇలాగే ఉంటుందని వాహనదారులు తీవ్రంగా విమర్శి స్తున్నారు.

ప్రజాభూమి



# ఘనంగా విద్యార్థి ప్రతినిధుల ప్రమాణ స్వీకార కార్యక్రమం




ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

గురుకుల్ విద్యాలయ, నాగరాజుపేట, పాలకొల్లులో నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థి ప్రతినిధుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం వేడుకకు ముఖ్య అతిథిలుగా పాలకొల్లు రూరల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కుక్కల అజయ్ కుమార్, సెక్రటరీ ఈదురపల్లి శ్రీధర్, కోశాధికారి మల్లిపూడి రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ నిట్టల శివ శైలజ, మెంబర్షిప్ చైర్మన్ డాక్టర్ సంగీనీడి రంగారావు, సర్వీస్ ఛైర్పర్సన్ సొలస సుబ్బారావు హాజరై, నూతనంగా ఎన్నికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్, హౌస్ క్యాప్టెన్లు మరియు ఇతర విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ, నాయకత్వం అనేది కేవలం హోదా మాత్రమే కాదని, బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావం మరియు ఆదర్శ ప్రవర్తనకు ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులు నిజాయితీ, అంకితభావంతో తమ బాధ్యతలను నిర్వర్తించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పాఠశాల చైర్మన్ గొర్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, విద్యార్థి నాయకత్వం ద్వారా ఆత్మవిశ్వాసం, నిర్ణయ సామర్థ్యం, సమూహంగా పనిచేసే నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విద్యార్థి నాయకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు ఆదర్శ నాయకులుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేశ్వర్ మహాపాత్ర , ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని నూతన విద్యార్థి నాయకులను అభినందించారు. కార్యక్రమం దేశభక్తి, క్రమశిక్షణ మరియు సేవా భావాన్ని ప్రతిబింబించే విధంగా విజయవంతంగా ముగిసింది.

# సంక్షేమ పెన్షన్లు వెంటనే విడుదల చేయాలి

## స్మశాన వాటికలకు నిధులు కేటాయించాలి: దళితసేన రాష్ట్రవ్యాప్త ధర్నా



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

దళితసేన 6వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద దళితసేన ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు సంబంధించిన సంక్షేమ పెన్షన్లను వెంటనే విడుదల చేయాలని, దళితవాడల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు, నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ముందు ఏలూరులోని దళితసేన రాష్ట్ర కార్యాలయంలో సంస్థ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీగా జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని, డప్పు కళాకారులు, చెప్పులు కుట్టే చర్మకారులు, లెదర్ వర్కర్లు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పెన్షన్లు ఆలస్యం లేకుండా అందించాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని దళితవాడ గ్రామాల్లో స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో దళితసేన రాష్ట్ర మహిళా నాయకురాలు బేతాలు జయసుధ, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి ఈదియ, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ముత్యాల ఝాన్సీ లక్ష్మి, పెదవేగి మండల అధ్యక్షురాలు రేమల్లె స్వర్ణకమలం, తాడేపల్లిగూడెం నియోజకవర్గ అధ్యక్షుడు దూలపల్లి సత్య, మండల ఉపాధ్యక్షుడు కిలాడి రవి, పెద్ద తాడేపల్లి గ్రామ అధ్యక్షుడు కునుపాముల సుబ్బారావు, అమ్మపాలెం గ్రామ అధ్యక్షురాలు పానమాల మల్లేశ్వరి, ఎర్రంపల్లి గ్రామ అధ్యక్షుడు పింగుల నాగేశ్వరరావు, బీసీ మహిళ ఏలూరు నగర ఉపాధ్యక్షురాలు సువార్తతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## షిరిడి సాయి మందిరంలో ఘనంగా గురుపూర్ణిమ.



ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం

స్థానిక శ్రీ షిరిడి సాయి మందిరంలో గురు పూర్ణిమ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వ్యాస పూర్ణిమ సందర్భంగా బుధవారం సాయి మందిరంలో సాయి విగ్రహ దాతల కుటుంబీకులు ముప్పినవారిగూడెంకు చెందిన పల్లోతు సుబ్బారావు, వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో బాబావారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయంలో జీవితంలో గురువు యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ ప్రత్యేక ఉపన్యాసాలు, ఆధ్యాత్మిక భక్తి గీతాలతో భజనలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిపించారు.

## రూ.12 కోట్లతో మంచినీటి వాటర్ ట్యాంకుకు భూమిపూజ

- నాలుగు గ్రామపంచాయతీలకు శాశ్వత తాగునీటి పరిష్కారం దిశగా అడుగు.
- భూమిపూజ నిర్వహించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

ఆత్రేయపురం మండలంలోని కట్టుంగ, ర్యాలి, నార్కేడిమిల్లి, అంకంపాలెం గ్రామపంచాయతీల పరిధిలోని ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. సుమారు రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న భారీ మంచినీటి వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా శాశ్వత పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భారీ నిధులను కేటాయించి ఈ ప్రాజెక్టును చేపట్టిందన్నారు. ఈ వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తయిన అనంతరం కట్టుంగ, ర్యాలి, నార్కేడిమిల్లి, అంకంపాలెం గ్రామపంచాయతీల పరిధిలోని వేలాది మందికి నిరంతర తాగునీటి సరఫరా అందుబాటులోకి వస్తుందని, ఎన్నో సంవత్సరాలుగా ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. భూమిపూజ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆషాఢ పౌర్ణమి వేళ వైభవంగా వాడపల్లి నుంచి మందపల్లికి చీర సారె ఊరేగింపు

- శాకాంబరీ అలంకరణలో పార్వతీ అమ్మవారి దివ్య దర్శనం.
- భక్తుల నామసంకీర్తనలు, మంగళ వాయిద్యాల మధ్య సంప్రదాయ వేడుకలు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా కోనసీమలోని ప్రముఖ శైవ--వైష్ణవ క్షేత్రాలైన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి దేవస్థానాల మధ్య కొనసాగుతున్న ఆధ్యాత్మిక సంప్రదాయం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి శ్రీ మందేశ్వర స్వామి వారి ధర్మపత్ని శ్రీ పార్వతీ అమ్మవారికి చీర సారెను శాస్త్రోక్తంగా సమర్పించారు. వాడపల్లి దేవస్థానం సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు ఆధ్వర్యంలో వేదపండితులు, ఆలయ అధికారులు చీర సారెతో సుమారు 10 కిలోమీటర్ల దూరంలోని మందపల్లి దేవస్థానానికి చేరుకున్నారు. వారికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ దారపురెడ్డి సురేష్ బాబు నేతృత్వంలో ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన ద్వారం నుంచి కోలాటాలు, మంగళ వాయిద్యాలు, భజన బృందాల నామ సంకీర్తనలు, బాణసంచా కాల్పుల మధ్య చీర సారెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి పార్వతీ అమ్మవారికి సమర్పించారు.

ఈ సందర్భంగా అమ్మ వారిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరీ అలంకరణలో తీర్చిదిద్దగా, భక్తుల ను ఆ దివ్య దర్శనం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ప్రతి ఏడాది ఆషాఢ పౌర్ణమి సందర్భంగా వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి శ్రీ మందేశ్వర స్వామి వారి ధర్మపత్ని శ్రీ పార్వతీ అమ్మవారికి చీర సారె సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోందని దేవస్థానం ఈఓ, సహాయ కమిషనర్ దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక సంప్రదాయం రెండు క్షేత్రాల మధ్య ఉన్న విశిష్టమైన అనుబంధానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు.

### జిల్లా స్థాయి పోటీలకు రావులపాలెం విద్యార్థినులు

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

కొత్తపేట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ (సాప్) క్రీడా పోటీల్లో రావులపాలెం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం అండర్-17 బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో ఎ.జయశ్రీ ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించింది. కబడ్డీ విభాగంలో వి. శాలిని, పి. దీపిక, ఎన్. స్నేహలత, యోగా విభాగంలో పి. సాయిసత్య దుర్గ, ఎన్. భానుశ్రీ, ఎం. శ్వేతశ్రీ, ఎన్. హవీల, షాట్‌పుట్‌లో జి. అశ్విని, 100 మీటర్ల పరుగులో జె. స్నేహ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, ఎస్ఎంసీ చైర్మన్ కోట సోమేశ్వరరావు, పీడీలు లక్ష్మీ ప్రసూన, సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

# ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన

**ఆత్రేయపురం మండలం కట్టుంగ, తాడిపూడి గ్రామాల్లో జరిగిన ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.**



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన సాగుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా బుధవారం ఆత్రేయపురం మండలం తాడిపూడి,కట్టుంగ గ్రామాల్లో ఎమ్మెల్యే బండారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎన్డీఏ కూటమి పాలనలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. గొడ్డలి పార్టీ పాలనలో విధ్వంసం రాజ్యమేలేదని అన్నారు. అరాచకానికి పెట్టింది పేరు వైసీపీ అని అన్నారు. అందుకే కూటమికి ఎన్నడూ లేనంత మెజారిటీతో ప్రజలు అధికారం కట్టబెట్టారని అన్నారు. ప్రస్తుతం ప్రజలతో మాట్లాడినప్పుడు వారు కూటమి పాలన పట్ల సంతృప్తి, సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత రెండేళ్లలో అమలైన సంక్షేమం, గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల గురించి ప్రజలే వివరిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామ గ్రామాన జరుగుతున్న అభివృద్ధి, ఇంటింటికి అందుతున్న సంక్షేమం ప్రజల కళ్ళల్లో సంతోషాన్ని కనబరుస్తుందన్నారు. పింఛన్ల పెంపు, తల్లికి వందనం పథకంలో భాగంగా ఇంట్లో ఉన్న చదువుకునే ప్రతీ బిడ్డకు రూ.13 వేలు చొప్పున తల్లుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు అందించడం జరిగిందన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో గ్రామ గ్రామాన అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలియజేశారు.

## ఈస్ట్ ఎడవెల్లి జెడ్పీహెచ్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు కారే సాల్మన్ రాజ్

ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట



మండలంలోని ఈస్ట్ ఎడవెల్లి జెడ్పీహెచ్ హైస్కూల్‌లో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు కారే సాల్మ న్ రాజ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజ నం నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా వంటశాలను పరిశీలించి బియ్యం, పప్పులు, నూనె, కూరగాయలు, గుడ్లు తదితర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. వంటకు ఉపయోగించే నీరు పరిశుభ్రంగా ఉందా, వంట పాత్రలు శుభ్రంగా ఉంచుతున్నారా, వంట చేసే సిబ్బంది పరిశుభ్రత పాటిస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. అలాగే ఆ రోజు తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రుచి, నాణ్యత, పరిమాణం, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాలను తనిఖీ చేశారు. ఫుడ్ స్టాక్ రిజిస్టర్, గుడ్ల పంపిణీ రికార్డులు, రోజువారీ మెనూ నమోదు పుస్తకాలను పరిశీలించి వాటిని సరిపో ల్చారు. ఆహార పదార్థాల గడువు తేదీలు, నిల్వ విధానం, కిచెన్ పరిశుభ్రత, పురుగులు లేకుండా భద్రపరిచే విధానం, తాగునీటి సౌకర్యం వంటి అంశాలను కూడా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, పరిమాణంపై వారి అభిప్రాయాలను తెలుసు కున్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన మధ్యా హ్న భోజనం అందించాలని, ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత సిబ్బందికి జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు కారే సాల్మన్ రాజ్ సూచించారు.

## గురు పౌర్ణమి సందర్భంగా ఉపాధ్యాయుడు భవానీ ప్రసాద్ రాయపూడికు రూరల్ లయన్స్ క్లబ్ చిరు సత్కారం



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పాలకోల్, జూలై 29:గురు పౌర్ణమి సందర్భంగా రూరల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈరోజు స్థానిక వీవర్స్ కాలనీ లో ఉన్న జి వి ఎస్ వి ఆర్ ఎం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు భవానీ ప్రసాద్ రాయపూడి కు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లబ్ అధ్యక్షులు కుక్కల అజయ్ కుమార్ సంగినీడి వెంకట రంగారావు కొలకలూరు జయప్రకాష్ నారాయణ .నిట్టల శైలజ పాల్గొన్నారు. క్లబ్ సభ్యులు శ్రీ భవానీ ప్రసాద్ కు పూలమాల వేసి, శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ "గురువు అంటే చీకటి నుండి వెలుగులోకి నడిపించే వ్యక్తి. 25 సంవత్సరాలుగా విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న భవానీ ప్రసాద్ సేవలు అభినందనీయం" అని కొనియాడారు. స్పందిస్తూ భవానీ ప్రసాద్ "ఈ సత్కారం నా బాధ్యతను మరింత పెంచింది. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

## గ్రామ దేవత గంగానమ్మ ఆలయంలో ఆషాడ మాస సంబరాలు



ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం

బుట్టాయగూడెం గ్రామ దేవత గంగానమ్మకు భక్తులు ఆషాడమాస సంబరాల సందర్భంగా సారె సమర్పణ వేడుకను జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి బుధవారం ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. గ్రామ పెద్దలు, యువత మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై గ్రామోత్సవం నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో, వేదమంత్రాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. భక్తులుసంప్రదాయ సిద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి అనుగ్రహాన్ని కోరుకున్నారు. అమ్మవారి సమర్పించిన సారెను భక్తులకు ప్రసాదంగా అందించారు.

## వసంతవాడలో గురు పౌర్ణమి వేడుకలు.

ప్రజా భూమి ప్రతినిధి-పెదపాడు.



ఏలూరు జిల్లా పెదపాడు మండలం వసంతవాడ అమృతలింగంపేటలో గల షిరిడి సాయిబాబా వారి మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు అర్చనలు తదితర పూజా అధికారులు నిర్వహించి, సాయిబాబా వారిని అత్యంత సుందరంగా అలంకరించారు. అనంతరం గ్రామంలో భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఆలయ కమిటీ సభ్యులు 12 గంటల నుంచి ఆలయం వద్ద భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు స్వామివారి దర్శనం అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో చిన్నారులు కోలాటం నిర్వహించి చూపర్లకు కనువిందు చేశారు. సాయంత్రం పల్లకి సేవతో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా ముగిశాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
గురువారం 30 జూలై 2026

# క్రీడా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

## -క్రీడాపోటీలనుప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా క్రీడాకారులను తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న క్రీడా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. బుధవారం ఉదయం అనంతపురం రూరల్ మండలంలోని చియ్యేడు జడ్పీ హైస్కూల్ లో అనంతపురం రూరల్ మండలం స్థాయి బాల బాలికలకు అమరావతి ఛాంపియన్షిప్-2026 క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తొలుత క్రీడల్లో పాల్గొన్న బాల బాలికలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యంగా ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి విద్యార్థులలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించాలన్న ధ్యేయంతో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వ హిస్తున్నట్లు పేర్కొన్నారు. అమరావతి ఛాంపియన్షిప్ నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలలో జిల్లా వ్యాప్తంగా ఎంతోఉత్సాహంగా పాల్గొం





టున్నారని తెలిపారు. బాల బాలికలు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని తద్వారా ప్రతిభకు కొదవ ఉండదని ప్రభుత్వం, స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న అవకాశాలు, శిక్షణ ప్రోత్సాహంను ఉపయోగించుకోవాలన్నారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొనే బాల బాలికలు ఆయా క్రీడల్లో మంచి ప్రతిభపటవాలు ప్రదర్శించి జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించి ఆయా పాఠశాలలకు, జిల్లాకు మంచి పేరు తీసుకొని వచ్చే విధంగా కృషి చేయాలి అన్నారు. క్రీడల్లోనూ రాణించడం ద్వారా విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసం పెరుగుతుందన్నారు. క్రమశిక్షణ తో విద్యాభ్యాసం పూర్తి చేసి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ సూచిం చారు. క్రీడాకారులతోపాటు క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం అనంతపురం మండలంలోని 12 పాఠశాలల నుంచి బాల బాలికలు 500 మంది దాకా రెండు రోజులు పాటు పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి ప్రోత్సాహంతో ప్రస్తుత జడ్పీ హైస్కూల్ లో ఉన్న ప్లే ఫీల్డ్ మైదానాన్ని అన్ని విధాల తీర్చిదిద్దడం జరిగిందని జిల్లా విద్యాశాఖ ఆర్డిటి మరియు జిల్లా క్రీడాఅభివృద్ధి సంస్థల సంయుక్త సౌజన్యంతో ఈ అనంతపురం గేమ్స్ అండ్ స్పోర్ట్స్ చాంపియన్షిప్ పోటీలు నిర్వహించబడుతున్నాయని రెండు రోజులు పాటు రూరల్ క్రీడా పోటీలు జరగనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మండల స్థాయిలో నిర్వహించబడుతున్న అండర్ -14 బాలురు మరియు బాలికల విభాగంలో వాలీబాల్, కబడ్డీ, కోకో, అథ్లెటిక్స్ పోటీల వివరాలను జిల్లా క్రీడ అభివృద్ధి అధికారి ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వాలీబాల్ క్రీడను ప్రారంభించి బాల బాలికలను ఎంత ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్ ను కలిసి తమ పాఠశాలను అన్ని విధాల తీర్చిదిద్దాలని అలాగే వ్యవసాయ పంటల రైతులకు వర్షపు నీటిని అందించే విధంగా జలధార కార్యక్రమం ద్వారా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ పై తెలిపిన అంశాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి మంజుల, ఎంపీడీవో దివాకర్, ఆర్ ఐ సందీప్, సింగల్ విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణ, హెడ్మాస్టర్ విశ్వనాథ్, ఆర్డిటి స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి పలువురు గ్రామ పెద్దలు, నాయకులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గురుపూర్ణమి సందర్భంగా షిర్డీ సాయిబాబాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి.

ప్రజాభూమి, పుట్లూరు.



గురుపూర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శింగణమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బుక్కరాయ సముద్రం మండల పరిధిలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి ప్రత్యేక తీర్థప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజే శారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జొన్నల గడ్డ పద్మావతి ప్రజలందరికీ గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, శ్రీ షిర్డీ సాయిబాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.



# అనంతపురం డీఎస్పీగా ఎం చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం నూతన డీఎస్పీగా ఎం చంద్రశేఖర్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి నుంచి బదిలీపై వచ్చిన ఆయన స్థానిక పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని, ప్రజలకు పోలీసు వ్యవస్థ పట్ల మరింత నమ్మకాన్ని కలిగిస్తామని స్పష్టం చేశారు. అనుభవజ్ఞుడైన అధికారి నూతన డీఎస్పీ చంద్రశేఖర్ 1995 బ్యాచ్‌కి చెందిన అధికారి. అంతకుముందు 1992 నుంచి 1995 వరకు ఏపీ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఉద్యోగిగా సేవలు అందించారు. ఆ తర్వాత ఎస్ఐగా ఎంపికై ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో సమర్థవంతంగా పనిచేశారు. 2010లో ఆయన సీఐగా పదోన్నతి పొందారు. అనంతరం తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో లా అండ్ ఆర్డర్ విభాగంతో పాటు సి.ఐ.డి విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన, మంగళగిరి నుంచి అనంతపురం బదిలీపై వచ్చి ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.

# అన్ని వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేసి వాటి కదలికలను ఐసిసిసి ద్వారా నిరంతరం పర్యవేక్షించాలి

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



నగరపాలక సంస్థకు చెందిన అన్ని వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేసి వాటి కదలికలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ మరియు నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి ఓ.ఆనంద్ ఆదేశించారు. బుధవారం అనంతపురం నగరపాలక సంస్థలో ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఐ సి సి సి ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి కేంద్రం పనితీరును పరిశీలించారు. నగరంలోని సీసీ కెమెరాలు, కంప్యూటర్ వ్యవస్థలు, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా వాహనాల పర్యవేక్షణ తదితర అంశాలను జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన అన్ని వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలు ఎల్లప్పుడూ పనిచేసేలా చూసి, సాంకేతిక లోపాలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు, చెత్త సేకరణ, వాహనాల కదలికలు తదితర పౌర సేవలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షించి, లోపాలు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు చెత్తను రోడ్లు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, నగరపాలక సంస్థ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలని నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంతరావును ఆదేశించారు. నగర పరిశుభ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, స్వచ్ఛమైన అనంతపురం నిర్మాణానికి నగర ప్రజలందరూ నగరపాలక సంస్థకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్, అనంతపురం నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు, ఎస్.ఈ రాజశేఖర్, ఐ సి సి సి సిబ్బంది, అసిస్టెంట్ ఇంజనీర్లు నవీన్, ముఖేష్ పాల్గొన్నారు.



# జీవో నెంబర్ 396 ను రద్దు చేయాల్సిందే

ప్రజాభూమి, హిందూపురం టౌన్

దస్తావేజులేఖరుల పట్ల శాపంగా మారిన ప్రభుత్వ జీవో 396ను వెంటనే రద్దు చేయాల్సిందేనని వైకాపా మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. సంబంధిత జీవోను వ్యతిరేకిస్తూ హిందూపురం దస్తావేజు లేఖరుల సంఘం ఆధ్వర్యంలో దస్తావేజు లేఖరులు చేపట్టిన నిరసనకు బుధవారం ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా దస్తావేజులేకరుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పీపీపీ విధానం వల్ల లక్షలాది మంది దస్తావేజు లేకరులు ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలలో పీపీపీ విధానం అమలు కోసం తెచ్చిన జీవో 396 రద్దు కోరుతూ దస్తావేజులేఖరుల జీవనోపాధిని దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోతే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖర్లకు మద్దతుగా నిలిచి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దస్తావేజులేఖరుల సంఘం ప్రతినిధులు, పోలవరం వైకాపా నాయకులు పాల్గొన్నారు.



# ప్రముఖ అంతరిక్ష సాంకేతిక అంకుర సంస్థ 'స్కైరూట్ ఏరోస్పేస్' లో

## అనంతపురం అమ్మాయి సుష్మ ఘనత

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ప్రముఖ అంతరిక్ష సాంకేతిక అంకుర సంస్థ 'స్కైరూట్ ఏరోస్పేస్'పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్ 'విక్రమ్ -1'ప్రయోగం ఇటీవల విజయవంతమైంది. దీన్లో కీలకమైన రాకెట్ గ్రౌండ్ చెకౌట్ టీమ్ లోని ఐదుగురిలో ఒకే అమ్మాయి ఉన్నారు. ఆమే మారక సుష్మ సంక్లిష్టమైన ఈ రంగంలో తన ప్రయాణం, అనుభవాలను 'వసుంధర'తో పంచుకున్నారిలా మాది అనంతపురం జిల్లా రాప్తాడు మండలం ఎం బండమీదపల్లి అమ్మానాన్నలు సుజాత, సుబ్బారెడ్డి, పది వరకు అనంతపురంలో, ఇంటర్ హైదరాబాద్లో చదివా. కర్నూలులో బీటెక్ (ఈఈఈ), వరంగల్ ఎన్ఐటీలో ఎంటెక్ (పవర్ సిస్టమ్స్) చేశాను. ఏబీబీ కంపెనీలో ఇంటర్న్షిప్ పూర్తయ్యాక, స్కైరూట్ ఏరోస్పేస్లో 'ల్యాబ??వ్యూ ఇంజినీర్ గా ఎంపికయ్యా. మా ప్రాజెక్ట్ విషయానికొస్తే.. రాకెట్ గాల్లోకి లేచాక అందులోని వ్యవస్థలన్నీ స్వయంచాలితంగా పనిచేస్తాయి. అందుకు సాఫ్ట్వేర్ ఆధారిత కమాండ్స్ పనిచేస్తాయి. అంతరిక్షంలో సందర్భానికి తగ్గట్టుగా మాడ్యూల్స్ ప్రతిస్పందించేలా అల్గారిథమ్ రాసే సాఫ్ట్వేర్ ఇది, దీంతో పాటు అది సరిగ్గా పనిచేసేలా మరో పర్యవేక్షక సాఫ్ట్వేర్నూ మేమే రూపొందించాం. విక్రమ్-1 కోసం మేము రూపొందించుకున్న 'ప్రాజెక్ట్ ఆగమన్' రెండున్నరేళ్ల పాటు నాలుగు దశల్లో సాగింది. మొదటి దశలో ఒక్కో మాడ్యూల్ను, రెండో దశలో కొన్నేసి మాడ్యూళ్లను కలిపి పరీక్షించాం. మూడో దశలో వాటన్నింటినీ రాకెట్ లో అమర్చి, చివరి దశలో సన్నాహక పరీక్షతో ప్రయోగానికి సిద్ధం చేశాం. చివరి మూడు నెలలు మరింత కష్టపడ్డాం. శ్రీహరికోటలోని షార్లోనే రోజుకు 12 గంటలకు పైగా పనిచేసేవాళ్లం.



ప్రయోగానికి మూడు రోజుల ముందు నిద్రని కూడా మర్చిపోయి పనిచేశాం. ఆ 10 నిమిషాలు జులై 18న విక్రమ్-1 రాకెట్ ప్రయోగ కౌంట్డౌన్కు అంతా సిద్ధమైంది. అతిథులంతా గ్యాలరీ నుంచి చూస్తున్నారు. సరిగ్గా ఆ సమయంలో సాంకేతిక కారణలతో అటోమేటిక్ లాంచింగ్ వ్యవస్థ హోల్డ్ మోడ్లోకి వెళ్లింది. ఆ తీవ్ర ఒత్తిడిలోనే 10 నిమిషాల్లో లోపాన్ని గుర్తించి సాఫ్ట్వేర్ను రీ రన్ చేశాం. రాకెట్ కక్ష్యలోకి దూసుకెళ్లాక అభినందనలు వెల్లువెత్తాయి. కల్పనా చావ్లా స్ఫూర్తితో ఏరోస్పేస్ రంగం ఎంచుకున్నాను. నేను చేరినప్పటికీ, ఇప్పటికీ ఇందులో అమ్మాయిల సంఖ్య పెరిగింది. సమానావకాశాలతో పాటు చక్కటి గుర్తింపు లభిస్తోంది. రాకెట్ సాంకేతికత క్లిష్టమైనదిగా అనిపించొచ్చును. కానీ, చదువుల్లో బలమైన పునాది ఉండి ఆసక్తి, కొత్త సాంకేతికతలను నేర్చుకోవాలన్న తపన ఉంటే ఎవరైనా ఇందులో నెగ్గుకురావొచ్చున్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్టాత్మక మిషన్లలో భాగస్వామిని అయ్యేందుకు కృషిచేస్తాన్నారు.

# 'ఓపీ'క ఉంటేనే వైద్యం..! -10 నిమిషాల చికిత్స కోసం 5 గంటల నిరీక్షణ..!!

## -జిల్లా ఆసుపత్రి హోదా పెరిగింది... -వైద్య సేవల వేగం ఎందుకు పెరగలేదు -ఉచిత వైద్యం పేరుతో -సహనాన్ని కోల్పోతున్న పేదలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రభుత్వాసుపత్రికి వెళితే వైద్యం ఉచితం... అయితే ఓపిక మాత్రం అపరిమితం కావాలి." ప్రస్తుతం హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇదే. సాధారణ జ్వరం, దగ్గు, రక్తపోటు, షుగర్ వంటి వ్యాధులకు చికిత్స కోసం ఉదయం ఆసుపత్రికి వచ్చే రోగికి అదే రోజు పూర్తిస్థాయిలో వైద్యం అందకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పది నిమిషాల్లో పూర్తయ్యే వైద్య పరీక్ష కోసం గంటల తరబడి క్యూల్లో నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లా ప్రభుత్వాసుపత్రి అంటే ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు, అత్యాధునిక సౌకర్యాలు, త్వరితగతిన చికిత్స అందే కేంద్రంగా ఉండాలి. అయితే హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఇక్కడ వైద్యం కంటే ముందు రోగి ఓపికకు పరీక్ష ఎదుర్కోవాల్సి వస్తోంది. పది నిమిషాల వైద్య పరీక్ష కోసం ఐదు గంటలపాటు క్యూల్లో నిలబడాల్సి వస్తుండగా, కొన్ని సందర్భాల్లో ఒకే రోజులో చికిత్స పూర్తి కాక మరుసటి రోజు మళ్లీ ఆసుపత్రికి రావాల్సిన పరిస్థితి నెలకొంది. అనారోగ్యంతో వచ్చిన రోగి శారీరక బాధతో పాటు మానసిక ఒత్తిడినీ భరించాల్సి వస్తోంది. ప్రభుత్వ వైద్య సేవలపై ఆధారపడే వేలాది మంది పేదలకు ఇది నిత్యకృత్యంగా మారింది.

### ఉదయం ఆసుపత్రికి అడుగుపెడితే సాయంత్రం వరకు నిరీక్షణే

ఒక సాధారణ రోగి ఉదయం 10 గంటలకు ఆసుపత్రికి వస్తే ముందుగా ఓపీ టికెట్ కోసం కనీసం అరగంట పాటు లైన్‌లో నిలబడాల్సిందే. ఓపీ చీటీ చేతికి వచ్చిన తర్వాత వెంటనే వైద్యుడిని కలిసే అవకాశం ఉండదు. సంబంధిత విభాగం ముందు మరో గంట నుంచి గంటన్నర వరకు వేచి ఉండాల్సి వస్తోంది. వైద్యుడి వద్దకు చేరేసరికి అప్పటికే మధ్యాహ్నం అవుతోంది. రోగి పరిస్థితిని పరిశీలించి చికిత్స చెప్పడానికి వైద్యుడు కేటాయించే సమయం ఐదు నుంచి పది నిమిషాలు మాత్రమే. అయితే ఆ పది నిమిషాల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

### పరీక్షలు రాస్తే... కష్టాల రెండో అధ్యాయం

వైద్యులు రక్త పరీక్షలు లేదా ఇతర ల్యాబ్ పరీక్షలు సూచిస్తే రోగి ప్రయాణం అక్కడితో ముగియదు. ల్యాబ్ వద్ద మరోసారి పెద్ద క్యూలో నిలబడాల్సి వస్తోంది. రక్త నమూనాలు ఇవ్వడానికి అరగంట నుంచి గంట సమయం పడుతోంది. కొన్నిసార్లు పరీక్షల కోసం అవసరమైన సదుపాయాలు, సిబ్బంది పరిమితంగా ఉండటంతో మరింత ఆలస్యం జరుగుతోంది.

### రిపోర్టు వెంటనే కాదు... మళ్లీ రేపు రండి

ల్యాబ్‌లో రక్త నమూనాలు ఇచ్చిన తర్వాత కూడా రోగికి వెంటనే ఫలితాలు అందడం లేదు. కొన్ని పరీక్షల నివేదికలు సాయంత్రానికి వస్తే, మరికొన్ని పరీక్షలకు మరుసటి రోజు వరకు వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో వైద్యులు కూడా పూర్తి స్థాయిలో చికిత్స అందించలేక తాత్కాలిక మందులు రాసి, రిపోర్టులు తీసుకుని రేపు మళ్లీ రండి అని సూచిస్తున్నారు. అంటే ఒక సాధారణ చికిత్స కోసం కూడా రోగి రెండు రోజులపాటు ఆసుపత్రి చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

### మందుల కోసం మరోసారి లైన్...

వైద్యులు మందులు రాసిచ్చిన తర్వాత కూడా రోగి ఇంటికి వెళ్లలేడు. ఆసుపత్రి ఫార్మసీ ముందు మరోసారి క్యూలో నిలబడాల్సిందే. ఇప్పటికే గంటల తరబడి నిరీక్షించిన రోగి, మరోసారి మందుల కోసం వేచి ఉండాల్సి రావడంతో తీవ్ర అసహనానికి గురవుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, చిన్నారులతో వచ్చిన మహిళలు ఈ పరిస్థితిని మరింత కష్టంగా అనుభవిస్తున్నారు.



### ఒక రోజు కూలీ... ఆసుపత్రికే అంకితం

ఈ పరిస్థితుల వల్ల ఎక్కువగా నష్టపోతున్నది పేద, మధ్యతరగతి ప్రజలే. రోజువారీ కూలి పనులు చేసుకునే వ్యక్తి వైద్యం కోసం ఆసుపత్రికి వస్తే ఆ రోజు సంపాదన పూర్తిగా కోల్పోవాల్సి వస్తోంది. రైతులు వ్యవసాయ పనులను వదిలి రావాల్సి వస్తోంది. చిన్న వ్యాపారులు దుకాణాలు మూసి ఆసుపత్రికి వస్తున్నారు. ఒకే రోజులో వైద్యం పూర్తికాక మరుసటి రోజు మళ్లీ రావాల్సి వస్తే ఆర్థికంగా మరింత నష్టపోతున్నారు.

### జిల్లా ఆసుపత్రి హోదా... అదే పాత సమస్యలు

హిందూపురం ప్రభుత్వాసుపత్రికి జిల్లా ఆసుపత్రి హోదా కల్పించడం వల్ల మెరుగైన వైద్య సేవలు అందుతాయనే ఆశతో ప్రజలు ఎదురుచూశారు. జిల్లా ఆసుపత్రిగా మారడంతో అధునాతన వైద్య సేవలు, అదనపు వైద్యులు, ఆధునిక పరికరాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని భావించారు. పేరు మారినా, రోగులు ఎదుర్కొంటున్న సమస్యలు మాత్రం పెద్దగా మారలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లా ఏర్పడిన తర్వాత హిందూపురంతో పాటు పెనుకొండ, పరగి, మడకశిర, గోరంట్ల, చిలమత్తూరు, లేపాక్షి, రొళ్ల, గుడిబండ, అమరాపురం, అగళి తదితర మండలాల నుంచి వేలాది మంది రోగులు ఈ ఆసుపత్రినే ఆశ్రయిస్తున్నారు. అంతేకాకుండా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల ప్రజలు కూడా చికిత్స కోసం ఇక్కడికే వస్తున్నారు. రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతున్నా, అందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది, ల్యాబ్ సదుపాయాలు, ఓపీ కౌంటర్లు, ఫార్మసీ సేవలు విస్తరించకపోవడంతో రోగుల రద్దీ నియంత్రణకు నోచుకోవడం లేదు. జిల్లా ఆసుపత్రి హోదా అంటే కేవలం భవనాలు, బోర్డులు, హోదా పెరగడం మాత్రమే కాదు. జిల్లా స్థాయికి తగ్గట్టుగా స్పెషలిస్టు వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది, ఆధునిక నిర్ధారణ కేంద్రాలు, వేగవంతమైన పరీక్షలు, అత్యవసర సేవలు అందుబాటులో ఉండాలి. కానీ ప్రస్తుతం అనేక విభాగాల్లో ఖాళీలు కొనసాగుతుండటంతో ఉన్న సిబ్బందిపైనే తీవ్ర పని భారం పడుతోంది. ఫలితంగా రోగులు గంటల తరబడి క్యూల్లో నిరీక్షించాల్సి వస్తోంది. కోట్ల రూపాయలతో భవనాలు నిర్మించడం మాత్రమే ప్రభుత్వ వైద్య సేవల అభివృద్ధికి కొలమానం కాదు. ఆ భవనాల్లో ప్రజలకు ఎంత వేగంగా, ఎంత నాణ్యంగా, ఎంత గౌరవప్రదంగా వైద్యం అందుతోంది అనేదే అసలు ప్రమాణం. జిల్లా ఆసుపత్రిగా హోదా పెరిగినా, రోగి అనుభవించే సేవల్లో మార్పు కనిపించకపోతే ఆ హోదా ప్రజలకు ఆశించిన ప్రయోజనం అందించినట్లు చెప్పలేం. హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిని నిజమైన జిల్లా ఆసుపత్రిగా తీర్చిదిద్దాలంటే ఖాళీ పోస్టుల భర్తీ, స్పెషలిస్టు వైద్యుల నియామకం,గ అదనపు ఓపీ కౌంటర్లు, ఆధునిక ల్యాబ్ వ్యవస్థ, డిజిటల్ టోకెన్ విధానం, వేగవంతమైన మందుల పంపిణీ వంటి సంస్కరణలను అత్యవసరంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. జిల్లా ఆసుపత్రి హోదాకు తగ్గ సేవలు అందినప్పుడే ప్రజల ఆశలు ఫలిస్తాయి.





### సమస్య వైద్యులది కాదు... వ్యవస్థది

హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు కేవలం వైద్యులను బాధ్యులను చేయడం సరైంది కాదు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వైద్యులు తమ సామర్థ్యానికి మించి సేవలందిస్తున్నారనేది వాస్తవం. రోజుకు 1,200 నుంచి 1,500 మంది వరకు ఓపీ రోగులను పరిమిత సంఖ్యలో ఉన్న వైద్యులే పరీక్షించాల్సి వస్తోంది. ఒకవైపు ఓపీ, మరోవైపు వార్డుల్లోని రోగులు, అత్యవసర కేసులు, శస్త్రచికిత్సలు, పరిపాలనా బాధ్యతలు... ఇలా అనేక పనులను ఒకేసారి నిర్వహించాల్సి వస్తోంది. ఫలితంగా ఒక్కో రోగికి కేటాయించే సమయం సహజంగానే తగ్గిపోతోంది. అసలు సమస్య వైద్యుల పనితీరులో కాకుండా వ్యవస్థాపరమైన లోపాల్లో ఉంది. రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా, అందుకు అనుగుణంగా వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఇతర సిబ్బంది నియామకాలు జరగడం లేదు. ఓపీ కౌంటర్లు పరిమితంగా ఉండడం, ల్యాబ్ సేవలు తగిన స్థాయిలో విస్తరించకపోవడం, రిపోర్టులు వెంటనే అందించే సదుపాయాలు లేకపోవడం, మందుల పంపిణీ కేంద్రాల్లో కూడా సిబ్బంది కొరత ఉండటం వల్ల ప్రతి దశలోనూ రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

### ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అంశాలు

రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. అదనపు ఓపీ కౌంటర్లు, మరిన్ని ల్యాబ్ సిబ్బంది, ప్రత్యేక ఫార్మసీ కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు పరీక్షల నివేదికలు వీలైనంత వరకు అదేరోజు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా ఆసుపత్రికి తగ్గ స్థాయిలో మౌలిక వసతులు, మానవ వనరులు కల్పించినప్పుడే వేలాది మంది పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందని అభిప్రాయపడుతున్నారు.

ప్రజాభూమి

వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7

గురువారం 30 జూలై 2026


# అంగరంగ వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు

## ప్రత్యేక అలంకరణ దర్శనం ఇచ్చిన సాయినాధుడు - భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం

ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలో గురు పౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా సాయినాధుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పార్లపల్లి రోడ్డు సమీపంలో ఉన్న పాత శిరిడి సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి పురస్కరించుకొని ఉదయస్థమాన ఆలయ ప్రధాన అర్చకుడు మురళి స్వామి కాగడ హారతి, మధ్యాహ్న హారతి, సంధ్య హారతి, సేజ హారతి, హారతులు ఇచ్చి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నప్రసాదా కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం



సాయినాధుని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామసభలో కోలాటం, తాళాల భజన, డీజే పాటలు అందర్నీ ఆకట్టుకున్నాయి. స్వామివారి గ్రామసభలో ప్రజలు పాల్గొని స్వామి వారికి కార్యకర్తలను సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

మైత్రి లేఔట్ లోని సాయిబాబాకు ప్రత్యేక పూజలు భక్తులకు అన్నదాన కార్యక్రమం

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలో కొలువై ఉన్న సాయిబాబా దేవాలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు ఉదయస్థ మానే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం పచ్చల కొన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**బైపాస్ మార్కెట్లోని సాయినాధునికి ప్రత్యేక పూజలు**

పులివెందుల పట్టణంలోని బైపాస్ రోడ్ మార్కెట్ లోని షిరిడి సాయిబాబా ఆలయంలో సాయినాధునికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నదాన కార్యక్రమాన్ని భక్తులకు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**సాయినాథుని దర్శించుకున్న వైయస్ మనోహర్ రెడ్డి**

గురు పౌర్ణమి పండుగ పురస్కరించుకుని పట్టణంలోని పార్లపల్లి రోడ్డు లో ఉన్న సాయిబాబా ఆలయంలో వైకాపా మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైకాపా నాయకులు, వైయస్సార్ ట్రస్ట్ యజమాని వీరారెడ్డి, ఆంజనేయులు సాయినాధుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ రామసుబ్బయ్య వారిని దుశాలవాతో ఘనంగా సత్కరించారు.

# కూటమి పాలనపై ప్రజల సంతృప్తి - మున్సిపల్‌లో టీడీపీ జెండా ఎగరడం ఖాయం: బిటెక్ రవి

## ప్రజా దర్బార్‌తో ప్రజలకు చేరువైన కూటమి ప్రభుత్వం - పులివెందులలో విజయం మాదే

ప్రజాభూమి,పులివెందుల

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వం పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పులివెందులలో టీడీపీ జెండా ఖచ్చితంగా ఎగరవేస్తామని పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బిటెక్ రవి ధీమా వ్యక్తం చేశారు.పులివెందుల టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా బిటెక్ రవి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ అని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనంతో పని



చేస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తున్నారని కొనియాడారు.ప్రజలు అందించిన ప్రతి అర్జీని పరిశీలించి, పెండింగ్ సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులకు



ఫోన్ చేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్లు, తాగునీరు, పెన్షన్లు, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చూస్తున్న మా ప్రభుత్వానికి ప్రజల మద్దతు పూర్తిగా ఉంది. అందుకే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పులివెందులలో టీడీపీ జెండా ఎగరవేయడం ఖాయం"లి అని బిటెక్ రవి ధీమా వ్యక్తం చేశారు.ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రథమ ప్రాధాన్యత. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ విధానం అని ఆయన అన్నారు.ప్రజా దర్బార్‌కు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం: చమ్మర్తి జగన్మోహన్ రాజు

## - సిద్ధవటంలో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం

## - ఫేక్ ప్రచారాలను నమ్మొద్దని పిలుపు

ప్రజాభూమి, సిద్ధవటం: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తోందని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమ్మర్తి జగన్మోహన్ రాజు అన్నారు. బుధవారం సిద్ధవటం మండల కేంద్రంలోని ఎగువపేట ఎస్సీ కాలనీలో నిర్వహించిన ''ఇంటింటా తెలుగుదేశం'' కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. గత వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. మహిళలకు అమలు చేస్తున్న శ్రీ శక్తి, తల్లికి వందనం వంటి పథకాలు కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. సిద్ధవటం మండలంలో టీడీపీ నాయకులను సమన్వయం చేసి ఏకతాటిపైకి తీసుకొచ్చామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర



కార్యదర్శి శనివారపు మోహన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సయ్యద్ జవహర్ భాష మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంపై జరుగుతున్న అసత్య ప్రచారాలను ప్రజలు విశ్వసించవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్, దశరథ నాయుడు, జగదీశ్వర్‌రెడ్డి, సంజీవరెడ్డి, రాజేంద్రప్రసాద్, చలమయ్య యాదవ్, నాగమునిరెడ్డి, బాలిరెడ్డి, నరసింహారెడ్డి, శంకర్‌రెడ్డి, మామిడి సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, రాంప్రసాద్, పాలకొండయ్యతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కడప రహదారుల అభివృద్ధిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ అవినాష్ రెడ్డి వినతిపత్రం

## సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

ప్రజాభూమి, పులివెందుల



కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి మంగళవారం కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని కలిసి కడప జిల్లా రహదారుల అభివృద్ధిపై వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ జిల్లాలోని ముద్దనూరు నుంచి కడప వరకు ఉన్న రహదారిని లైన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే కడప ఇర్కాన్ సర్కిల్ నుంచి జేఎంజే సర్కిల్ వరకులి ఉన్న రోడ్డును కూడా 4 లైన్లుగా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు.పెరిగిన వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని కడప కార్పొరేషన్ పరిధిలో ఇర్కాన్ సర్కిల్ నుంచి ఐటీఐ సర్కిల్ వరకు,ఫుట్‌పాత్‌లు, ఇంటర్‌లాకింగ్ పేవర్ బ్లాక్స్‌తో పార్కింగ్, స్టార్మ్ వాటర్ డ్రైనేజీ తదితర పనులు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరారు.ఈ మూడు ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# వేల్పులలో ఇంటింటికీ టీడీపీ - ప్రజా సమస్యలపై ఆరా

## గ్రామ పర్యటనలో ప్రజల సమస్యలు తెలుసుకున్న పార్థసారధి రెడ్డి అజ్జుగుట్టు రఘునాథరెడ్డిలు

ప్రజాభూమి, పులివెందుల

ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా వేముల మండలం వేల్పుల గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి,అజ్జగుట్ట రఘునాథ రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు అర్హులైన పేదలకు శాశ్వత నివాస గృహాలుకల్పించాలని, యువతకు ఉద్యోగ అవకాశాలుకల్పించాలని, అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. తల్లికి వందనం పథకంలోని లోటుపాట్లను సరిచేయాలని, ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందించా లని విజ్ఞప్తి చేశారు.ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్ల పార్థసారథి రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించడమే టీడీపీ లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో పేర్ల శేషారెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు బ్రహ్మయ్య,క్లస్టర్ ఇంచార్జ్ భాస్కర్ రెడ్డి,కోనపురి శివరాం, వేల్పుల సొసైటీ అధ్యక్షుడు రాగిపిండి సుధాకర్ రెడ్డి,హనుమంత రెడ్డి,అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాస మహర్షి గురువులకే గురువు.. ఆది గురువు

## - మానవాళికి విజ్ఞానాన్ని అందించిన వేద వ్యాసుడు

## - ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



గురుపూర్ణిమ (వ్యాస పూర్ణిమ) సందర్భంగా స్థానిక పట్టణంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి మాట్లాడుతూ వ్యాస మహర్షి గురువులకే గురువు, మానవాళికి విజ్ఞానాన్ని అందించిన ఆది గురువని కొనియాడారు. వేదాలను ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదంగా నాలుగు భాగాలుగా విభజించి మానవాళికి అందించారని తెలిపారు. మహాభారతం, శ్రీమద్భాగవతం, భగవద్గీత, అష్టాదశ పురాణాలు, బ్రహ్మసూత్రాలు వంటి మహాగ్రంథాలను రచించి సమాజానికి అమూల్యమైన జ్ఞానసంపదను అందించారని పేర్కొన్నారు. ఆషాఢ శుద్ధ పూర్ణిమ రోజున వ్యాస మహర్షి జన్మించిన సందర్భంగా ఆ రోజును వ్యాసపూర్ణిమ, గురుపూర్ణిమగా జరుపుకుంటారని, సమాజానికి జ్ఞానాన్ని అందించి సన్మార్గం చూపే ఉపాధ్యాయులు, ఆధ్యాత్మిక గురువులను గౌరవించి కృతజ్ఞతలు తెలిపే పవిత్ర దినమే గురుపూర్ణిమ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు రామాంజనేయరెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, బద్రి, రాఘవయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ రథంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

## - డీడీఓ వెంకట సుబ్బయ్య

ప్రజాభూమి, వేంపల్లె



ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి (డీడీఓ) వెంకట సుబ్బయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక పాతబజార్ ప్రాంతంలో స్వచ్ఛ రథాన్ని పరిశీలించిన ఆయన అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త నిర్వహణ, పారిశుద్ధ్యంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడమే స్వచ్ఛ రథం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్లాస్టిక్, కాగితం, ఇనుము తదితర వ్యర్థాలను తూకం వేసి, వాటి విలువకు అనుగుణంగా నిత్యావసర వస్తువులు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ గ్రామాల పరిశుభ్రతకు సహకరించి, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా పరిశుభ్రమైన వాతావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుళాయమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ రమణయ్య, పంచాయతీ ఈఓ కవిత, సిబ్బంది రాహుల్, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతాప్ రెడ్డిని పరామర్శించిన వైఎస్ మనోహర్ రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని యర్రంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ప్రతాప్ రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం బుధవారం స్వగృహానికి చేరుకున్నారు ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న విషయాన్ని తెలుసుకున్న పులివెందుల మున్సిపల్ వైకాపా ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైసీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ ప్రతాప్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ఆరోగ్య పరిస్థితిని విచారించారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సంగమేశ్వర్ రెడ్డి, రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామికి విశేష పూజలు

ప్రజాభూమి,పులివెందుల



పార్నపల్లి రోడ్డు కోతి సమాధి సమీపంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం హరిహర పుత్రునికి విశేష పూజలు నిర్వహించారు.ఆలయ వ్యవస్థాపకులు గురుస్వామి వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, బిల్వ అర్చన, అష్టోత్ర శతనామావళి నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి బుధవారం, కార్తీక మాసంలో, స్వామి జన్మ నక్షత్రంలో విశేష పూజలు నిర్వహిస్తామని గురుస్వామి తెలిపారు. సాయంత్రం భజనలు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# దేవరకోన హరిహర క్షేత్రంలో ఘనంగా శ్రీ చాతుర్మాస వ్రత దీక్ష ప్రారంభం



ప్రజాభూమి -లింగాల

వైఎన్ఆర్ కడప జిల్లా లింగాల మండలం వెలిదండ్ల గ్రామంలోని ప్రసిద్ధ దేవరకోన హరిహర క్షేత్రంలో శ్రీ చాతుర్మాస వ్రత దీక్ష బుధవారం పారాయణంతో వైభవంగా ప్రారంభమైంది. ఈ వ్రత దీక్ష నవంబర్ 24వ తేదీ కార్తీక పౌర్ణమి వరకు, అంటే 4 నెలల పాటు (120 రోజులు) సుదీర్ఘంగా కొనసాగనుంది. వెలిదండ్ల దేవరకోన హరిహరక్షేత్ర భాగవత భక్త సమాజం నిర్వహణలో, పరిసర గ్రామాల దాతలు భక్తుల విశేష సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. 4 నెలల పాటు జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగవత పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ పరమాత్మ కృపకు పాత్రులు కావాలని భక్త సమాజ కార్యవర్గం పరిసర గ్రామాల పెద్దలు కోరారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో దేవరకోన హరిహర క్షేత్ర భాగవత భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు వెన్నపూస నారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షులు సరిబాల వెంకట నారాయణరెడ్డి, రాయలసీమ భాగవత భక్త సమాజం కన్వీనర్ యాగంటి బాలకృష్ణారెడ్డితో పాటు ప్రముఖులు కామసముద్రం వీరాంజనేయరెడ్డి, తాతిరెడ్డి పల్లి వీరనాగిరెడ్డి, రామచంద్రారెడ్డి, వెలిదండ్ల వేణుతర్ల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శీతల గంగమ్మ శోభా యాత్ర అలంకరణ కు అతికారి కృష్ణ రూ.1,00,116 విరాళం



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో జరుగుతున్న శ్రీ శీతల గంగమ్మ తల్లి 23వ జాతర మహోత్సవం సందర్భంగా రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ గురువారం జరిగే అమ్మవారి శోభా యాత్ర అలంకరణ కోసం రూ.1,00,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా జాతర మహోత్సవానికి అతికారి కృష్ణ ఆర్థిక సహకారం అందిస్తూ భక్తిశ్రద్ధలను చాటుకుంటున్నారని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని రాజకీయంగా మరెన్నో వున్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలేఖ భర్త దేరంగుల శ్రీకాంత్, మన ఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్, ఆలయ కమిటీ సభ్యులు బిట్టా వెంకటేశు, దాసరి వినోద్ కుమార్, సాయి, సుబ్బరాయుడు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి సందర్భంగా శిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రజాభూమి, సిద్ధవటం: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సిద్ధవటం మండలంలోని ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయం సమీపంలోని శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శిరిడి సాయిబాబా మూల విరాట్ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు శ్రీనివాసులు శాస్త్రి తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం, కోలాటాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఆవుల రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా శీతల గంగమ్మ జాతర ప్రారంభం

## - భక్తుల దర్శనార్థం రూపుదిద్దుకుంటున్న అమ్మవారి ప్రతిమ




ప్రజాభూమి, సిద్ధవటం: కడప--చెన్నై జాతీయ రహదారిపై మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతిపురంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి 23వ వార్షిక జాతర సందర్భంగా బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతర లో భాగంగా అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ పూజారి రంగమ్మ తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రానికి అమ్మవారి మట్టి ప్రతిమను తయారు చేసి రాత్రికి ఆలయంలోని వేప పందిరిలో కుదుట పరచి భక్తుల దర్శనానికి ఏర్పాటు చేస్తామని తెలిపారు. గురువారం బోనాలు, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సుధా మురళి, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి దాతల దాతృత్వం మరువలేనిది

**- కల్యాణ వేదిక నిర్మాణానికి రూ.30 వేల విరాళం**

**- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**

ప్రజాభూమి, వేంపల్లె



ఆలయాల అభివృద్ధికి దాతల దాతృత్వం మరువలేనిదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక పట్టణంలోని గాండ్ల వీధిలో వెలసిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో అమెరికాలో స్థిరపడిన ప్రవాస భారతీయుడు, తన చిన్ననాటి స్నేహితుడు తొండమనాటి సుభాష్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ, స్వామివారి కల్యాణోత్సవాల నిర్వహణ కోసం నిర్మించనున్న కల్యాణ వేదికకు తొండమనాటి సుభాష్ తన వంతు సహాయంగా రూ.30 వేల నగదు విరాళం అందించడం అభినందనీయమన్నారు. సముద్రాలు దాటి విదేశాల్లో స్థిరపడినా భారతీయులు సనాతన ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ తమ సొంత ఊరిని, ఆలయాలను మరువకపోవడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ గ్రామాభివృద్ధితో పాటు ఆలయాల అభివృద్ధికి కూడా తోడ్పాటునందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, రంగారెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రవియాదవ్, సురేష్, జయప్రకాశ్ రెడ్డి, అంజి నాయక్, ఆలయ వంశపారంపర్య అర్చకులు శేషగిరిరావు, ఆలయ ప్రతినిధి సింగనమల సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

# షిరిడీ సాయిబాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా తిరుపతి రూరల్ మండలం తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయిబాబా ఆశీస్సులు పొందారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీధనమల్లి హైస్కూల్లో అపరశుభ్రత

## హై స్కూల్ ప్రాంగణంలో పేడ దిబ్బలు, డ్రైనేజీ నీళ్లు. శ్రీధనమల్లి పంచాయతీలో స్వచ్ఛభారత్ ఎక్కడ??




ప్రజా భూమి ప్రతినిధి సూళ్లూరుపేట

తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం శ్రీధనమల్లి పంచాయతీలోని జడ్పీ హైస్కూల్ ప్రాంగణంచుట్టూ పేడ దిబ్బలు వేస్తున్న పంచాయతీ కార్యదర్శి స్పందించకపోవడం లేదు. రాష్ట్రమంతా చెత్త పై సమరం చేస్తుంటే శ్రీధనమల్లి పంచాయతీలో మాత్రం ఆ ఆనవాళ్లే కనబడడం లేదు. గృహాలలో వాడుకున్న మురికి నీళ్లు స్కూలు ప్రాంగణంలోకి వదులుతున్న హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కానీ, పంచాయతీ కార్యదర్శి గాని స్పందించడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి స్కూలు ప్రాంగణంలో ఉన్న పేడ దిబ్బలను తీపించాలని పిల్లల తల్లిదండ్రులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సాయి నగర్ పంచాయతీలో మూడో రోజు '2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమానికి విశేష స్పందన

ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి



తిరుపతి రూరల్ మండలంలోని సాయి నగర్ పంచాయతీలో మూడో రోజు నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో పులివర్తి సుధారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఇంటింటి ప్రచార యాత్రకు మహిళలు హారతులు పట్టి, తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, రూ.10 లక్షలతో పంచాయతీ భవనం మరమ్మతులు, రూ.11 లక్షలతో డ్రైనేజీ, వాటర్ ట్యాంక్ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా మరిన్ని డ్రైనేజీ, సీసీ రోడ్ల పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు, ఆమోదం వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, బూత్, యూనిట్, క్లస్టర్, గ్రామ కమిటీ సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష - రూ.6లక్షల జరిమానా

## తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి బుధవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎస్టీఎఫ్ హెడ్ ఎల్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ శ్రీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 01/2019 కేసులో ఈ ముద్దాయి నాగపట్ల ఈస్ట్ బీటు, చామల రేంజ్, తిరుపతి డివిజన్ రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని ఎర్రచందనం దుంగలతో దొరసామి ఎలుమలై అనే వ్యక్తి అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, తిరువన్నామలై జిల్లా పోలూరు తాలూకా, పాదిరి గ్రామానికి చెందిన వాడు, కాగా ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.

# చంద్రగిరిలో '2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమానికి విశేష స్పందన



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి

చంద్రగిరి మండలం కల్ రోడ్డుపల్లి పంచాయతీలో నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమానికి యువ నాయకుడు పులివర్తి వినీల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కల్ రోడ్డుపల్లి పంచాయతీకి చేరుకున్న ఆయనకు గ్రామస్థులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే గ్రామంలోని ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ కార్యక్రమంలో ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కుటుంబాల పిల్లల ప్రతిభకు ప్రోత్సాహం... మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేత



- క్రమశిక్షణ, కృషి, సరైన మార్గదర్శకత్వంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- ప్రతిభ కనబరిచిన పోలీస్ కుటుంబాల విద్యార్థులు, తల్లిదండ్రులకు అభినందనలు.
- తల్లిదండ్రులే పిల్లలకు తొలి రోల్ మోడల్స్
- 9 కుటుంబాల్లో ఇద్దరేసి పిల్లలు మెరిట్ సాధించడం ప్రత్యేక అభినందనీయం.
- జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు



ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి

జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌ల కార్యక్రమంలో విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి లిజిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ముఖ్య అతిథిగా హాజరై మెరిట్ సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించి, స్కాలర్‌షిప్‌లు మరియు అభినందన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ పోలీస్ కుటుంబాల్లోని పిల్లలకు తల్లిదండ్రుల జీవన విధానమే తొలి పాఠశాల వంటిదని పేర్కొన్నారు. పోలీస్ ఉద్యోగులు విధి నిర్వహణలో చూపించే క్రమశిక్షణ, అంకితభావం, బాధ్యత, కష్టపడే తత్వాన్ని పిల్లలు చిన్నతనం నుంచే గమనిస్తుంటారని తెలిపారు. పిల్లలు తల్లిదండ్రుల నుంచి క్రమశిక్షణను నేర్చుకుని, సరైన మార్గదర్శకత్వంతో తమ లక్ష్యాల వైపు పయనిస్తే అద్భుతమైన విజయాలు సాధించగలరని ఎస్పీ గారు తెలిపారు. విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా జీవితంలోనూ క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, ఆత్మవిశ్వాసం వంటి లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. ఆ ప్రతిభను గుర్తించి సరైన దిశలో ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలు తమకంటే ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటారని ఎస్పీ అన్నారు. పిల్లలకు తల్లిదండ్రులే తొలి రోల్ మోడల్స్‌గా ఉండాలని, తల్లిదండ్రుల ప్రవర్తన, క్రమశిక్షణ, విలువలు పిల్లల వ్యక్తిత్వంపై ఎంతో ప్రభావం చూపుతాయని తెలిపారు. పిల్లలపై అధిక ఒత్తిడి తీసుకురావడం కంటే వారి ఆసక్తి, సామర్థ్యం, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ సొంత ప్రతిభ, కృషి, పట్టుదలతోనే ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పేర్కొన్నారు.

**పోలీస్ కుటుంబాల పిల్లల విజయాలు గర్వకారణం**

అనేక మంది విద్యార్థులు ప్రతి సంవత్సరం ఐఐటీ, జేఈఈ, ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యా రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లి తమ ప్రతిభను చాటుతూ, వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తూ పోలీస్ కుటుంబాలకు, పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలుస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖలో తల్లిదండ్రులు ప్రజల భద్రత కోసం విధులు నిర్వహిస్తుండగా, వారి పిల్లలు విద్యా రంగంలో ప్రతిభ కనబరచడం ఎంతో సంతోషకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు అందిస్తున్న మెరిట్ స్కాలర్‌షిప్‌లు వారి ఉన్నత విద్యకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని ఎస్పీ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వివిధ విద్యా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు.

- పాఠశాల ‌& ఇంటర్మీడియట్
- ఎస్ఎస్సీ -- 26 మంది
- ఇంటర్మీడియట్ -- 18 మంది
- ప్రవేశ పరీక్షలు
- జేఈఈ అడ్వాన్స్ . 2 మంది
- జేఈఈ మెయిన్స్ -- 1 విద్యార్థి
- ఈఏపసెట్ -- 1 విద్యార్థి
- ఉన్నత విద్యా కోర్సులు
- బీటెక్ 1వ సంవత్సరం -- 16 మంది
- బీటెక్ 3వ సంవత్సరం -- 13 మంది
- ఎంబీబీఎస్ 1వ సంవత్సరం -- 4 మంది
- ఎంబీబీఎస్ 3వ సంవత్సరం -- 2 మంది
- ఎంసీఏ -- 1 విద్యార్థి
- ఎం.టెక్ 1వ సంవత్సరం -- 1 విద్యార్థి
- బీఎస్సీ -- 2 మంది
- బీసీఏ -- 2 మంది
- బీపీటీ 3వ సంవత్సరం -- 1 విద్యార్థి
- సి-ఫార్మసీ -- 2 మంది.

ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరేసి పిల్లలు మెరిట్ స్కాలర్‌షిప్‌లు సాధించడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ విధంగా ఇద్దరు పిల్లలు మెరిట్ సాధించిన 9 కుటుంబాలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పిల్లల విజయాల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం, కృషి, త్యాగం కూడా ఎంతో కీలకమని పేర్కొంటూ, ఆ తల్లిదండ్రులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మెరిట్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసే సమయంలో సాంకేతిక కారణాల వల్ల దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయలేకపోయిన అర్హులైన విద్యార్థులకు కూడా పోలీస్ వెల్ఫేర్ విభాగం ద్వారా వారి విద్యా ప్రతిభ, శాతాన్ని పరిగణనలోకి తీసుకుని తగిన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమం ముగింపులో మెరిట్ సాధించిన విద్యార్థులందరికీ జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ప్రస్తుతం సాధించిన విజయాన్ని తొలి అడుగుగా భావించి, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. "కష్టపడే తత్వం, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏ లక్ష్యమైనా సాధించవచ్చు. పోలీస్ కుటుంబాల పిల్లలు విద్యా రంగంలో మరింత ఉన్నత విజయాలు సాధించి తమ తల్లిదండ్రులకు, పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలవాలి" అని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్. ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీ రవి మనోహర ఆచారి (శాంతిభద్రతలు) ఐ. రామకృష్ణ (తిరుమల) శ్రీనివాసరావు (సాయుధ దళం) ఏవో సురేష్ కుమార్. వీరితో పాటు పలువురు డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ వెల్ఫేర్ విభాగం అధికారులు, సిబ్బంది, మెరిట్ సాధించిన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్-2026 నియోజకవర్గ స్థాయి పోటీలు విజయవంతం - జిల్లా స్థాయి క్రీడల షెడ్యూల్ విడుదల



ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్--2026 నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు జూలై 29తో తిరుపతి జిల్లాలో విజయవంతంగా ముగిశాయి. తిరుపతి, చంద్రగిరి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో బాలురు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తిరుపతి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో సుమారు 616 మంది బాలురు, 273 మంది బాలికలు పాల్గొన్నారు. వీరితో పాటు కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, అధికారులు, నిర్వాహకులు, క్రీడాభిమానులు కలిపి సుమారు 10 వేల మంది ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేశారు. పోటీల్లో పాల్గొన్న అన్ని క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం ద్వారా జిల్లా క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాణ్యమైన భోజనం అందించారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఆయా క్రీడాంశాల్లో విజేతలుగా ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలు, ఎంపికల్లో తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎన్. శశిధర్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు ఆగస్టు 9 నుంచి 12 వరకు తిరుపతిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 9న అథ్లెటిక్స్ (ఎస్.వి. యూనివర్సిటీ గ్రౌండ్), వాలీబాల్ (ఎస్.వి. యూనివర్సిటీ క్యాంపస్ హైస్కూల్ గ్రౌండ్), యోగ (శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్) పోటీలు నిర్వహించనున్నారు. ఆగస్టు 10న ఖో-ఖో (ఎస్.వి. యూనివర్సిటీ గ్రౌండ్), బ్యాడ్మింటన్, వెయిట్‌లిఫ్టింగ్ (శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్) పోటీలు జరగనున్నాయి. ఆగస్టు 11న కబడ్డీ (ఎస్.వి. యూనివర్సిటీ గ్రౌండ్), హాకీ (ఎస్.వి. ఆర్ట్స్ కళాశాల మైదానం), చెస్ (శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్) పోటీలు నిర్వహించనుండగా, ఆగస్టు 12న ఆర్చరీ (ఎస్.వి. యూనివర్సిటీ క్యాంపస్ స్కూల్ గ్రౌండ్), బాస్కెట్‌బాల్ (ఎస్.వి. యూనివర్సిటీ గ్రౌండ్), బాక్సింగ్ (శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్) పోటీలు నిర్వహించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు నిర్ణీత తేదీల్లో హాజరై జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాలని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎన్. శశిధర్ సూచించారు.

# క్రాఫ్ట్ విలేజ్ ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

## :జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,

క్రాఫ్ట్ విలేజ్ ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ లో క్రాఫ్ట్ విలేజ్ పై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం, డీఆర్డీఏ సమన్వయంతో మొత్తం 3 ఎంపోరియం బ్లాక్‌లు, 3 వర్క్ షెడ్లు మరియు మరుగుదొడ్డి సౌకర్యంతో కూడిన 1 శిక్షణ తరగతి గది నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిర్మాణ పనులను రోడ్లు మరియు భవనాల శాఖ టెండర్ విధానంలో చేపట్టిందని తెలిపారు. మొత్తం 3 ఎంపోరియం బ్లాక్ లు, శిక్షణ తరగతి గది నిర్మాణం కూడా పూర్తయిందన్నారు. 3 వర్క్ షెడ్లలో 1 వర్క్ షెడ్ నిర్మాణం పూర్తికాగా, మిగిలిన 2 వర్క్ షెడ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయ్యాయన్నారు. పెండింగ్ లో ఉన్న పనులను సంబంధిత శాఖలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి, డిఆర్డిఏ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో తిరుపతి, చిత్తూరు డిఆర్డిఏ పిడి లు శోభన్ బాబు, శ్రీదేవి, ఏడి హ్యాండి క్రాఫ్ట్ సత్యమూర్తి, ఆర్ అండ్ బి ఈఈ రాజా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 01, న శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో దివ్య సహస్ర ఘటాభిషేక మహోత్సవం



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

సకాలంలో వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని సదుద్దేశంతో 01-08-2026వ తేదీన శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ మృత్యుంజయ స్వామి వారికి దివ్య సహస్ర ఘటాభిషేక మహోత్సవం పండితుల దివ్య వేదోచ్ఛరణలు, మంత్రోచ్ఛరణల మధ్య అత్యంత వైభవోపేతంగా నిర్వహించబడుతుంది. ప్రజల సౌఖ్యం, సుఖసంతోషాలు, లోకక్షేమం కోసం కనుల పండుగగా జరిగే ఈ పవిత్ర మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, శ్రీ మృత్యుంజయ స్వామి వారి దివ్య కృపాకటాక్షాలను పొందవలసిందిగా మనస్ఫూర్తిగా కోరుతున్నాను

# గురు పౌర్ణమి సందర్భంగా బత్తినియ్య స్వామికి విశేష అభిషేకాలు

## ఓం నమశ్శివాయ నమః



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్

పుల్లారెడ్డి కండిగ తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి మండలంలో పుల్లారెడ్డి గ్రామంలో పుల్లారెడ్డి గ్రామంలో బత్తినియ్య స్వామి వెలసిన గురు పౌర్ణమి సందర్భంగా బత్తిని స్వామికి విశేష సంఖ్యలో సుగంధ ద్రవ్యాలతో ఘనంగా అభిషేకాలు దీపారాధన నైవేద్యం నిర్వహించారు పుల్లారెడ్డి కండిగ గ్రామ ఆలయ నిర్మాణ దాత బత్తిరెడ్డిపెద్దలు శ్రీకాళహస్తి స్వామి వారి దేవస్థానం వేద పండితుడు అర్థగిరి స్వామి మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని మారుమూల పల్లెటూర్లో పాటిస్తూ ఈ గ్రామ అభివృద్ధికి విద్యార్థులు గ్రామ ప్రజలు పంట పొలాలు పచ్చగా ఉండాలని ఆయన మాట్లాడారు బత్తినయ్య స్వామి గురించి విశేషంగా మాట్లాడారుపాద సేవ భక్తులు పాద సేవ నిర్వహించి పుల్లారెడ్డికండిగా పాఠశాల విద్యార్థులను భక్తులకు స్వామి ఆశీర్వాదం అర్ధగిరి స్వామి కల్పించారు పురాతన కాలాన్ని గుర్తుపెట్టుకుని శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో పనిచేసే వేద పండితుడికి ఘనంగా సన్మానించారు పుల్లారెడ్డి కండిగ పాఠశాల ఉపాధ్యాయులు అదే గ్రామానికి చెందిన పెద్దలు బత్తిని స్వామి పూజారి శివకుమార్ కెజయలక్ష్మి కెలీలా శంకర్ దంపతులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి ని కలసిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్

## ఏర్పేడు శ్రీవ్యాసాశ్రమం ప్రతిష్టతను కాపాడాలని...

## సీఎం కి కోలా ఆనంద్ వినతి



ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ విజయవాడలో ఆత్మీయంగా ఈరోజు కలవడం జరిగినది. శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధి మరియు రాజకీయ పరిస్థితులు గురించి సంభాషించుకోవడం జరిగినది. మరియు వంద సంవత్సరాలు సుదీర్ఘ చరిత్ర కల్గిన మళయాళ యతీంద్రులచేత స్థాపించిన ఏర్పేడు శ్రీవ్యాసాశ్రమం యొక్క అవినీతి వివాదాలు, అక్రమాలు గురించి ముఖ్యమంత్రి వాకబు చేశారు. ఎంతో ప్రతిష్టత కల్గిన శ్రీవ్యాసాశ్రమం అవినీతి మయమైందని, దాని పూర్వవైభం కోసం చర్యలు తీసుకువాలని ముఖ్యమంత్రి కి బీజేపీ నేత కోలా ఆనంద్ విన్నవించుకోడం జరిగింది.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసైనికులకు అండగా జనసేన నాయకులు దండి నరేంద్ర

**- దండి నరేంద్ర మరియు ముచ్చివోలు గ్రామ పెద్దల సమన్వయంతో సానుకూల పరిష్కారం**

**- వైద్య చికిత్స, బాధితులు పూర్తి కోలుకునే వరకు వైద్య ఖర్చులకు హామీ**

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్ పల్లం సచివాలయం సమీపంలో ఎర్టిగా కారు మరియు ద్విచక్ర వాహనం ఢీకొన్న దురదృష్టకర ఘటనలో, ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న ముచ్చివోలు గ్రామానికి చెందిన జనసైనికుడు శ్రీ బొక్కిసం బాలయ్య (55), ఆయనతో ప్రయాణిస్తున్న శ్రీ పుల్లూరు శంకర్ రెడ్డి (63) తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఎర్టిగా కారును తెలంగాణ రాష్ట్రం, సికింద్రాబాద్‌కు చెందిన శ్రీ గంజి రవీంద్ర నడుపుతుండగా, కారులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు.

వైద్య చికిత్స:

ప్రమాదంలో గాయపడిన వారిని తొలుత శ్రీకాళహస్తి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం తిరుపతిలోని సంకల్ప హాస్పిటల్ ఐసీయూకు తరలించారు. ప్రస్తుతం నిపుణులైన వైద్యుల బృందం నిరంతర పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

వైద్య బృందం:

డా. సుదర్శన్ అగర్వాల్ -- న్యూరో సర్జన్

డా. జాఫర్ ఖాన్ -- ఆర్థోపెడిక్ నిపుణులు

డా. మురళీకృష్ణ -- ప్లాస్టిక్ సర్జన్

డా. మొగిలేశ్వరి -- న్యూరో స్పెషలిస్ట్

వైద్యుల వివరాల ప్రకారం, ప్రస్తుతానికి శస్త్రచికిత్స అవసరం లేదు. రాబోయే రెండు రోజుల పాటు ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పరిశీలించి, అవసరమైతే తదుపరి వైద్య నిర్ణయం తీసుకోనున్నారు.

బాధితుల ఆరోగ్య పరిస్థితి:

ప్రధాన వైద్యులతో జరిగిన చర్చ ప్రకారం, ఇద్దరి ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోంది. పూర్తిస్థాయిలో స్థిరపడేందుకు మరో 3--5 రోజులు పట్టే అవకాశం ఉందని, అనంతరం ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు తరలించే





అవకాశముందని వైద్యులు తెలిపారు.

సమన్వయం -- పూర్తి వైద్య ఖర్చులకు హామీ:

ప్రమాద సమాచారం అందిన వెంటనే నేను, ముచ్చివోలు గ్రామ పెద్దలు, ఇరు వర్గాల ప్రతినిధులు మరియు ఏర్పేడు పోలీసు అధికారులతో సమన్వయం చేసి పరస్పర అవగాహనకు తీసుకువచ్చాము. ఈ సందర్భంగా ఎర్టిగా కారు డ్రైవర్ గంజి రవీంద్ర, బాధితులు పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన అన్ని వైద్య ఖర్చులను భరిస్తానని బాధ్యతాయుతంగా అంగీకరించారు. ఈ విషయంలో ఇరు కుటుంబాల మధ్య సానుకూల అవగాహన నెలకొనడంతో సమస్య సామరస్యపూర్వకంగా పరిష్కార దిశగా సాగుతోంది. చివరగా: మానవ ప్రాణం అమూల్యమైనది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరూ త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని ఆరోగ్యంగా తిరిగి కుటుంబ సభ్యుల మధ్యకు చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము .ఈ సందర్భంగా బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్న వైద్య బృందానికి, తక్షణ స్పందనతో సహకరించిన ఏర్పేడు పోలీసు శాఖకు, ముచ్చివోలు గ్రామ పెద్దలకు, అలాగే పరస్పర సహకారంతో ముందుకు వచ్చిన ఇరు కుటుంబాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

# అవినీతి అక్రమాలకు పాల్పడిన టీపీఓను వెంటనే సస్పెండ్ చేయాలి

**-మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా, ర్యాలీ**






ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు, మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి 'అవినీతి తిమింగలం' కె.ప్రకాష్ బాబును వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గూడూరు పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు సీవీఆర్. కుమార్ మాట్లాడుతూ గూడూరు మునిసిపాలిటీలో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)లో లేఅవుట్ రెగ్యులరైజేషన్లో స్థానిక యుయల్బి, పరిశీలనాధికారి, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ కె. ప్రకాష్ బాబు లేఅవుట్ యజమాని నువ్వూరు పద్మ ప్రసన్న రెడ్డికి ఎటువంటి హక్కు (టైటిల్ డీడ్) లేనప్పటికి విందూరు రోడ్డు నుండి చిట్టేటి అమరావతి, భర్త లేట్ లక్ష్మీ నారాయణ వ్యవసాయ భూమి మధ్యలో నుండి ఉత్తరం వైపు ఉన్న ప్లాట్ నెం.ఏ 15పీ మధ్యలో ఉన్న 30 అడుగుల లేఅవుట్ రోడ్డును కలుపుతూ 20 అడుగుల రోడ్డు ఉన్నట్లు లేఅవుట్ ప్లాన్లో మోసపూరితంగా పొందుపరచి లేఅవుట్ అప్రూవల్ నుడాకు సిఫార్సు చేశారన్నారు. లేఅవుట్ అనుమతి కోసం సమర్పించిన ప్లాన్ లో ఉన్న ప్లాట్ నెం. ఏ15పి, ప్లాట్ నెం. ఏ16 రెండు ప్లాట్లలో కొంత భాగం చిట్టేటి అమరావతి వ్యవసాయ భూమి ఆక్రమించి ప్లాన్ రూపొందించారన్నారు. లేఅవుట్ అప్రూవల్ కు ముందు లేఅవుట్ యజమాని నువ్వూరు పద్మ ప్రసన్న రెడ్డి రూపొందించిన ప్లాన్లో పూర్తి యాజమాన్య హక్కులు లేవని తెలిసి కూడా వాటిని దాచిపెట్టి లేఅవుట్ యజమానితో మోసపూరితంగా లేఅవుట్ అప్రూవల్ కు సహకరించి అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ప్రైమా ఫేసీ ఉన్నందున పూర్తి స్థాయిలో విచారణ జరిపి, లేఅవుట్ ను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్నట్లు మోసపూరితంగా నుడా అప్రూవల్ కు సిఫార్సు చేసిన గూడూరు మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ కె. ప్రకాష్ బాబు పై చర్యలు తీసుకొని నిబంధనలకు వ్యతిరేకంగ అనుమతించిన ఐపీఎల్పీ 2020/ డీటీసీపీ/నుడా/జీడీఆర్/000015 లేఅవుట్ అనుమతిని రద్దు చేయవలసినదిగా డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జీ. శశికుమార్, పట్టణ కన్వీనర్ వై. సునీల్ మాట్లాడుతూ గూడూరులో ఏళ్ల తరబడి తిష్టవేసి ప్రతి చిన్న పనికి టీపీఓ ప్రకాష్ లంచం తీసుకుంటూ పేద ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదోళ్లకు ఒక న్యాయం పెద్దోళ్లకు మరొక న్యాయం గూడూరు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో చోటుచేసుకుంటోందన్నారు. జిల్లా కలెక్టర్, పాలకులు స్పందించి టీపీఓ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్షలకు పూనుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు సీపీఐ నాయకులు గూడూరు కటకరాజా వీధిలో ఉన్న సీపీఐ కార్యాలయం నుండి టవర్ క్లాక్ సెంటర్, రాజా వీధి, బజారు వీధుల మీదుగా ర్యాలీగా కరపత్రాలు పంచుకుంటూ మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం ఎదుట అవినీతి తిమింగళం ప్రకాష్ బాబును సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి షేక్ జమాలుల్లా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కే. నారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు (సీవీఎల్), ప్రజా నాట్యమండలి పట్టణ కార్యదర్శి తలారి మస్తానయ్య, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి సయ్యద్ రిజ్వాన్, వెంకటేష్, హేమంత్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సురక్షిత చిత్తూరు -- మీ భద్రత మా బాధ్యత" కార్యక్రమం

**దాబాలు, హోటళ్ల యజమానులకు అవగాహన కల్పించిన పలమనేర్ సబ్‌డివిజన్ డిఎస్పీ దేగల ప్రభాకర్**





ప్రజాభూమి ప్రతినిధి పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం.

జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐ పి ఎస్ ఆదేశాల మేరకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పలమనేర్ సబ్‌డివిజన్ పరిధిలోని దాబాలు, హోటళ్ల యజమానులు, నిర్వాహకులతో నేడు పలమనేరు సబ్‌డివిజన్ డి.ఎస్పీ కార్యాలయము నందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలమనేర్ సబ్‌డివిజన్ డి.ఎస్పీ దేగల ప్రభాకర్ మాట్లాడుతూ, సబ్‌డివిజన్ పరిధిలోని దాబాలు, హోటళ్లలో ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమంగా మద్యం విక్రయించడం, మద్యం సేవించేందుకు అనుమతించడం లేదా ప్రజల ప్రశాంత జీవనానికి, శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి దాబా, హోటల్ యజమాని ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల సమయంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఆస్కారం కల్పించినా లేదా నిబంధనలు ఉల్లంఘించినా సంబంధిత వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశానికి సుమారు 35 మంది దాబా, హోటల్ యజమానులు మరియు నిర్వాహకులు హాజరై చట్ట నిబంధనలను పాటిస్తూ పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని ప్రమాణం చేశారు. అలాగే శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని ఎస్.డి.పి.ఓ. కోరారు. ఈ సమావేశంలో గంగవరం ఇన్‌స్పెక్టర్ ఎం. రాంభూపాల్, బంగారుపాళ్యం ఇన్‌స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు, పలమనేరు ఎస్.ఐ. లోకేష్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా డాబాలపై ఆకస్మిక దాడులు నిర్వహించిన చిత్తూరు పోలీసులు



ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపిఎస్ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని డాబాలపై జిల్లా పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాబాల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, లైటింగ్ సదుపాయాలు, పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను అధికారులు



పరిశీలించారు. అలాగే డాబాల్లో ఎటువంటి అక్రమ కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ చిన్నపేద య్య వారి సిబ్బందితో కలిసి స్టేషన్ పరిధిలోని వారాహి డాబా మరియు పప్పు డాబాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా డాబా యజమానులు, నిర్వాహకులకు సీసీటీవీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసి పనిచేసే స్థితిలో ఉంచాలని, అక్కడ పనిచేసే సిబ్బంది పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయాలని, మద్యం సేవించడం, మత్తు పదార్థాల వినియోగం, జూదం వంటి అక్రమ కార్యకలాపాలకు అవకాశం ఇవ్వవద్దని, అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా డాబాల్లో అక్రమ కార్యకలాపాలను అరికట్టడంతో పాటు, ప్రజల భద్రతను మెరుగుపరచడం, శాంతిభద్రతలను పరిరక్షించడం లక్ష్యమని పోలీసులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన డాబా యజమానులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్

**- వర్క్‌షాప్ డివిజన్ నూతన కార్యవర్గానికి ఘన సత్కారం**



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

సౌత్ కోస్ట్ రైల్వే కొత్త జోన్ ఏర్పడిన నేపథ్యంలో, జనరల్ సెక్రటరీ కామ్రేడ్ సి.హెచ్ శంకర్రావు, జోనల్ ప్రెసిడెంట్ జి.ఎన్.ఎస్. శ్రీనివాసరావు నాయకత్వంలో సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ వర్క్‌షావ్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వర్క్‌షావ్ డివిజనల్ ప్రెసిడెంట్‌గా కామ్రేడ్ కాళహస్తి బాబు, డివిజనల్ సెక్రటరీగా కామ్రేడ్ ఎం.జి.ఎం. నాగేశ్వరరావు నూతనంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా, క్యారేజ్ రిపేర్ షాప్ తిరుపతి బ్రాంచ్ నుండి అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీలుగా కే. సదాశివరెడ్డి, కె. ముని రాదయ్య, పి. ముని కుమార్, అలాగే జోనల్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా హెన్రీ పాల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సి.ఆర్.ఎస్. తిరుపతి బ్రాంచ్‌లో చైర్మన్ కే. సదాశివరెడ్డి అధ్యక్షతన, ట్రెజరర్ పి. ముని కుమార్, కార్యవర్గ సభ్యులు చంద్ర నాయక్, గాండీవం, దిలీప్ కుమార్, సీసీఎస్ డెలిగేట్స్ నరేంద్ర కుమార్, అరుణ్, క్యాంటీన్ డైరెక్టర్ ఏ.బాబు, బీఈసీ సభ్యులు, యూత్ సభ్యులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, వీర మహిళ నాయకురాళ్లు, యాక్టివ్ యంగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన నాయకులకు ఘన సత్కారం నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన వర్క్‌షాప్ డివిజనల్ ప్రెసిడెంట్, బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ కాళహస్తి బాబు, తమపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన జనరల్ సెక్రటరీ కామ్రేడ్ సి.హెచ్ శంకర్రావు గారికి, జోనల్ ప్రెసిడెంట్ జి.ఎన్.ఎస్. శ్రీనివాసరావు గారికి కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే కార్మికుల హక్కుల సాధన, సంక్షేమం మరియు అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామని, మజ్దూర్ యూనియన్ జెండాను ఎల్లప్పుడూ కార్మికులకు అండగా నిలబెడతామని, తాము నాయకులుగా కాకుండా 24ఐ7 కార్మిక సేవకులుగా పనిచేస్తామని, "పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప" పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఓబీసీ అసోసియేషన్ సెక్రటరీ వెంకటరమణ, చైర్మన్ మునెయ్య , ట్రెజరర్ సుధీర్, వారి కార్యవర్గ సభ్యులు, అలాగే ఎస్సీ/ఎస్టీ అసోసియేషన్ నాయకులు ట్రెజరర్ విజయ్, అసిస్టెంట్ డివిజన్ సెక్రెటరీ రమేష్ బాబు మరియు కార్యవర్గ సభ్యులు, భారీ ఎత్తున కార్మికులు హాజరై నూతనంగా ఎన్నికైన నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# అయ్యవారిపాలెంలో పొలం పిలుస్తోంది



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు, గూడూరు మండలం లోని అయ్యవారిపాలెం గ్రామము లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారిణి పి.సత్యవాణి హాజరై పంట వేసిన ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం ద్వారా భీమా చేసుకోవాలని తెలియజేశారు. వరి మరియు నిమ్మ రైతులకు భీమా సదుపాయం కలదని ఈ ఎల్ నినో ప్రభావం వలన రానున్న మూడు నాలుగు నెలలలో వర్షాభావ పరిస్థితులు వచ్చే అవకాశం ఉన్నది.ఈ వర్షాభావ పరిస్థితులను అధికమించడానికి వరి మరియు నిమ్మ రైతులు తమ పంటకు భీమా చేయించుకోవలసినది గా సూచించారు. వరి రైతులుకు భీమా ప్రీమియం గా ఎకరిని రూ.840 చెల్లించాలని, ఏదైనా ప్రకృతి వై వలన లేదా వాతావరణ పరిస్థుతుల వలన పంట నష్ట పోయినా లేదా దిగుబడి తగ్గినా ఎకరానికి రూ. 42000/- నష్ట పరిహారం , నిమ్మ రైతుకు భీమా ప్రీమియం రూ. 2400/- గా చెల్లిస్తే ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు వలన నష్టం జరిగినపుడు నష్ట పరిహారంగా నిమ్మకు రూ. 48000/- అందుతుందని తెలియజేశారు.నిమ్మకు జులై 31 వరకు, వరికి ఆగష్టు 15 వ తేదీ వరకు భీమా అవకాశముందని రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పంట రుణం పొందిన రైతులు భీమాకు అర్హులు .రుణాలు తీసుకోని అన్నదాతలు సమీకృత అధీకృత కేంద్రాల వద్ద నమోదు చేసుకోవచ్చు. ఆధార్ కార్డు, భూ యాజమాన్య పత్రాలు , కౌలు రైతుకు లీజు పత్రం,బ్యాంకు పాస్ బుక్ , మొబైల్ నంబర్ ను అధీకృత కేంద్రాలైన బ్యాంకు , సాధారణ సేవా కేంద్రాలు , మరియు తపాల కార్యాలయాల ద్వారా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు గూడూరు బి. గోపీనాయక్ , మండల వ్యవసాయ అధికారి వి. రమేష్ , ఉద్యాన అధికారి యన్.సునీత మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు..

# రేణిగుంటలో కొత్తగా పెట్టిన మద్యం షాపులు తొలగించాలి! - ఐద్వా డిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట అర్బన్ సి.ఐ జయచంద్ర కు ఐద్వా ఫిర్యాదు. రేణిగుంట పట్టణంలో మద్యం దుకాణాలు ప్రజలకుబి మహిళల భద్రతకుబి భక్తుల మనోభావాలకు విరుద్ధంగా వెలిశాయి. తిరుపతి జిల్లా రేణిగుంట పట్టణంలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన రెండు మద్యం దుకాణాలను తక్షణమే తొలగించాలని ఫిర్యాదు చేస్తూ.. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ( ఏ ఐ డి డబ్ల్యుఏ) రేణిగుంట మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నాడు రేణిగుంట సి.ఐ జయచంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, మండల అధ్యక్షురాలు భారతి మాట్లాడుతూ, రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో "సర్వేశ్ వైన్" షాప్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం సర్కిల్ సమీపంలో "ఆద్య వైన్స్" పేరుతో కొత్తగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ దుకాణాలు జనావాస ప్రాంతాలలో, పాఠశాలలు, దేవాలయాలు, రేణిగుంట రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉండడం వల్ల మహిళలు, విద్యార్థులు, చిన్నారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇదే ప్రాంతంలో ఉన్న మద్యం దుకాణాలను ప్రజల అభ్యంతరాల మేరకు తొలగించారని గుర్తు చేశారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులు రేణిగుంట రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ద్వారా ప్రయాణించే నేపథ్యంలో ఈ ప్రాంతంలో మద్యం దుకాణాలు కొనసాగించడం ప్రజా ప్రయోజనాలకు, మహిళల భద్రతకు, భక్తిశ్రద్ధలతో వచ్చే భక్తుల మనోభావాలకు ఇది విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తూ, మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకొని పై రెండు మద్యం దుకాణాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ విషయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే, ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసు అధికారులు వెంటనే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఐద్వా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, ఐద్వా మండల అధ్యక్షురాలు భారతి, సులోచన, పద్మ, సుజాత, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరమణ పాల్గొని సీఐ జయచంద్రకు వినతిపత్రం అందజేశారు.


# తొండమనాడు కోటగట్టు భూమిని కాపాడండి - సిపిఐ

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తి మండలం తొండమనాడు దిగు వీధి గ్రామ లెక్క దాఖలు సర్వే నంబర్ 162/2 లో పురాతన చరిత్ర కలిగిన తొండమాను చక్రవర్తి నిర్మించిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు జరుపుతూ నిత్యం పూజలు జరుపుతూ దినదినాభివృద్ధి చెందుతున్నది. కోటగట్లు, అగర్తలగ రెడ్డి గుంటను కాపాడాలని కోరారు. కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకొని లేఅవుట్ వేసి క్రయ విక్రయాలు చేసేందుకు పూను కుంటున్నారు. దేనికి రెవెన్యూ అధికారులు అండదండలు తొండమనాడు గ్రామ మాజీ సర్పంచ్ వీరందరూ కలిసి కోట్ల రూపాయలు విలువైనటువంటి భూమిని రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి కోట్లు సంపాదన కొరకు కబ్జాలు చేస్తున్నారు. దిగువ వీధి గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబర్ 166/1 లో పుంజు 1.17 సెంట్లు భూమి పేరడంగల్ మేరకు సర్వే నంబర్166/1బి గా మార్చి 3.17 సెంట్లు భూమిపై పాస్ పుస్తకం పొంది ఉన్నారు. ఇవే కాకుండా మూడు సర్వే నంబర్లు మార్చి 22 ఏగా నమోదు కాపాడిన భూమిలో వెంచర్ నిర్మాణం చేపడుతున్నారు. అన్యాక్రాంతం అవుతున్న భూమిని కాపాడాలని, రెవెన్యూ రికార్డును తారుమారు చేసిన మాజీ సర్పంచ్ పై ల్యాండ్ గాబ్లింగ్ కేసును నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చారులత రూరల్ మండల కార్యదర్శి మించల శివకుమార్, రామ్మూర్తి, సత్య, గుర్రప్ప, కృష్ణయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఫోటో ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న సిపిఐ నాయకులు

# గురు పౌర్ణమి సందర్భంగా శిరిడి సాయినాధుని దర్శించుకున్న: డి.ఎస్.పి నరసింహమూర్తి



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

ఈరోజు గురుపౌర్ణమి సందర్భంగా శ్రీకాళహస్తిలోని చెన్నై రోడ్ లో వెలసి ఉండు షిరిడి సాయినాధుని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి దర్శించుకున్నారు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు కూడా అందజేయడం జరిగింది అటు తర్వాత గుడి మొత్తం ప్రదక్షిణలు చేసి, పరిశీలన చేయడం జరిగింది చుట్టుపక్కల దొంగతనం ఎక్కువ జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరు ఇంటిముందు , షాపులు ముందు కెమెరాలు పెట్టుకోవాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మందిర కమిటీ సెక్రటరీ జగదీష్ , లీగల్ అడ్వైజర్ గుమ్మల్ల రాజేశ్వరరావు దర్గా ఉరుసు కమిటీ చైర్మన్ ఓరుగంటి నాగేశ్వరరావు బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ సీసీ కేడెట్లకు ధ్రువపత్రాలు ప్రదానం..!



ప్రజా భూమిప్రతినిధి, పాకాల:
తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలంలో ఎన్ సీసీ బి.సి సర్టిఫికేట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన కేడెట్లకు ధ్రువపత్రాలు బుధవారం ప్రదానం చేశారు.స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మొదటి బ్యాచ్ కేడెట్లకు 29 ఆంధ్రా బెటాలియన్,తిరుపతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ధ్రువపత్రాలు అందజేశారు.జ సర్టిఫికేట్ పరీక్షల్లో 31 మంది హాజరు కాగా 26 మంది,దీ సర్టిఫికేట్ పరీక్షల్లో 4 హాజరు కాగా 3 ఉత్తీర్ణత సాధించారు.ఈ ధ్రువపత్రాలు విద్యార్థులకు వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు,ఉద్యోగాలకు తోడ్పడుతాయి.ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ విక్రమ్ ప్రసన్న,ఎఒ లెఫ్టినెంట్ కల్నల్ దివ్యా సింగ్,సుబేదార్ మేజర్ తేజేశ్వరరావు,పి.బి. రెడ్డిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సుజాత,వైస్ ప్రిన్సిపల్ రమేష్ కుమార్,ఎన్ సీసీ అధికారి లెఫ్టినెంట్ ఈశ్వర బాబు'లు అభినందించారు.

## దామలచెరువు పంచాయతీలో ఇద్దరు బాలురులు అదృశ్యం..!



ప్రజాభూమి ప్రతినిధి, పాకాల:
తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం దామలచెరువు పంచాయతీలో ఇద్దరు బాలురులు సోమవారం అదృశ్యం అయ్యారు,ఆచూకీ తెలిసిన వారికి సమాచారం అందించ గలరని పాకాల పోలీసులు తెలిపారు. తల్లి సునీత పెద్ద కుమారుడు సి.సంతోష్(15 )సంవత్సరాలు,దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు.చిన్న కుమారుడు సి.హర్ష, వయస్సు (13)సంవత్సరాలు,దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. తల్లి సునీత పాకాల పోలీస్ స్టేషన్ లో బుధవారం ఫిర్యాదు చేశారు.పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గురుపౌర్ణమి సందర్భంగా చంద్రగిరి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన పులివర్తి వినీల్..!



ప్రజా భూమిప్రతినిధి, చంద్రగిరి:
గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని చంద్రగిరి పట్టణంలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయాన్ని పులివర్తి వినీల్ దర్శించుకున్నారు. సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ అర్చకులు పులివర్తి వినీల్‌కు తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

## రేణిగుంట మండలం ఆర్, అగ్రహారంలో మీ ఇంటికి సుధీర్ అన్న కార్యక్రమం



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు బూత్ నెం. 144 పరిధిలోని ఆర్. అగ్రహారం గ్రామంలో "మీ ఇంటికి మీ సుధీర్ అన్న" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాపురం భాస్కర్ రెడ్డి (సింగిల్ విండో చైర్మన్) ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి, ప్రభుత్వ రెండేళ్ల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే 2029 ఎన్నికల్లో సుధీర్,ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కే. గజేందర్ రెడ్డి (ఎక్స్ ఎంపీటీసీ), డి. జనార్దన్ రెడ్డి, రామ్ రాజ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. .

## టిడిపి కూటమితోనే సంక్షేమ పాలన సాధ్యం

**- ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జి బిటెక్ రవి**

**- వలు కుటుంబాలు టిడిపిలో చేరాయి**



ప్రజాభూమి, వేంపల్లె
టిడిపి కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమ పాలన సాధ్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బిటెక్ రవి) అన్నారు. బుధవారం స్థానిక శ్రీరామనగర్, కాలేజీ రోడ్డు ప్రాంతాల్లో నిర్వహించిన ప్రజల వద్దకు ప్రభుత్వం--ప్రతి ఇంటికి సంక్షేమం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిటెక్ రవి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని బిటెక్ రవి పేర్కొన్నారు. అనంతరం స్థానిక శ్రీరామనగర్ ప్రాంతానికి చెందిన పలు కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఆ పార్టీ యువ నాయకుడు డక్కా రమేష్ ఆధ్వర్యంలో వారికి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి బిటెక్ రవి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకుడు సామకోటి ఆదినారాయణ, మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రామముని రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ జగన్నాథ్ రెడ్డి, టిడిపి మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, టౌన్ క్లస్టర్ ఇంచార్జి మహమ్మద్, దేవస్థానం చైర్మన్లు వెంకటస్వామి, పీవీ రమణ, నాయకులు ఎద్దుల శేషారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సింగారెడ్డి శివకృష్ణా రెడ్డి, తెలంగాణ వలి, గంగాధర్ రెడ్డి, మడక శ్రీనివాసులు, బాలకృష్ణ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వెంకట శివ, రాజానాయక్, పీరాసాహెబ్, జబిబుల్ల తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి బస్టాండ్ సముదాయంలోని దుకాణాలలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
బుధవారం ఉదయం ఉదయం 11.00 గంటలకు తిరుపతి నగరంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రవాణా సంస్థ బస్ స్టాండ్ ప్రాంగణంలో ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో బస్ స్టాండ్‌లోని తినుబండారాలు విక్రయించే దుకాణాలలో తయారీదారు వివరాలు, తయారీ తేదీ, గడువు తేదీ వంటి ఎటువంటి లేబుల్ వివరాలు లేకుండా విక్రయిస్తున్న వివిధ రకాల చిప్స్ మరియు ఇతర ప్యాకేజ్డ్ తినుబండారాలను గుర్తించారు. ఈ విషయాన్ని వెంటనే ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, సంబంధిత దుకాణాల యజమానులపై మొత్తం మూడు కేసులు నమోదు చేయడం జరిగింది. అనంతరం సదరు కేసులను తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ గారు విచారించి, చట్ట ప్రకారం తగిన జరిమానాలు





విధిస్తారు. అదేవిధంగా, ఏపీఎస్ఆర్టీసీ ప్రాంగణంలోని అన్ని వ్యాపారులు ఇకపై తయారీదారు వివరాలు, తయారీ తేదీ, గడువు తేదీ మరియు ఇతర తప్పనిసరి లేబుల్ వివరాలు లేని ఆహార ప్యాకెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదని ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులు కఠినంగా హెచ్చరించారు. ప్రజలు కూడా కొనుగోలు చేసే ప్రతి ప్యాకెట్ ఆహార ఉత్పత్తిపై లేబుల్ వివరాలను తప్పనిసరిగా పరిశీలించి, నాణ్యమైన మరియు సురక్షితమైన ఆహార పదార్థాలను మాత్రమే కొనుగోలు చేయాలని ఫుడ్ సేఫ్టీ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. ఇకపై తయారీదారు వివరాలు, తయారీ తేదీ, గడువు తేదీ మరియు ఇతర తప్పనిసరి లేబుల్ వివరాలు లేని ఆహార ప్యాకెట్లు ఏవైనా విక్రయానికి ఉంచినట్లు గుర్తించినట్లయితే, సంబంధిత ఆహార పదార్థాల మొత్తం నిల్వను ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం స్వాధీనం చేసుకొని ధ్వంసం చేయడంతో పాటు, సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించడం జరిగింది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు తమ ప్రాంగణంలోని అన్ని ఆహార విక్రయశాలలను ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించవలసినదిగా కోరడ మైనది.ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు ఫుడ్ సేఫ్టీ శాఖచే నిరంతరం నిర్వహించబడతాయని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ తనిఖీలలో ఫుడ్ సేఫ్టీ శాఖ తరఫున అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జి. వెంకటేశ్వర్ రావు , ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఆర్. జగదీష్ , ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కె. నర్మద పాల్గొన్నారు. ఏపీఎస్ఆర్టీసీ తరఫున అసిస్టెంట్ మేనేజర్ శ్రీమతి సంధ్య , జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు రాజా రెడ్డి కూడా పాల్గొన్నారు.

## 24 గంటల్లో చోరీ కేసు ఛేదించిన బంగారుపాళ్యం పోలీసులు

### రూ.1.50 లక్షల విలువైన బంగారు దండ స్వాధీనం:-

ప్రజాభూమి ప్రతినిధి పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం.
బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించి, ముద్దాయిని అరెస్ట్ చేసి చోరీ సొత్తును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఐపీస్ ఆదేశాల మేరకు, పలమనేరు డి ఎస్ పి దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో, బంగారుపాళ్యం సీఐ కత్తి శ్రీనివాసులు పర్యవేక్షణలో, ఎస్ ఐ టి. ప్రసాద్, సిబ్బంది, బంగారుపాళ్యం-- ఎం.బి.టి. రోడ్డు, రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపంలోని ముంగరమడుగు క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ముంగరమడుగు వైపు నుంచి నడిచి వస్తున్న ఒక వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు



ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు అతడిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అతడు ఎన్. పురుషోత్తం (19), తండ్రి దివంగత త్యాగరాజులు, స్వగ్రామం చంద్రశేఖరపురం, రాగిమానుపెంట పోస్టు, బంగారుపాళ్యం మండలం, ప్రస్తుతం లిముంగరమడుగులిలో నివాసం ఉంటున్నట్లు తేలింది. ముద్దాయి స్వచ్ఛందంగా ఒప్పుకోగా , ఈ నెల 27వ తేదీ రాత్రి బంగారుపాళ్యం పట్టణంలోని బాలాజీ సినిమా థియేటర్ సమీపంలోని టిఫిన్ సెంటర్ పైకప్పు సిమెంట్ షీట్లను పగులగొట్టి లోపలికి ప్రవేశించి, బీరువా పగులగొట్టి అందులోని బంగారు నల్లపూసల దండను చోరీ చేసినట్లు అంగీకరించాడు. అతని వద్ద దాచి ఉంచిన చోరీ సొత్తును పోలీసులకు అప్పగించగా, పంచాయతీదా రుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు.
స్వాధీనం చేసుకున్న సొత్తు
సుమారు 16 గ్రాముల బంగారు నల్లపూసల దండ -- విలువ సుమారు రూ. 1,50,000/- ముద్దాయిని అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, చోరీలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా లిఅత్యవసర సేవ 112లికు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మెల్యే పులివర్తి నాని పై తప్పుడు ఆరోపణ చేయడం తగదు

**- మృతుడు సంజీవ సుబ్రహ్మణ్యం టిడిపి కార్యకర్తే, టిడిపి నేతలు**

ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం
చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పై వైసీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తప్పుడు ఆరోపణ చేయడం తగదని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయల చెరువు పేటలో కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడిన సంజీవి సుబ్రహ్మణ్యం తెలుగుదేశం కార్యకర్తేనని పేర్కొన్నారు. మృతుడు సుబ్రహ్మణ్యం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు హరికి దగ్గర బంధువులు అన్నారు. ఇంటి దగ్గర సంజీవ హరి భార్య సంజీవ సునీతకు సంజీవ సుబ్రహ్మణ్యం మధ్య జరిగిన చిన్న వివాదానికి సునీత పోలీసులకు ఫిర్యాదు చేయడం పోలీసులు సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను పిలిచి మందలించడం గ్రామ పెద్దల సమక్షంలో రాజీ చేయడం జరిగిందన్నారు. దీనిపై మోహిత్ రెడ్డి సోషల్ మీడియా వేదిక ఎమ్మెల్యే అనుచరులు చేసిన అరాచకంకు సుబ్రహ్మణ్యం ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపణ చేయడాని ఆయన ఖండించారు. మోహిత్ రెడ్డి పూర్తిగా సమాచారం



తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అన్నారు. శవ రాజకీయాలు, కుట్ర రాజకీయాలు మానుకోవాలని చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి హితువు పలికారు. టిడిపి సీనియర్ నాయకులు మాదాసు మాధవయ్య మాట్లాడుతూ కూటమిలో చిచ్చు పెట్టడానికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఎమ్మెల్యే నాని పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మా టిడిపి కార్యకర్త అయిన సంజీవ సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పార్టీ అధిష్టానం, ఎమ్మెల్యే ఎప్పుడు పడుతున్నాని అన్ని విధాల ఆదుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గురవయ్య గిరిధర్ యాదవ్, రవి మృతుని బంధువులు పాల్గొన్నారు.

## గుత్తి కోటను జాతీయ స్థాయి వారసత్వ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ అంబికా విజ్ఞప్తి

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం
అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి అనంతపురం జిల్లాలోని చారిత్రాత్మక గుత్తి కోటను దేశంలోనే ప్రముఖ వారసత్వ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కీలక చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఢిల్లీలో గల భారత పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యదుబీర్ సింగ్ రావత్ కి, అలాగే జాతీయ స్మారక చిహ్నాల ప్రాధికార సంస్థ డైరెక్టర్ కల్నల్ సవ్యసాచి మర్వాహని బుధవారం ఢిల్లీ కార్యాలయం లో కలిసి , గుత్తి కోట సమగ్ర పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు, అభ్యంతర రహిత ధృవీకరణ మంజూరు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, జిల్లా పర్యాటక మండలి సంయుక్తంగా రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా గుత్తి కోటలో పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, కోట చారిత్రక వైభవాన్ని పరిరక్షించే విధంగా అభివృద్ధి చేపట్టనున్నట్లు ఎంపీ వివరించారు. ప్రాజెక్టులో భాగంగా జాతీయ రహదారి నుంచి గుత్తి కోట వరకు రహదారి అభివృద్ధి, ప్రధాన ప్రవేశ ద్వారం నిర్మాణం, లేజర్షో, గోకర్ట్, హార్స్ రైడింగ్, పార్కింగ్ సౌకర్యాలు, పాదచారుల మార్గాలు, రాతి మెట్లు, భద్రతా హ్యాండ్‌రైల్స్, సావనీర్ షాప్‌లు, మరుగు



దొడ్లు, రెస్టారెంట్లు, చిన్నారుల వినోద ప్రాంతం వంటి పర్యాటక సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమం ద్వారా గుత్తి కోటకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించడంతో పాటు, వారసత్వ పరిరక్షణకు మరింత బలం చేకూరుతుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, అనంతపురం జిల్లాలో పర్యాటక రంగానికి కొత్త ఊపు వస్తుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి, ఈ ప్రతిష్టాత్మక వారసత్వ పరిరక్షణ, పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టును త్వరితగతిన ప్రారంభించేందుకు సహకరించాలని సంబంధిత కేంద్ర సంస్థలను ఎంపీ కోరారు.

## మట్కా - అక్రమ మద్యం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు
తొట్టంబేడు పోలీస్ స్టేషన్ జతీ.చీశీ.43/2026 ఖ/o 34(ఖ) ూూ జుఇఎంవ ూచి ఎ ావవఓ. 9(1) ూూ గేమింగ్ యాక్ట్ (మట్కా ) కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను నిన్నటి రోజు సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు సడీపీవో శ్రీకాళహస్తి బిన్ కంద్రిగ సీఐ పర్యవేక్షణలో తొట్టంబేడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ బాలకృష్ణ మరియు సిబ్బంది శ్రీకాళహస్తి పట్టణంలో గుర్తించి అరెస్టు చేశారు.



అరెస్టు చేయబడిన నిందితులు:
1. షేక్ ఖాదర్ షరీఫ్ ఏ లడ్డు 2. ఎస్.కె. మీర్జా
విచారణలో నిందితులు మట్కా నిర్వహణలో బుకీలుగా వ్యవహరిస్తూ, మట్కా ద్వారా వచ్చిన డబ్బులను ప్రధాన నిర్వాహకులకు అందజేసినట్లు, అలాగే అక్రమంగా మద్యం రవాణా లో ఈ కేసులో ప్రధాన నిందితులు అమాన్ ఏ అమానుల్లా మరియు పద్మనాభంతో కలిసి అక్రమ కార్యకలాపాలు నిర్వహించినట్లు వెల్లడించారు.నిందితులపై గతంలో కూడా శ్రీకాళహస్తి వన్‌టౌన్ మరియు టూ టౌన్ పోలీస్ స్టేషన్లలో మట్కా, అక్రమ మద్యం విక్రయాలు మరియు ఇతర కేసులు నమోదైనట్లు విచారణలో తేలింది. పెద్దమనుషుల సమక్షంలో చట్టపరమైన ప్రక్రియలను పూర్తిచేసి, నిందితులను అరెస్టు చేసి గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా , జడ్జి గారు ఇద్దరికీ 14 రోజుల రిమాండ్ విధించారు.
ప్రజలకు విజ్ఞప్తి: మట్కా జూదం, అక్రమ మద్యం విక్రయాలు మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అటువంటి సమాచారం తెలిసిన వెంటనే 9440900724/9440796763 నంబర్లకు ఫోన్ చేసి పోలీస్ వారికి తెలియజేయాలని తొట్టంబేడు పోలీస్ వారు విజ్ఞప్తి చేస్తున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు నిరంతరం కొనసాగుతాయి.

## ఈవీఎం గోడౌన్ లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



ప్రజా భూమి ప్రతినిధి-రేణిగుంట:
సాధారణ తనిఖీలలో భాగంగా బుధవారం రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఈవీఎం గోడౌన్ లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా.ఎస్.వెంకటేశ్వర్. జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరచిన గోదాం వద్ద నిరంతరం నిఘా,పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గోదాములో సీసీ కెమెరాలు సీలింగ్ తదితరాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు అనంతరం ఈవీఎం గోడౌన్ వద్ద రిజిస్టర్ నందు సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంటలో గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



ప్రజా భూమి ప్రతినిధిరేణిగుంట:
రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను, హాస్టల్ ను జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి గదులను, పాఠశాల ఆవరణలో రక్షిత తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. హాస్టల్ లో లైట్లు,ఫ్యానులకు అవసరమైన మరమ్మతులు చేయించాలని సూచించారు. మధ్యాహ్న భోజన వంటగదిని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన శుభ్రమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందించే యూనిఫాం లు,షూలు సక్రమంగా అందుతున్నాయా మరియు మధ్యాహ్న భోజన నాణ్యత వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి,పాఠశాల ప్రిన్సిపల్ రవికాంత్,వైస్ ప్రిన్సిపాల్ బాలాజీ పాల్గొన్నారు.

# గదుల్లోనే వ్యాపారం నిర్వహించాలి -బయట పెడితే కఠిన చర్యలు

### - కూరగాయల మార్కెట్ ఆకస్మిక తనిఖీలో కమిషనర్ మల్లికార్జున

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, దుకాణాల గదుల్లోనే వ్యాపారం నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్పష్టం చేశారు. మార్కెట్ ప్రాంగణంలో బయటకు కూరగాయలు పెట్టి విక్రయాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటూ ఇకపై నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వ్యాపార అనుమతులను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. బుధవారం కమిషనర్ మల్లికార్జున కూరగాయల మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్‌లోని పలు దుకాణాల ఎదుట రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యాపారులు తమకు కేటాయించిన గదుల్లోనే సరుకులను ఉంచి విక్రయాలు నిర్వహించాలని, మార్కెట్ ప్రాంగణాన్ని ఆక్రమించి వ్యాపారం చేయడం వల్ల కొనుగోలుదారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సూచించారు. మున్సిపాలిటీ ప్రజల సౌకర్యార్థం కోట్ల రూపాయల వ్యయంతో మార్కెట్‌ను విస్తరించి అవసరమైన వసతులు కల్పించినప్పటికీ కొందరు వ్యాపారులు వాటిని వినియోగించకుండా బయటే వ్యాపారం నిర్వహించడం సరికాదన్నారు. ప్రజలకు ఇబ్బం దులు కలగకుండా వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. హోల్‌సేల్ వ్యాపారు



లు కేవలం టోకు వ్యాపారానికే పరిమితం కావాలని, చిల్లర విక్రయాలు చేయరాదని కమిషనర్ స్పష్టం చేశారు. అలాగే మార్కెట్‌లో వ్యాపార కార్యకలాపాలు ఉదయం 8 గంటలలోపే ముగించుకోవాలని ఆదేశించారు. మార్కెట్‌లో మున్సిపల్ నిబంధనలను అతిక్రమిస్తూ బయట వ్యాపారాలు నిర్వహించడం, రహదారులను ఆక్రమించడం, అధికారుల సూచనలను పట్టించుకోకపోవడం వంటి చర్యలు పునరావృతమైతే సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వారి లైసెన్సులు, అనుమతులను రద్దు చేసే వరకు వెనుకాడబోమని హెచ్చరించారు. వ్యాపారులందరూ మున్సిపాలిటీతో సహకరిస్తూ మార్కెట్‌లో క్రమశిక్షణతో వ్యాపారాలు నిర్వహించాలని, మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కమిషనర్ సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో అసిస్టెంట్ ఇంజనీర్ శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ రెండేళ్ల పాలన విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి

### -: రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల సుధాకర్

ప్రజాభూమి పోరుమామిళ్ల, :



తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు పోరుమామిళ్ల పట్టణంలో బుధవారం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ యనమల సుధాకర్ నాయకత్వం వహించారు. పట్టణంలోని బలజకోట వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా యనమల సుధాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటి మంత్రి నారా లోకేశ్, పార్టీ అధ్యక్షుడు పళ్ళ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల మద్దతు మరింత పెరుగుతోందని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ శిరిడి సాయినాథునికి విశేష పూజలు

ప్రజా భూమి పోరుమామిళ్ల :



కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని శ్రీ శిరిడి సాయినాథుని మందిరంలో బుధవారం గురు పౌర్ణమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ అధ్యక్షుడు కట్టమూరి శిరీష్ కుమార్ దంపతులు, భక్తులతో కలిసి శ్రీ సాయినాథునికి పాలాభిషేకం నిర్వహించి, అనంతరం ప్రత్యేక అర్చనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాయినామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీర్వాదాలు పొందారు.

## ఎస్ఐఆర్-2026 విజయానికి పార్టీల సహకారం అభినందనీయం

### -18 ఏళ్లు వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

### -రాజకీయ పార్టీల ప్రతినిధులతో సంయుక్త కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎన్ఐఆర్-2026) విజయవంతంగా పూర్తవడంలో రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), ఓటర్లు అందించిన సహకారం ప్రశంసనీయమని శ్రీ సత్యసాయి జిల్లా సంయుక్త కలెక్టర్, 157 హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి ఎం. మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బుధవారం హిందూపురం తహశీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూలై 24తో ముగిసిన ఎస్ఐఆర్-2026 కార్యక్రమాన్ని 100 శాతం డిజిటలైజేషన్‌తో విజయవంతంగా పూర్తి చేయడంలో రాజకీయ పార్టీలు, బీఎల్ఏలు కీలక పాత్ర పోషించారని అభినందించారు. ప్రతి అర్హత గల ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో విశేషంగా పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు నివాసం మార్చుకున్నవారు, డూప్లికేట్ నమోదులు, గైర్హాజరైన ఓటర్లను గుర్తించడంలో రాజకీయ పార్టీల సహకారం వల్ల ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందిందని పేర్కొన్నారు. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో గణన పత్రాలు అందని ఓటర్ల వివరాలను వెల్లడిస్తూ, మరణించిన ఓటర్లు 12,445 మంది, శాశ్వతంగా నివాసం మార్చుకున్నవారు 8,514 మంది, డూప్లికేట్ నమోదులు 9,860, గైర్హాజరైన ఓటర్లు 14,864 మంది, ఇతరులు 30 మంది ఉన్నట్లు తెలిపారు. మొత్తం 24,450 మందికి గణన పత్రాలు అందలేదని వివరించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులు, అభ్యంతరాలు, సూచనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు ఇదే సహకారాన్ని కొనసాగించాలని కోరారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం-6 ద్వారా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు సేవలకు సంబంధించి ఫారం-6 కొత్త ఓటరు నమోదు కోసం, ఫారం-7 మరణించిన ఓటర్ల పేర్లు తొలగించేందుకు, ఫారం-8 ఓటరు వివరాల సవరణతో పాటు ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి మార్పు కోసం ఉపయోగించుకోవచ్చని వివరించారు. ఈ సమావేశంలో హిందూపురం తహశీల్దార్ జి. వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ వి. మల్లికార్జున, లేపాక్షి తహశీల్దార్ జి. సౌజన్యలక్ష్మి, చిలమత్తూరు తహశీల్దార్ ఎ.పి. లక్ష్మీనారాయణ, ఎన్నికల డిప్యూటీ ఎం. మహేష్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి. అమరేంద్ర, ఎన్నికల సూపర్వైజర్లు, ఆపరేటర్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పంచాయతీ సెక్రటరీ మీద తగు చర్యలు తీసుకోవాలి

### -ఎంపీడీవోతో మాట్లాడిన వెంకటరామిరెడ్డి

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల మండలం లో ఎర్రిపల్లె గ్రామ పంచాయతీ తాగునీటి బోర్వెల్ దానికి సంబంధించిన మోటర్ రోడ్డు పక్కన నిర్లక్ష్యంగ వేయడం జరగడంతో గ్రామస్తులు గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగం చేయడం కాదా అని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సెక్రటరీకి ఎన్ని మార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని వారు అంటున్నారు. ఈ విషయాన్ని ఎర్రిపల్లె గ్రామానికి చేరుకున్న మాజీ టిడిపి పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి వెంకటరామిరెడ్డికి గ్రామ ప్రజలు వివరించారు. పంచాయతీ సెక్రటరీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన పైన చర్యలు తీసుకోవాలని ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎంపీడీవో గ్రామ పంచాయతీ సెక్రటరీ మీద తగు చర్యలు తీసుకోవలసినదిగా చరవాణి ద్వారా ఎంపీడీవో కి విషయాన్ని ఆయనకు వివరించారు. ఇందుకు ఎంపీడీవో విచారించి సెక్రటరీ పై తగు చర్యలు తీసుకుంటానని వెంకటరామిరెడ్డికి తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి ఎర్రిపల్లె గ్రామ ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అన్నదానం చేయడం మహా పుణ్యం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి

ప్రజాభూమి పోరుమామిళ్ల :



బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్లలోని అగ్రహారం దగ్గర నిత్య అన్నదాన కార్యక్రమం ప్రారంభోత్సవానికి నిర్వాహకులు బైరిశెట్టి శ్రీనివాసులు స్థలదాత సుబ్బరాయుడు ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి అనంతరం విజయ జ్యోతి మీడియాతో మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం చేయడం మహా పుణ్యమని ప్రజలు తమ సంపాదనలో కుటుంబానికే కాకుండా పదిమందికి ఉపయోగపడేలా ఉన్నప్పుడే సమాజం బాగుంటుందని ఆమె అన్నారు ఈ అన్నదాన కార్యక్రమానికి నా వంతు అన్ని సహకారాలు ఉంటాయని ఆమె నిర్వాహకులకు హామీ ఇచ్చారు అనంతరం నిర్వాహకులు ఈ కార్యక్రమంలో జవహర్ బాల్ మంచ్ జిల్లా అధ్యక్షులు పుల్లూరు భాష, బి కోడూరు మండల పార్టీ అధ్యక్షుడు గుర్రప్ప, కాంగ్రెస్ నాయకులు ఖాజావల్లి , నాయబ్ రసూల్, బైరిశెట్టి అశోక్ , సిద్ధిక్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

## ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయ ప్రారంభం - ఏర్పాట్ల పరిశీలన

### ప్రధాని చేతుల మీదుగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం

ప్రజాభూమి, పులివెందుల



వచ్చే నెల ఆగస్టు 1వ తేదీన కొత్తగా రూపుదిద్దుకున్న భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వాహనాల రాకపోకలు, పార్కింగ్ స్థలాల ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను మంత్రులు అచ్చెన్నాయుడు,బీసీ జనార్ధన్ రెడ్డి,ఎమ్మెల్సీ బీద రవిచంద్ర , మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తో కలిసి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రత, ట్రాఫిక్, పార్కింగ్, తాగునీరు, వైద్య సౌకర్యాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## రేణుకా మాతమ్మ కొలుపు ఆహ్వానం




ప్రజాభూమి ప్రతినిధి తొట్టంబేడు

శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు గ్రామంలో రేణుకా మాతమ్మ కొలుపు మహోత్సవంలో పాల్గొనవలసిందిగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేసిన పెద్దకాపు వెంకటరత్నం,పిన పెద్ద సుబ్రమణ్యం, వెంకీ, సతీష్, జ్ఞాన కుమార్, జయప్రకాష్, ఇంద్ర, సంతోష్,వంశీ తదితరులు. ఈనెల 29వ తేదీ నుండి 31వ తేదీ వరకు కొలుపు కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు.

## విలువలతో కూడిన విద్యే నిజమైన విద్య - శ్రీ చైతన్య హైస్కూల్‌లో గురుపౌర్ణిమ సందర్భంగా ఆధ్యాత్మిక విద్యా శిక్షణ ప్రారంభం

ప్రజాభూమి, వేంపల్లె

గురుపౌర్ణిమ సందర్భంగా స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో రెండు రోజుల ఆధ్యాత్మిక విద్యా శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, సేవాభావం పెంపొందించే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్యాంక్ ఆఫ్ బరోడా రిటైర్డ్ సీనియర్ మేనేజర్, పిరమిడ్ జ్ఞాన దీప్తి స్పిరిచువల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ, గురువు జీవితానికి మార్గదర్శి అని అన్నారు. ప్రతిరోజూ ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత, మానసిక ప్రశాంతత పెరిగి విద్యార్థులు జీవితంలో ఉన్నత విజయాలు సాధించగలరని తెలిపారు. తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవం, సమయపాలన, మంచి అలవాట్లు ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ, ఆధునిక విద్యతో పాటు భారతీయ సంస్కృతి, నైతిక విలువలు, క్రమశిక్షణ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో అవసరమని అన్నారు. విలువలతో కూడిన విద్యే నిజమైన విద్య అని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి విలువల ఆధారిత కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.




ఈ సందర్భంగా సీనియర్ పిరమిడ్ మాస్టర్స్ లక్కు ప్రేమానందరెడ్డి, మనోహర్ రెడ్డి, కిషోర్, నాయుడు, దస్తగిరి భాష, రామయ్య, వేణు ధ్యానం, ఆధ్యాత్మిక విలువల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ఇంద్రమ్మ, ఇంద్రాణి ప్రత్యేక అతిథులుగా హాజరై విద్యార్థులను ఆశీర్వదించారు. రెండో రోజు కూడా శిక్షణ కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ పథంతో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

### - పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

ప్రజాభూమి, వేంపల్లె



పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం నిర్వహిస్తున్న స్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా వేంపల్లె గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని పులివెందుల డీడీఓ, వేంపల్లె గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామ పంచాయతీ సూచనలను పాటించాలని కోరారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛ పథం కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కుళాయమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ రమణయ్య, పంచాయతీ ఈఓ జీ. కవిత, గ్రామ పంచాయతీ సిబ్బంది శివరాం, రాహుల్, పవన్ కుమార్, చాను, విక్టర్, జిలాన్ పాల్గొన్నారు.

## పులివెందులలో గాడి తప్పిన రిజిస్ట్రేషన్ సేవలు

### స్టాంపుల కొరత: వెండర్ల దోపిడీ

### రెండింతల రేటుకు స్టాంపులు - ప్రజల అవస్థలు

ప్రజాభూమి,పులివెందుల




పులివెందుల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల తీవ్ర కొరత ఏర్పడటంతో రిజిస్ట్రేషన్ సేవలు గాడి తప్పాయి. కార్యాలయంలో స్టాంపులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ పనులు ఆలస్యమవుతుండటంతో బాధితులు వేదన వ్యక్తం చేస్తున్నారు. స్టాంపులు స్టాంపు వెండర్ల వద్ద మాత్రమే లభిస్తున్నాయి. అయితే వారు అధికారిక ధర కంటే రెండింతలు అధిక రేటుకు విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. స్టాంపుల కొరతను ఆసరాగా చేసుకుని వెండర్లు పండుగ చేసుకుంటున్నారని ప్రజలు మండిపడుతున్నారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు గంటల తరబడి వేచి ఉండి, చివరకు అధిక ధరకు స్టాంపులు కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. స్టాంపుల సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని అధిక ధరలకు విక్రయిస్తున్న వెండర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సర్వం సాయిరాం...

### -బాబా దేవాలయాలకు బారులు తీరిన భక్తులు

### -రక్తదానం, సామూహిక అన్నదానాలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



గురు పౌర్ణమి సందర్భంగా హిందూపురం పట్టణ పరిసర ప్రాంతాల్లోని శిరిడి సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని నానెప్ప నగర్ లో వెలసిన షిరిడి సాయిబాబా, సత్యనారాయణపేటలోని సాయి బాబా, సడ్లపల్లిలో వెలసిన షిరిడి సాయిబాబా, ముద్దిరెడ్డిపల్లి లో వెలిసిన శిరిడి సాయిబాబా, టీచర్స్ కాలనీలో వెలసిన సాయిబాబా దేవాలయాల్లో బుధవారం తెల్లవారుజాము నుండి సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. షిరిడి సాయి బాబా మూలవిరాట్ విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలు, అలంకరణ సామాగ్రితో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేకంగా సాయినాథుడిని బంగారు కిరీటంతో అలంకరించారు. ప్రాతఃకాల హారతి తర్వాత దేవాలయ ఆవరణలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ సాయి హోమం, నవగ్రహోమం, మృత్యుంజయ హోమాలను నిర్వహించారు. అలాగే మధ్యాహ్న హారతి తర్వాత అఖండ సాయి సాప్తాహ కమిటీ ఆధ్వర్యంలో భజనలు చేశారు. భక్తులందరూ సాయిబాబా మూలవిరాట్ విగ్రహాన్ని తాకి పునీతులయ్యారు. ఉదయం నుండి రాత్రి వరకు సాయినాథుని దేవాలయాల వద్ద భక్తులు బారులు తీరారు. అలాగే మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. నానెప్ప నగర్ లో వెలసిన దేవాలయం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 64 మంది భక్తులు రక్తదానం చేశారు. సాయిబాబా పేర్కొన్న మేరకు మానవసేవయే మాధవ సేవగా మహిళలు సైతం రక్తదానం చేశారు. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, బాలాజీ, పావులూరి శ్రీనివాసరావు తోపాటు పలువురు టిడిపి నాయకులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు బాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.




## శ్రీ నందీశ్వరాలయంలో వైభవంగా శ్రీ శాకాంబరీ ఉత్సవాలు

### - మహిళల సామూహిక కుంకుమార్చన.. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

ప్రజాభూమి, వేంపల్లె



ఆషాఢ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నందిపల్లి గ్రామంలోని శ్రీ నందీశ్వరాలయంలో శ్రీ పార్వతీ అమ్మవారిని శ్రీ శాకాంబరీ దేవిగా వైభవంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, ధాన్యాలతో సుందరంగా అలంకరించడంతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ దివ్య అలంకారాన్ని దర్శించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కుటుంబ సౌఖ్యం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీ శాకాంబరీ దేవి ప్రకృతి, పంటల సమృద్ధి, ప్రజల శ్రేయస్సుకు ప్రతీక అని పేర్కొన్నారు. ఉత్సవ విజయవంతానికి సహకరించిన దాతలు, భక్తులు, గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలు మానసిక వికాసానికి, ఉత్సాహానికి దోహదం చేస్తాయి





## ఉద్యోగులు ప్రతిరోజూ ఏదో ఒక క్రీడకు సమయం కేటాయించాలి కలెక్టరేట్ ఇగ్నైట్ సెల్‌లో క్రీడా పరికరాల ప్రదర్శనను సందర్శించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ:
క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు విధుల నిర్వహణలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతిరోజూ కొంత సమయాన్ని ఏదో ఒక క్రీడకు కేటాయించాలని సూచించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన క్రీడా పరికరాల ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం బాక్సింగ్, చెస్, క్యారమ్స్ తదితర క్రీడలను స్వయంగా ఆడి సిబ్బందిని, సందర్శకులను ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆదాయ వనరులను పెంపొందించే ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతికతకు ప్రోత్సాహం కల్పించడం, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా జిల్లా లో సమగ్ర అభివృద్ధికి దోహదపడే సమాచార వేదికగా ఇగ్నైట్ సెల్ పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం "ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త" లక్ష్యంతో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.

ప్రతి శాఖ సేవలను ప్రజలకు చేరువ చేసే సమాచార వేదికగా ఇగ్నైట్ సెల్ ద్వారా ప్రతిరోజూ ఒక ప్రభుత్వ శాఖకు సంబంధించిన సేవలు, పథకాలు, కార్యక్రమాలు, ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని ప్రదర్శన రూపంలో అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఈరోజు జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పరికరాలు, శిక్షణా కార్యక్రమాలు, యువతకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, జిల్లాకు చెందిన క్రీడాకారుల విజయాలను ప్రత్యేకంగా ప్రదర్శించినట్లు పేర్కొన్నారు.

క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని కలెక్టర్ అన్నారు. ప్రతి ఉద్యోగి, ప్రతి విద్యార్థి తమ దైనందిన జీవితంలో క్రీడలను భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన, ఉత్సాహభరితమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి కె. కోటేశ్వరరావు, క్రీడా శిక్షకులు, శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 31, ఆగస్టు 1న కృష్ణా జిల్లాలో ఆర్టీసీ బస్సులు అత్యధికం రద్దు



## భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి బస్సుల కేటాయింపు .. అధికారులు ప్రకటన

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
ఈ నెల 31 జూలై (శుక్రవారం) మరియు 01 ఆగస్టు (శనివారం) రెండు రోజుల పాటు కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీ (APSRTC) బస్సు సర్వీసులు అత్యధిక శాతం తాత్కాలికంగా రద్దు కానున్నాయి. ఈ మేరకు జిల్లా ప్రజా రవాణా అధికారి (DPTO) కొడమంచిలి వెంకటేశ్వర్లు బుధవారం ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు.కారణం: ఆగస్టు 01, 2026 శనివారం నాడు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన "భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం" ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ వేడుకకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నారు.ఈ బహిరంగ సభకు జిల్లాల నుండి ప్రజలను చేరవేసేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు కృష్ణా జిల్లాకు చెందిన ఆర్టీసీ బస్సులను ప్రత్యేకంగా కేటాయించారు.ప్రయాణీకులకు ముఖ్య గమనిక:రద్దయ్యే డిపోలు: అవనిగడ్డ, మచిలీపట్నం, గుడివాడ, గన్నవరం మరియు ఉయ్యూరు డిపోల పరిధిలో బస్సు సర్వీసులు అత్యధికంగా అందుబాటులో ఉండవు.ఆ ప్రయాణాలకు మార్గం: అత్యవసరమైతే తప్ప ఈ రెండు రోజులు (జూలై 31, ఆగస్టు 1) ప్రయాణాలు పెట్టుకోవద్దని ఆర్టీసీ అధికారులు సూచించారు. ప్రత్యామ్నాయాలు చూసుకోవాలి: విద్యార్థులు, ఉద్యోగులు మరియు నిత్య ప్రయాణీకులు ముందుగానే తగిన ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు.సహకరించాలని విజ్ఞప్తి:బస్సుల కొరత వల్ల ప్రయాణీకులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని, ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి ఆర్టీసీ యాజమాన్యానికి సహృదయంతో సహకరించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి కోరారు.

# కోడూరులో "స్వచ్ఛ పదం"..పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత డీపీవో ధనలక్ష్మి



## క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి (DPO) ధనలక్ష్మి తడి-పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని పిలుపు పారిశుధ్య కార్మికుల సేవలకు ప్రశంసలు

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
కృష్ణా జిల్లా కోడూరు మండలం, కోడూరు గ్రామ పంచాయతీలో బుధవారం నిర్వహించిన "స్వచ్ఛ పదం" కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (DPO) ఎం. ధనలక్ష్మి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రమైన పరిసరాల కల్పన, ఘన వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజీ పూడికతీత, ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ మరియు తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్న తీరును ధనలక్ష్మి క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. భాగస్వామ్యంతోనే స్వచ్ఛ గ్రామాలు సాధ్యం: DPO ధనలక్ష్మిఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలను ఉద్దేశించి ధనలక్ష్మి మాట్లాడుతూ... గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం తడి, పొడి వ్యర్థాలను విడివిడిగా పంచాయతీ సిబ్బందికి అందజేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని కోరారు. గ్రామ పరిశుభ్రత కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములు కావడం ద్వారానే ఆరోగ్యకర వాతావరణం సాధ్యమవుతుందని ధనలక్ష్మి పిలుపునిచ్చారు.అధికారులకు ఆదేశాలు – పారిశుద్ధ్య సిబ్బందికి అభినందనలు:గ్రామంలో నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను ధనలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛత ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలు నిరంతరం తీసుకోవాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు ధనలక్ష్మి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కోడూరు పంచాయతీ కార్యదర్శి, మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బందరు కోటలో సీతమ్మ తల్లికి ఘనంగా సారె సమర్పణ

## లలిత సహస్ర నామ కుంకుమ పూజలో పాల్గొన్న కొల్లు నీలిమ, కాగిత శిరీష

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
బందరు కోటలో వేంచేసి ఉన్న శ్రీ సీతారామస్వామి వారి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా సీతమ్మ తల్లికి ఘనంగా సారె సమర్పించి, లలిత సహస్ర నామ కుంకుమ పూజ నిర్వహించారు. పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సతీమణి కాగిత శిరీష ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ పూజా కార్యక్రమంలో కొల్లు నీలిమ, బోడె హేమ, యార్లగడ్డ జ్ఞానేశ్వరితో పాటు పలువురు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా కాగిత శిరీష మాట్లాడుతూ... సీతమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.



# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో మంత్రి కొల్లు రవీంద్ర భేటీ

## ఏపీలో 'క్రిటికల్ మినరల్స్ పార్క్', 'రేర్ ఎర్త్ కారిడార్' ఏర్పాటుకు కేంద్రం సహకరించాలి రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సుముఖం మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అపారమైన ఖనిజ వనరులు, రేర్ ఎర్త్ మినరల్స్ అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్ర మైనింగ్ రంగాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విజ్ఞప్తి చేశారు. బుధవారం న్యూ ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో మైనింగ్ రంగాభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందించారు.ప్రతిపాదనల్లోని ప్రధానాంశాలు:క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ పార్క్: రాష్ట్రంలో లభించే ఖనిజాలకు ప్రపంచ స్థాయి 'వేల్యూ యాడెడ్' పరిశ్రమలను అనుసంధానిస్తూ ప్రాసెసింగ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలి.ఏపీ రేర్ ఎర్త్ కారిడార్: తయారీ, ఎగుమతులను వేగవంతం చేస్తూ ఒక సమగ్రమైన రేర్ ఎర్త్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు కేంద్రం తోడ్పాటునందించాలి.సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో (AU) 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ కెమికల్ ఇంజనీరింగ్' ఏర్పాటు చేయడం ద్వారా సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను (హ్యూమన్ రీసోర్సెస్) తీర్చిదిద్దేందుకు మద్దతు ఇవ్వాలి.స్థానికంగానే పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం హామీ!కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... రాష్ట్రంలో మైనింగ్ అవకాశాల ను అందిపుచ్చుకోవడం ద్వారా ఆర్థిక రంగాన్ని బలో పేతం చేయడమే కాకుండా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని తెలిపారు. దేశ మైనింగ్ అవసరాలను తీర్చేలా ఏపీలోనే స్థానికంగా అన్ని పరిశ్రమలను ఏర్పాటు చేసేం దుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు.



# పోస్టల్ సేవలపై జీఎస్టీ తొలగించాలి లోక్‌సభలో ఎంపీ వల్లభనేని బాలశౌరి విజ్ఞప్తి

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి



ప్రజలకు, చిన్న వ్యాపారులకు ఎంతో ఉపయోగపడే పోస్టల్ సేవలపై విధిస్తున్న జీఎస్టీని తొలగించాలని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సాధారణ తపాలా సేవలకు జీఎస్టీ మినహాయింపు ఉన్నట్లే, ప్రజలు ఎక్కువగా వినియోగించే స్పీడ్ పోస్ట్‌తో పాటు ఇతర సేవలకూ ఈ మినహాయింపు విస్తరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ వివరణ:ఎంపీ ప్రశ్నకు కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ సమాధానమిస్తూ... ప్రస్తుతం పోస్ట్‌కార్డులు, ఇన్‌ల్యాండ్ లెటర్లు, బుక్‌పోస్ట్, 10 గ్రాముల లోపు సాధారణ కవర్లు మరియు తపాలా శాఖ జీవిత బీమా సేవలకు మాత్రమే జీఎస్టీ నుండి మినహాయింపు ఉందన్నారు. స్పీడ్ పోస్ట్ తో సహా మిగిలిన సేవలు జీఎస్టీ పరిధిలోనే ఉన్నాయని స్పష్టం చేశారు.ఆర్థిక మంత్రిత్వ శాఖకు తపాలా శాఖ ప్రతిపాదనలు:ప్రైవేట్ కొరియర్ సంస్థలతో పోటీ పడుతూ తక్కువ వ్యయంతో సేవలు అందించే స్పీడ్ పోస్ట్ (ఈఎంఎస్), అంతర్జాతీయ సేవలు, దేశీయ బుక్ ప్యాకెట్లు, రిజిస్టర్డ్ వార్తాపత్రికలు, 20 గ్రాముల వరకు ఉన్న లేఖలపై జీఎస్టీని మినహాయించాలని తపాలా శాఖ ఇప్పటికే ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని సీబీఐసీకి పలుమార్లు ప్రతిపాదనలు పంపిందని కేంద్రం వెల్లడించింది.ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎంపీ వల్లభనేని బాలశౌరి పార్లమెంట్‌లో ఈ అంశాన్ని లేవనెత్తడంపై లక్షలాది మంది తపాలా వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఇంద్రకీలాద్రిపై వైభవంగా ముగిసిన శాకంభరీ ఉత్సవాలు.



**మహాపూర్ణాహుతితో ఉత్సవ సమాప్తి.ఫల పుష్పాదులతో శాకంభరీ దేవిగా భక్తులకు దివ్యదర్శనమిచ్చిన కనకదుర్గమ్మ.**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
సకాలంలో వర్షాలు కురిసి, లోకం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించిన ధర్మ కర్తలు,అధికారులు, అర్చకులు.ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో గత మూడు రోజులుగా (జులై 27, 28, 29) అత్యంత వైభవంగా జరుగుతున్న "శాకంభరీ ఉత్సవాలు" ఈరోజు (బుధవారం) గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహాపూర్ణాహుతితో ప్రశాం తంగా, ఘనంగా ముగిశాయి.ఉత్సవాల ముగింపు రోజైన పౌర్ణమి సందర్భంగా శ్రీ అమ్మవారు దివ్య మైన అలంకారంతో వివిధ రకాల పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు మరియు డ్రైఫ్రూట్స్‌తో కూడిన శాకంభరీ దేవి రూపంలో భక్తులకు నేత్రపర్వంగా దర్శనమిచ్చారు.ఉత్సవ సమాప్తి సంద ర్భంగా ఆలయ స్థానాచార్య వి. శివప్రసాద శర్మ, వైదిక కమిటీ సభ్యులు, వేదపండితులు మరియు అర్చకస్వాముల ఆధ్వర్యంలో పవిత్ర వైదిక క్రతువులు జరిగాయి. "మహా పూర్ణాహుతి", కలశోద్వాసన, మార్జనము మరియు ప్రోక్షణతో ఉత్సవాలు దిగ్విజయంగా సమాప్తమయ్యాయి.ఈ సంద ర్భంగా దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ,కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ మాట్లా డుతూ.. "రైతులు మరియు దాతలు ఉదారంగా అందించిన విరాళాలతో మొత్తం45 టన్నుల కూర గాయలు, ఆకుకూరలు, పండ్లు మరియు డ్రైఫ్రూట్స్‌తో గర్భగుడి, ఉప ఆలయాలు మరియు ఆలయ ప్రాంగణాన్ని మహోన్నతంగా అలంకరించ డం జరిగింది. సకాలంలో వర్షాలు కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు, రైతాంగం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మరియు రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో ఈ ఉత్సవం పూర్తి చేశాము" అని తెలిపారు.మూడు రోజుల పాటు సాగిన ఈ ఉత్సవాలలో సుమారు 2. 5లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరిం చారని ఈవో శీనా నాయక్ వివరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేపట్టింది. ఉత్సవాల సందర్భంగా వచ్చిన కూరగాయలతో తయారు చేసిన పవిత్ర 'కదంబం' ప్రసాదాన్ని భక్తులందరికీ ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తులు కొండ చుట్టూ నిర్వహించిన గిరి ప్రదక్షిణలో విశేష సంఖ్య లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు. ఆలయం ధర్మ కర్తలు,ప్రధాన అర్చకులు,ఏఈఓలు మరియు పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా ఆర్థికాభివృద్ధికి జివిఏ-జిడిడిపిపై సమగ్ర అవగాహన అవసరం: జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



**స్వర్ణ ఆంధ్ర @2047 లక్ష్యాలకు నాణ్యమైన గణాంకాలే పునాది మండల స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు జివిఏ–జిడిడిపిపై అవగాహన పెంపొందించాలి**

**శిక్షణలో పాల్గొన్న అధికారులు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించాలి**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
జిల్లా ఆర్థికాభివృద్ధి వేగవంతం కావాలంటే స్థూల విలువ జోడింపు, స్థూల జిల్లా దేశీయోత్పత్తి వంటి ఆర్థిక సూచికలపై ప్రతి శాఖకు సమగ్ర అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ శిక్షణలో జిల్లా ఆర్థికాభివృద్ధి, జివిఏ, జిడిడిపి, రంగాల వారీ ఆర్థిక వృద్ధి, జిల్లా, మండల స్థాయిలో ఆర్థిక గణాంకాల తయారీ, విశ్లేషణ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లైన మండల స్థాయి అధికారులు, సీపీఏపీ యూనిట్, యంగ్ ప్రొఫెషనల్స్‌కు సమగ్ర అవగాహన కల్పించారు. 2025–26 సంవత్సరానికి జిల్లా జిడిడిపి సుమారు రూ.1,05,135 కోట్లుగా నమోదైందని కలెక్టర్ తెలిపారు. జిల్లా అభివృద్ధి ప్రగతిని అంచనా వేయడంలో జివిఏ, జిడిడిపి వంటి ఆర్థిక సూచికలు కీలకమని పేర్కొన్నారు. ప్రతి శాఖ జివిఏ లెక్కింపు విధానాలు, రంగాల వారీ వృద్ధి, గణాంకాల వినియోగంపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. దేశం 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవాలంటే నూరు శాతం అక్షరాస్యత సాధించడం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. అక్షరాస్యతతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తే దాదాపు 95 శాతం ప్రజలను పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో తీర్చిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు సంపూర్ణ నైపుణ్యాలను సొంతం చేసుకున్నప్పుడే కుటుంబాలతో పాటు రాష్ట్ర, దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన ఆధారంగా నిలుస్తారని తెలిపారు. నైపుణ్య విద్య ద్వారా ఉపాధి అవకాశాలు విస్తరించి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వివరించారు. వ్యవసాయ రంగంలో సంప్రదాయ పంటలతో పాటు విలువ ఆధారిత వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వరి సాగులోని కొంత భూమిని ఉద్యానవన పంటలకు మళ్లించడం ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. విజయవాడ ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా సేవారంగంలో సుమారు రూ.150 కోట్ల అదనపు స్థూల విలువ జోడింపును సాధించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధితో సేవా రంగం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని సహజ, మానవ వనరులు, భౌగోళిక అనుకూలతలను సమర్థవంతంగా వినియోగించుకొని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయంలో ఉత్పత్తి పెంపుతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని, సేవా, పారిశ్రామిక రంగాల విస్తరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం సైద్ధాంతిక అంశాలకు పరిమితం చేయకుండా పరస్పర చర్చ లు, ప్రశ్నోత్తరాలు, ఆచరణాత్మక ఉదాహరణలతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను మండల స్థాయి అధికారులు, ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు, స్వర్ణ గ్రామ–స్వర్ణ వార్డు సిబ్బందికి సమర్థవంతంగా చేరవేయాలని ఆదేశించారు. శిక్షణలో పాల్గొన్న అధికారులు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించి జివిఏ, జీఎన్‌డీపీ, జిడిడిపి, జీఎస్‌డీపీ వంటి ఆర్థిక భావనలపై క్షేత్రస్థాయి వరకు అవగాహన కల్పించాలని తెలిపారు. అభివృద్ధి ప్రణాళికల అమలులో భాగస్వాములైన ప్రతి స్థాయి అధికారి, సిబ్బందికి ఈ అంశాలపై ప్రాథమిక పరిజ్ఞానం ఉండటం అవసరమని పేర్కొన్నారు. జిల్లా ఆర్థికాభివృద్ధికి సంబంధించిన గణాంకాల సేకరణ, విశ్లేషణ, వినియోగంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. విశ్వసనీయ గణాంకాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి సమిష్టి కృషితో జిల్లా అభివృద్ధిని మరింత వేగవంతం చేసి స్వర్ణ ఆంధ్ర @2047 లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక & గణాంక శాఖ జాయింట్ డైరెక్టర్ బి.అనుపమ మాట్లాడుతూ, ప్రతి శాఖ తన పరిధిలోని గణాంక సమాచారాన్ని ఖచ్చితత్వంతో, పారదర్శకతతో, నిర్ణీత గడువులో అందించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి విశ్వసనీయ గణాంకాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర @2047 లక్ష్యాల సాధనలో నాణ్యమైన, విశ్వసనీయ, సమయానుకూల గణాంకాలే విజయానికి పునాది అని పేర్కొన్నారు. .ఈ కార్యక్రమంలో పహాలే ఇండియా ఫౌండేషన్ శిక్షకులు జె.అనిల్ కుమార్, బెల్లపు రాగిణి, జోనల్ కోఆర్డినేటర్ యోగేష్ కృష్ణ, జిల్లా విశ్లేషకులు, మండల స్థాయి అధికారులు, సీపీఏపీ యూనిట్ సభ్యులు, యంగ్ ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు.


Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Sri Lakshmi Offset Printers, R.S. No.268/2;D.No. 8/180,Surampalli Village, Gannavaram Mandalam, Krishna district, Andhra Pradesh and Published from D.NO. 32-26-85/6, MSR Street Marutinagar, Eluru Road, Vijayawada-520004,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677

# అనేం సాయి హత్య కేసుపై ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ విచారణ

## సంఘటన స్థల పరిశీలన, డీఎస్పీతో కేసు పురోగతిపై చర్చ.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

రావులపాలెంకు చెందిన అనేం సాయి హత్య కేసుపై ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ విచారణ చేపట్టి, బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు, స్నేహితుల నుంచి వివరాలు సేకరించింది. అనంతరం హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి ఘటనకు సంబంధించిన పరిస్థితులను తెలుసుకుంది. స్థానికుల కథనం ప్రకారం, హత్య జరిగిన రోజు అనేం సాయి మొదటి షో సినిమా చూసి రాత్రి 9.30--10 గంటల మధ్య గ్రామానికి చేరుకుని స్నేహితులతో కొంతసేపు గడిపిన అనంతరం హత్యకు గురయ్యాడు. చిర్ల సోమసుందరరెడ్డి కొత్త కాలనీలో నివసిస్తూ తాపీ పని చేసుకుంటూ అన్ని వర్గాల ప్రజలతో స్నేహంగా ఉండేవాడని కమిటీకి తెలిపారు. ఘటన ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఘటన సమయంలో అవి పనిచేయకపోవడం దర్యాప్తుకు ప్రతికూలంగా మారిందని స్థానికులు పేర్కొన్నారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన షరీఫ్ అనే వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి బాధితుడి మేనమామకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు నూకల దుర్గాప్రసాద్ అలియాస్ "వాటర్ ప్యాకెట్లు"ను పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచి రాజమహేంద్ర వరం కేంద్ర కారాగారానికి తరలించిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం కమిటీ సభ్యులు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళిమోహన్‌ని కలిసి కేసు దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. సమగ్రంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలికితీయాలని కోరినట్లు తెలిసింది. మరికొందరి ప్రమేయంపై బాధిత కుటుంబం, కొందరు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, దీనిపై పోలీసులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. దర్యాప్తు కొనసాగుతున్నందున వాస్తవాలు పోలీసుల విచారణలోనే తేలనున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌ఎఫ్ ప్రతినిధులు ఎ. రవి, వై. రాజేష్, ఫా. సింహారాయులు (పారా ), అడ్వకేట్ మధు జాషువా, కార్యకర్తలు పి. శేషారత్నం, బి. సుబ్బాయమ్మ, ఎస్. రాజారావు, దివ్యాంగుల కార్యకర్త బడుగు మహిమారావు, జర్నలిస్టు కె. రాజు తదితరులు పాల్గొన్నారు.

### గత 98 ఏళ్లుగా సమాజ సేవ,నిస్వార్థ భావమే లక్ష్యంగా

# ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ విశేష సేవలు

- రూ.7.50 కోట్లతో రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఏర్పాటుకు చర్యలు
- కాకినాడ ఇండియన్ రెడ్ క్రాస్ 2025-26 వార్షిక సాధారణ సమావేశంలో జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షులు,జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్







ప్రజాభూమి బ్యూరో-కాకినాడ

గత 98 ఏళ్లుగా సమాజ సేవ, నిస్వార్థ భావమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కాకినాడ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా జిల్లాలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఏర్పాటు వేగవంతం చేసి, ప్రజలకు మరింత మెరుగైన వైద్య,సేవా సౌకర్యాలు అందుబాటు లోకి తీసుకువచ్చేందుకు కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్,రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు.బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 2025-26 వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) కాకినాడ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ అధ్యక్షులు,జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్, కాకినాడ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ వై.డి రామారావు గత 2025-26 ఆర్థిక సంవత్సరంలో రెడ్ క్రాస్ సంస్థ ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాలు,సాధించిన విజయాలు,భవిష్యత్తులో చేపట్టబోయే నూతన ప్రాజెక్టులు వివరాలను సభ కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. కాకినాడ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ వార్షిక సాధారణ సమావేశం లో పాల్గొనడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో గత 98 ఏళ్లుగా ఈ సంస్థ ఎంతో విజయవంతంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని కొనియాడారు. సమాజంలో ఎటువంటి విభేదాలు లేకుండా అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తొదన్నారు. ముఖ్యంగా పేదవాళ్ళ కి మేలు జరగాలనే గొప్ప ఉద్దేశంతో రెడ్ క్రాస్ సంస్థ పనిచేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సంస్థను ఇంతటి ఉన్నత స్థాయికి తీసుకువెళ్తున్న చైర్మన్ వైడీ రామారావు,సభ్యులు అందరికీ పేరు పేరున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు.గత సంవత్సరంలో ఎన్నో మంచి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకున్నామని అదే స్ఫూర్తితో రాబోయే సంవత్సరాల్లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్ళాని జిల్లా కలెక్టర్ సూచించారు.ప్రధానంగా కాకినాడలో 7.5 కోట్ల రూపాయల వ్యయం తో నిర్మిస్తున్న క్యాన్సర్ హాస్పిటల్,వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. క్యాన్సర్ కేర్ ఫెసిలిటీ ఏర్పాటు ప్రక్రియ ప్రస్తుతం తుది దశకు చేరిందని,జిల్లాలోని ప్రజా ప్రతినిధుల సహకారం తోనూ సాధ్యమైనంత త్వరగా పరికరాల ఏర్పాటు కు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.అందరి సహకారం, మద్దతు తో ఇప్పటివరకు మనం 80 శాతం పనులను పూర్తి చేశామని, మిగిలిన 20 శాతం పనులను కూడా రాబోయే కొన్ని నెలల్లో కచ్చితంగా పూర్తి చేసి అందుబాటు లోకి తీసుకు వచ్చేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు.అతి త్వరలోనే రెడ్ క్రాస్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి సంబంధించి కూడా ఒక సానుకూలమైన వార్తను తెలియజేస్తామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.వీటితో పాటు బ్లడ్ బ్యాంక్ నిర్వహణ,కార్నియా సేకరణ సేవలు, ఇతర స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు,స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్,విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలు,మహిళా సాధికారత కార్యక్రమాలు అన్నీ కూడా నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.దాతలు తమ ఉదారమైన విరాళాలతో అందిస్తున్న సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ,రాబోయే సంవత్సరంలో కూడా ఇదే సహకారాన్ని అందించాలని కోరారు.మరింత మెరుగైన సేవలు అందిస్తూ,మనం ఊహించుకున్న అంచనా లను మించి రాబోయే కాలంలో మంచి పురోగతి కనబరచాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.అనంతరం రెడ్ క్రాస్ క్యాన్సర్ బ్లాక్ కు మరియు సంస్థ కు విరాళాలు అందించిన దాతలు,అధికారులు అడపా వెంకట లక్ష్మి, ప్రత్తిపాడు తహశీల్దార్ సూర్య ప్రభ, సామర్ల కోట ఎంపీడిఓ కె. హిమామహేశ్వరీ, కాన్సర్ హాస్పిటల్ నిర్మాణానికి విరాళాలు అందించిన దాతలు ఐటిఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కాసిన వెంకటేశ్వర రావు, పాలడుగు సుబ్రహ్మణ్యం,పైడా వెంకట నారాయణ సుశీల రాఘవ రత్నమ్మ అకాడమీ అఫ్ ఎడ్యుకేషన్,వైడి.రామా రావు కుటుంబసభ్యులు, ఎన్.శృతి రెడ్డి; రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేసి సహకరించిన ఈటీసీ సామర్లకోట అధికారులకు జిల్లా కలెక్టర్ పురస్కారాలు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎన్వీవీఆర్. ప్రసాద్ బాబు, కార్యవర్గ సభ్యులు జీవిత సభ్యులు సంస్థ కార్యదర్శి కె.శివ కుమార్ వందన తదితరులు పాల్గొన్నారు.

## జంక్ ఫుడ్‌కు గుడ్‌బై..
## పెన్నులు పంచి పుట్టినరోజు జరుపుకున్న విద్యార్థి



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలం అన్నదేవరపేట బీసీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఓ విద్యార్థి తన పుట్టినరోజును వినూత్నంగా జరుపుకుని అందరి ప్రశంసలు అందుకున్నాడు. పాఠశాలలో చదువుతున్న గొలుసు భీమరాజు తన పుట్టినరోజు సందర్భంగా చాక్లెట్లు, బిస్కెట్లు, కూల్ డ్రింక్స్ పంపిణీ చేయకుండా, కేక్ కట్ చేయకుండా సహ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పెన్నులు పంపిణీ చేశాడు.భీమరాజు పుట్టినరోజుకు ఒక రోజు ముందు స్థానిక దుకాణానికి వెళ్లిన సందర్భంగా, ప్రతి సంవత్సరం పుట్టినరోజు వేడుకలకు చేసే ఖర్చుతో పాఠశాలలో శుభదినం యాప్ ద్వారా పెరుగు, పండ్లు లేదా విద్యార్థులకు అవసరమైన పెన్నులు వంటి ఉపయోగకరమైన వస్తువులు పంపిణీ చేస్తే ప్రత్యేక బహుమతి అందజేస్తామని దుకాణ నిర్వాహకులు మానవత మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ సూచించారు.దీంతో ఆ సూచనను ఆచరణలో పెట్టిన భీమరాజును అభినందిస్తూ ఒక చెస్ బోర్డు, క్రేయాన్స్, స్కెచ్ పెన్లు, స్వీట్లు పుట్టినరోజు కానుకగా అందజేశారు.పిల్లల్లో జంక్ ఫుడ్ తినే అలవాటును తగ్గించి, మంచి అలవాట్లను పెంపొందించే దిశగా భీమరాజు తీసుకున్న ఈ నిర్ణయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు అభినందించారు. ఈ తరహా కార్యక్రమాలు ఇతర విద్యార్థులకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

-పంటల బీమా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ సూచన



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలం పైడిమెట్ట గ్రామంలో రైతులకు "ఎల్ నినో ప్రభావం - ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి యాజమాన్యం, పంటల బీమా" అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొవ్వూరు ఆర్డీఓ కె. ఆనందరావు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం వల్ల కలిగే నష్టాల నుంచి రక్షణ పొందేందుకు రైతులు తప్పనిసరిగా పంటల బీమా పథకంలో నమోదు చేసుకోవాలని సూచించారు.పంటల బీమా ప్రీమియం వివరాలను వెల్లడిస్తూ, వరి పంటకు ఎకరానికి రూ.570, మినుము పంటకు రూ.300, అరటి పంటకు ఎకరానికి రూ.3,000 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. రుణం తీసుకున్న రైతులు బ్యాంకులు లేదా సహకార సంఘాల ద్వారా, రుణం తీసుకోని రైతులు సీఎస్‌సీ కేంద్రాలు లేదా పంటల బీమా పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చని వివరించారు.వరి పంటకు ప్రీమియం చెల్లించేందుకు చివరి తేదీ ఆగస్టు 15, 2026 కాగా, మినుము మరియు అరటి పంటలకు జూలై 31, 2026 వరకు అవకాశం ఉందని తెలిపారు. చివరి తేదీ లోపు ప్రీమియం చెల్లించి పంటలకు ఆర్థిక రక్షణ కల్పించుకోవాలని రైతులకు సూచించారు.ఈ సందర్భంగా తాళ్లపూడి తహసీల్దార్ లక్ష్మీ లావణ్య మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగయ్యే అపరాలు, చిరుధాన్యాల వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే ప్రతి రైతు పంటల బీమా పథకంలో చేరి తమ పంటలకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, స్థానిక రైతులు పాల్గొని పంటల బీమా, నీటి యాజమాన్యం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన పొందారు.

## వైభవంగా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో టీటీడీ గురువందన మహోత్సవం

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొనగా భక్తులకు ఆధ్యాత్మిక సందేశం అందించిన పగడాల రామానంద తీర్థ ఆచార్యులు.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.



ఆత్రేయపురం మండలంలోని కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానములు (టీటీడీ) దాస సాహిత్య ప్రాజెక్టు, దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో గురు వందన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పగడాల రామానంద తీర్థ ఆచార్యులు పాల్గొని గురు మహిమ, సనాతన ధర్మ పరిరక్షణ, భక్తి మార్గం యొక్క విశిష్టతను వివరిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సందేశం అందించారు. గురువును స్మరించడం ద్వారా జీవితం సార్థకమవుతుందని, ధర్మాచరణతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొంటాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం, దేవాదాయ శాఖ కట్టుబడి పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ ముదునూరి వెంకటరాజు, దేవస్థాన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గురువందన మహోత్సవాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం అంతటా భక్తిమయ వాతావరణం నెలకొంది.


## విఆర్ పురంలో ఘనంగా గురు పౌర్ణమి



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

నేడు మండల వ్యాప్తంగా గురు పౌర్ణమి వేడుకలను బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ గురు పౌర్ణమి పర్వదినం నీ పురస్కరించుకొని మండలంలోని వడ్డిగూడెం, విఆర్ పురం, బీసీ కాలనీ, రేఖపల్లి తదితర గ్రామాల్లోనీ సాయిబాబా, సత్యసాయిబాబా ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారు. అలాగే విఆర్ పురం సత్య సాయి బాబా ఆలయం వద్ద ఉదయం పూజలు, అభిషేకాలు నిర్వహించి, సాయంత్రం సత్య సాయిబాబా (ఫోటో) ప్రతిమను పల్లకిలో గ్రామం మొత్తం సాయి నామ స్మరణలతో ఊరేగింపు నిర్వహించారు. హిందూ సంస్కృతిలో ఆషాఢ మాసంలో వచ్చే పౌర్ణమిని గురు పౌర్ణమి లేదా వ్యాస పౌర్ణమి అంటారు. ఇది తొలి గురువైన వేద వ్యాసుని జయంతి, గురు-శిష్య సంబంధానికి ప్రతీక ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందే పవిత్ర దినం. అందుకే ఈ గురు పౌర్ణమి పర్వదినము మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు

## విద్యార్థినులకు శారీరక మార్పులపై అవగాహన కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

పాఠశాల విద్యార్థినులకు యుక్తవయస్సులో కలిగే శారీరక మార్పులు, ఆరోగ్య సమస్యలపై సరైన అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని శ్రీ పరస పద్మ రాజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సి.హెచ్. సుబ్బలక్ష్మి అన్నారు.స్థానిక శ్రీ సాయి స్ఫూర్తి హాస్పిటల్స్‌లో గైనకాలజిస్టుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె. మౌనిక పాఠశాలలో 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు ప్రత్యేక ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక విద్యార్థినులతో ఆత్మీయంగా చర్చిస్తూ యుక్తవయస్సులో వచ్చే శారీరక మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేస్తూ వారి ప్రత్యేక అవసరాలను తెలుసుకొని తగిన సూచనలు, సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో శ్రీ సాయిస్ఫూర్తి హాస్పిటల్స్ మేనేజింగ్ పార్ట్నర్ గూడా విజయరాజు, లింగంపల్లి సుధీర్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## ముద్రగడ సేవలు చిరస్మరణీయం

రావులపాలెంలో సంతాప సభలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆకుల రామకృష్ణ నివాళి.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.



మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతికి సంతాపంగా రావులపాలెం కాపు కల్యాణ మండపంలో బుధవారం సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కాపు ఉద్యమ నేత ఆకుల రామకృష్ణ పాల్గొని ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాపు సామాజిక వర్గ హక్కులు, రిజర్వేషన్ల సాధన కోసం ముద్రగడ జీవితాంతం పోరాడిన నాయకుడని కొనియాడారు. కాపు ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, సమాజ ప్రయోజనాలకే అంకితమైన నాయకుడిగా చిరస్మరణీయుడిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు సమాజం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాపు సంఘాల నాయకు లు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సామర్లకోటలో వెదురు మొక్కల పెంపకం

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ



మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వెదురు మొక్కల పెంపకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ జిల్లా సామర్ల కోట పట్టణంలో గల శిక్షణా కేంద్రం లో వెదురు మొక్కలు నాటే కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణం లోని చేపల పెంపకం, కుట్టు యంత్రాల శిక్షణా కేంద్రాన్ని అలాగే రెండు రోజులపాటు కొనసాగే 'విత్తసఖి' శిక్షణా కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. అనంతరం సంచాలకులు మరియు ఇతర గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది సామర్లకోట శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ కు వివరంగా తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. గౌ. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన వెదురు మిషన్ కార్యక్రమం లో భాగంగా నేడు సామర్ల కోట టీటీడీసీలో వెదురు మొక్కలను నాటడం జరిగిందన్నారు.వెదురు మొక్కల పెంపకం, కొర్రమీను చేపల పెంపకం అనే ఉపాధి మార్గాల ద్వారా జిల్లాలో దాదాపు వెయ్యి మంది మహిళలు, రైతులు తమ కాళ్లపై నిలబడే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. నాలుగో సంవత్సరం నుండి సుమారు ప్రతి సంవత్సరానికి లక్ష రూపాయల ఆదాయం వచ్చేలా ఈ ప్రోత్సాహక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళలు స్వయం కృషితో ఆర్థికంగా ఎదుగుటకు అన్ని రకాల ఏర్పాట్ల ను చేస్తోందని, దీనికోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంచాలకులు జి. శ్రీనివాస్, సహాయ సంచాలకులు జిలాని,జిల్లా ప్రాజెక్టు నిర్వహణాధికారులు అశోక్ భరత్,బాబూరావు, రాయ్, ప్రాంతీయ ప్రాజెక్టు నిర్వహణాధికారులు షఖినా ప్రియదర్శిని,అనిల్ కుమార్, సన్యాసిరావు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ కుటుంబానికి సంక్షేమం - అభివృద్ధి భరోసా...

## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేసే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక ఇంటింటి ప్రచార కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం రామచంద్రపురం పట్టణంలోని 1, 2,7, 28 వార్డుల్లో మంత్రి సుభాష్ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ నిర్ణయాల గురించి వివరించారు. ప్రభుత్వ సేవలు, పథకాల ద్వారా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను తెలియజేస్తూ ప్రజల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని విమర్శించారు. అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రోజుకు 18 గంటల పాటు కష్టపడి రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ సంక్షేమం -అభివృద్ధిని సమన్వయం చేస్తోందని మంత్రి అన్నారు. మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ "వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్" కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. భావితరాల భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, అందుకే పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకువచ్చి నిరుద్యోగ నిర్మూలనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ యువతకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలు, అవసరాలు, సూచనలను నేరుగా తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ 45 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా చేయడంతో పాటు, ప్రభుత్వం -ప్రజల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి అతిపెద్ద బలం అని, అదే స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవిల్లి శివ, గరికపాటి సూర్యనారాయణ, దంగేటి గౌరీ శంకర్, కట్టా నాగేశ్వరరావు, మేడిశెట్టి సూర్యనారాయణ, కడియాల రాఘవన్, పదం మూర్తి, నారపురెడ్డి బలరాం, అల్లం శ్రీనివాస్, ఏసుదాసు, దిగుమతి వీరబాబు, వాసంశెట్టి చంద్రశేఖర్, గడి గోవిందు, కుడుపూడి ఫణితేజ, పొణకల చంటి, గుబ్బల వెంకటరమణ, రెడ్డి సురేష్, ఉరెంకల మంగతాయారు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా వార్డుల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## మావుళ్లమ్మ అమ్మవారికి ఘనంగా ఆషాఢ సారె సమర్పణ

### - భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. మహిళల పోటెత్తిన హాజరు



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామంలో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ మావుళ్లమ్మ అమ్మవారికి గ్రామ మహిళల ఆధ్వర్యంలో ఆషాఢ సారె మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తరు విశ్వనాథ శర్మ అర్చకత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామ మహిళలు వందల సంఖ్యలో తరలివచ్చి 108 రకాల సారెతో పాటు పిండివంటలు, స్వీట్లు, పండ్లు, పూలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, యువకుల బాణాసంచా సందడి మధ్య సారెను ఛత్రాలు పట్టుకుని గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి ఘనంగా సమర్పించారు. పుట్టింటి వారు, సామనవారు కలిసి కుంకుమ పూజలు నిర్వహించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామ మహిళలు మాట్లాడుతూ, గ్రామ పెద్ద ఆడపడుచుగా భావించే మావుళ్లమ్మ అమ్మవారికి తొలిసారిగా ఇంత వైభవంగా సారె సమర్పించే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గ్రామంలోని ఆడపడుచులందరూ పసుపు--కుంకుమలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. అమ్మవారికి తొలి ఆషాఢ సారె మహోత్సవం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ వారు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు భారీ సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## అసంపూర్తి ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి

### - హౌసింగ్ పీడీ నాతి బుజ్జి




ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలంలోని హౌసింగ్ లేఅవుట్ కాలనీల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల లబ్ధిదారులను హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నాతి బుజ్జి బుధవారం ఉదయం కలిసి, ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. అధికారుల సహకారంతో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించే క్రమంలో, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పర్యటించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా హౌసింగ్ పీడీ నాతి బుజ్జి వివరాలు తెలియ చేస్తూ, లబ్ధిదారుల్లో చైతన్యం పెంపొందించి పెండింగ్‌లో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం గృహ నిర్మాణానికి అందిస్తున్న సహాయాన్ని ప్రతి అర్హులైన లబ్ధిదారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాళ్లపూడి మండలంలో మొత్తం 14 హౌసింగ్ లేఅవుట్లు ఉండగా, 543 ఇళ్లు మంజూరు అయ్యాయని, వాటిలో 301 ఇళ్లు పూర్తయ్యాయని, మరో 242 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని ఆయన వివరించారు. నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను వేగంగా పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అదేవిధంగా, ఆవాస్ పీఎంఏవై 2.0 గ్రామీణ పథకం కింద తాళ్లపూడి మండలంలో 751 మంది లబ్ధిదారులను ఇళ్ల మంజూరుకు అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వీరికి ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతుందని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నాతి బుజ్జి పేర్కొన్నారు.

## గురు పౌర్ణమి వేడుకల్లో చిర్ల జగ్గిరెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట



రావులపాలెం మండలం గోపాలపురం శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా గోపాలపురానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ మంద గంగిరెడ్డి (రికవరీ హాస్పిటల్), డాక్టర్ గంధం రామా రావు (రాఘవేంద్ర కంటి ఆస్పత్రి) లను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి చిర్ల జగ్గిరెడ్డి శాలువా లు కప్పి సన్మానించారు. వైద్యులు సమాజానికి నిస్వార్థ సేవలందించే నిజమైన సేవామూర్తులని, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వారి పాత్ర అమూల్యమని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## పాపికొండల టూరిజం బోట్లను నిలిపి వేసినా బోటు యాజమాన్యం

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.



రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పోచవరం బో టు పెయింట్ నుంచి ప్రయాణికులను తీసుకొని వెళ్లు, పాపికొండలు టూరిజం బోట్లను, స్వచ్ఛందంగా నిలుపుదల చేశామని, వర్షాలు తగ్గు ముఖంపట్టే వరకు నిలుపుదల చేయడం జరుగుతుందని పాపికొండల బోట్ ఆపరేటర్స్ యూనియన్ వారు వాళ్ళ రంగారెడ్డి, మాదిరెడ్డి సత్తిబాబు, పెందుర్తి సుదర్శన్, వవ్వాకుల సూర్య ప్రకాష్ రావు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్లు వచ్చిన వర్షాలు విపరీతంగా పెరిగినప్పుడు కూడా బోట్లను నిలుపుదల చేశామని అన్నారు. ఇక్కడ బోట్లలో సేఫ్టీ సెక్యూరిటీ విధిగా పాటించటం వలన ఎప్పటి వరకు పోచవరం టు పాపికొండలు టూరిజం లో ఎటువంటి సంఘటనలు జరగలేదు దీనికి కారణం ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలు పాటిస్తూ ఇక్కడ బోట్ యజ మాన్యం తగు జాగ్రత్తలను తీసుకోవడం వలన ఇక్కడ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవడం జరుగుతుందనిపాపికొండల టూరిజం యాజమాన్యం ఈ ప్రకటనలో తెలిపారు .

## మోటార్ బైక్‌ల దొంగ అరెస్ట్

- వాడపల్లి ఆలయంలో వరుస బైక్ చోరీలకు పాల్పడిన నిందితుడు.
- నాలుగు మోటార్ సైకిళ్లు స్వాధీనం.. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.



వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న మోటార్ సైకిళ్ల చోరీల కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి సుమారు రూ.3 లక్షల విలువైన నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్. విద్యాసాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఆత్రేయపురం ఎస్ఐ ఎస్. రాము తన సిబ్బందితో కలిసి బొబ్బర్లంక సెంటర్ వద్ద విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో దొంగిలించిన మోటార్ సైకిల్‌పై వెళ్తున్న సబ్బు వీరబాబు (27), ఇందుకూరుపేట గ్రామం, దేవీపట్నం మండలానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు గత కొద్ది రోజులుగా వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ పార్కింగ్ ప్రాంతంలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి మొత్తం నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని కొత్తపేట కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు పోలీసులు వెల్లడించారు. ఆలయాలకు వచ్చే భక్తులు తమ వాహనాలను భద్రంగా పార్క్ చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## హక్కుల పరిరక్షణ కోసం గర్జించిన ఆదివాసీలు.




ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం

హక్కుల పరిరక్షణ కోసం ఆదివాసీల గర్జనతో కోట రామచంద్రపురం, ఐటీడీఏ దద్దరిల్లింది. 1/70 చట్టం అమలు,ఆదివాసీ హక్కుల పరిరక్షణ, జీవో నెం.3 పునరుద్ధరణ, తదితర డిమాండ్లతో బుధవారం వివిధ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కోట రామచంద్రపురం ఐటీడీఏ వద్ద ఆదివాసీ గర్జన పేరుతో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆదివాసీ గర్జన ర్యాలీకి ఆదివాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ర్యాలీ సందర్భంగా "జీవో నెం.3 అమలు చేయాలి", "1/70 చట్టాన్ని పరిరక్షించాలి", "ఆదివాసీ హక్కులను కాపాడాలి" అంటూ నినాదాలతో ఐటీడీఏ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.అశోక్, ఆదివాసి గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు కారం ధారయ్య, జీవీఎస్ జిల్లా నాయకుడు రమేష్, ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు ముక్కయ్య, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష-కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్, జాతీయ ఆదివాసి పాస్టర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఫిలిప్స్, గిరిజన నాయకురాలు మొడియం నాగమణి, తదితరులు మాట్లాడుతూ, గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని, జీవో నెం.3ను వెంటనే అమలు చేయడంతో పాటు 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కారం భాస్కరరావు, పోలోజు నాగేశ్వరరావు, కారం ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు అధికారులను హెచ్చరిస్తూ, ఆగస్టు 9వ తేదీ లోపు జీవో నెం.3 పై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఆదివాసుల హక్కుల సాధన వరకు పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## క్షేత్రస్థాయిలో పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

### బిజెపి అధ్యక్షులు అడబాల

ప్రజా భూమి ప్రతినిధి-రామచంద్రపురం



డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో రామచంద్రపురం నియోజకవర్గ సంస్థాగత సమావేశం రామచంద్రపురం నియోజకవర్గ బి.ఎల్.ఏ కన్వీనర్ సలాది శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా జిల్లా బిజెపి అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, జిల్లా బిజెపి ఇంచార్జ్ కారంకి శ్రీనివాస్,బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, బిజెపి సీనియర్ నాయకులు కర్రి చిట్టిబాబు తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో క్షేత్రస్థాయిలో పనిచేయాలని,ప్రతి బూత్‌ను బలోపేతం చేయడం,పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం,కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడం మన ప్రధాన బాధ్యతని పేర్కొన్నారు.ప్రతి మండలం,ప్రతి గ్రామం,ప్రతి బూత్‌లో సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయాలి. కొత్త కార్యకర్తలను చేర్చుకోవడం,ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని నియోజకవర్గ బిజెపి నాయకులు కార్యకర్తలకు సూచించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ బలాన్ని నిరూపించే కీలక అవకాశమని క్రమశిక్షణ,సమన్వయం, సేవాభావంతో ప్రతి నాయకుడు,ప్రతి కార్యకర్త పనిచేస్తే పార్టీ విజయం తథ్యమని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, రాష్ట్ర కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు,జిల్లా బిజెపి ఉపాధ్యక్షురాలు, ఎం.పి.టి.సి.కొప్పన లక్ష్మి,మండల అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ,పుణ్యమంతుల శివాజీ,దునే శ్రీనివాస్,కొప్పిశెట్టి చంద్రరావు,బిజెపి కార్యవర్గ సభ్యులు అవసరాల వెంకటరమణ మూర్తి,కొట్టువాడ హరిబాబు,జిల్లా బిజెపి యువ మోర్చ అధ్యక్షులు గాజాల కళ్యాణ్, గంగవరం బిజెపి ఇంచార్జ్ రాఘవేంద్ర తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఏలూరు, నూజివీడు స్టేషన్లలో మరిన్ని సూపర్ ఫాస్ట్ రైళ్ల హాల్ట్‌కు చర్యలు తీసుకోవాలి

### ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు



ఏలూరు, నూజివీడు రైల్వే స్టేషన్లలో మరిన్ని సూపర్ ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు లోక్‌సభలో ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ఏలూరు రైల్వే స్టేషన్‌లో 152 సూపర్ ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్, మెయిల్, సాధారణ రైళ్లు, నూజివీడు రైల్వే స్టేషన్‌లో 18 సూపర్ ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్, సాధారణ రైళ్లు హాల్ట్ కలిగి ఉన్నాయని మంత్రి తెలిపారు. గత ఐదేళ్లలో అదనపు రైళ్ల హాల్ట్‌ల కోసం ప్రజాప్రతినిధులు, ప్రయాణికుల నుంచి వచ్చిన పలు ప్రతిపాదనలు రైల్వే బోర్డు, జోనల్ రైల్వే అధికారుల పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు. స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ, ట్రాఫిక్ పరిస్థితులు, కార్యాచరణ సాధ్యత వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం అదనపు రైళ్ల హాల్ట్‌లపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. ఏలూరు, నూజివీడు ప్రాంతాల ప్రజల ప్రయాణ సౌకర్యాల కోసం ఈ అంశాన్ని తాను నిరంతరం కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ తెలిపారు.

# ఓటరు సవరణ జాబితాపై అప్రమత్తత అవశ్యం

### పార్టీ శ్రేణులకు బిజెపి జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ విజ్ఞప్తి

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు



బూత్ స్థాయిలో భారతీయ జనతా పార్టీ బలపడటానికి పార్టీ శ్రేణులు క్షేత్ర స్థాయి పర్యటన చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ పిలుపునిచ్చారు. బుధవారం బిజెపి జిల్లా కోశాధికారి, బి. ఎల్. ఓ 1 మాటూరు రవికాంత్ అధ్యక్షతన జరిగిన నూజివీడు నియోజకవర్గ బి. ఎల్. ఓ 2 ల కార్యశాల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమీషన్ నిర్వహిస్తున్న " సర్ " కార్యక్రమాన్ని పార్టీ నియమించిన బి.ఎల్.ఓ 2 లు ప్రతిష్టాత్మకంగా భావించి ఓటర్ల జాబితా సవరణలో పాల్గొనాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదులో ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. డబల్ ఎంట్రీ,మృతి చెందిన ఓటర్ల తొలగింపులో తగినసమాచారాన్ని అధికారులకుఅందించాలన్నారు. సవరణ జరిగిన ఓటర్ల జాబితాలో తప్పు ఒప్పులను గుర్తించి సర్ అధికారులకు ఫిర్యాదు చేయాలని విక్రమ్ కిషోర్ సూచించారు. జిల్లా ఇంచార్జ్ రామకుమార్ మాట్లాడుతూ త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసి పార్టీ శ్రేణులు ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కావాలని కోరారు. ఇదే అజెండాతో సర్ కార్యక్రమంలో విరివిగా పాల్గొనాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లే అవకాశం సర్ కార్యక్రమంతో కలుగుతుందని పార్టీ ఎంపిక చేసిన ప్రతినిధులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గాదె రాంబాబు, నగరపాటి సత్యనారాయణ, మాజీ ప్రధాన కార్యదర్శి మల్లెపూడి రాజశేఖర్,మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ కుంపటి అరుణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.ఆర్. కె. రంగారావు,జిల్లా ఉపాధ్యక్షులు బోను అప్పారావు, శివరాజు వసుంధరదేవి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి దొడ్డా నాగరాజు, కొండయ్య సత్రం ఛైర్మన్ మాటూరి ప్రసాద్, నూజివీడు రూరల్, ముసునూరు, ఆగిరిపల్లి మండలాల అధ్యక్షులు నక్కా శివ శేషు, బడుగు శ్రీకాంత్, సనా రంగారావు, భావరాజు పుల్లారావు,ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాగంటి వాసు మాస్టారు, గోనేని అప్పారావు, మానూరి ప్రసాద్, కోటగిరి అనిల్,నక్కా శ్రీనివాసరావు, రాయపాటి లీలా విజయ జ్యోతి, లాలయ్య,అంబటి మల్లేశ్వరరావు,దోసపాటి మల్లికార్జున జగదీష్, దద్దాల రవికిషోర్,మరీదు శ్రీకాంత్,మాగంటి వాణి,చాట్రాతి సూర్య ప్రకాష్ కుమార్ తదితరులతో పాటు నియోజకవర్గ పరిధిలోని బి. ఎల్. ఓ 2 లు పాల్గొన్నారు.